# నూరేళ్ల
# ఉత్తమ మలయాళ కథలు



అనువాదం:
నలిమెల భాస్కర్

నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్

# నూరేళ్ళ ఉత్తమ మలయాళ కథలు

అనువాదం : నలిమెల భాస్కర్

## నూరేళ్ళ

# ఉత్తమ మలయాళ కథలు

అనువాదం

**నలిమెల భాస్కర్**

**నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

124095

ప్రచురణ సంఖ్య : 1411

ప్రథమ ముద్రణ : నవంబర్, 2016

వెల : ₹ 80/-

ప్రతులకు : నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్
ఎమ్.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ -20
ఫోన్ : 040 - 27660013

బ్రాంచీలు : నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ బ్రాంచీలు
హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.,
నల్గొండ, హన్మకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్

ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలు
విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు

ముద్రణ : నవతెలంగాణ ప్రింటర్స్ ప్రై. లిమిటెడ్, హైదరాబాద్

# విషయసూచిక


రెండవసారి మలయాళ మధురిమలు ........................................ 7

ముందుమాట................................................................. 9

వరద ........................................................ 13

ఓ మనిషి ........................................................ 21

రాచ్చియమ్మ ........................................................ 27

కొయ్యబొమ్మలు ........................................................ 49

చీకటి ఆత్మ ........................................................ 61

వెలుతురు చిమ్ముతోన్న అమ్మాయి ........................................ 97

సముద్ర తీరంలో... ........................................ 107

నాగలి చప్పుడు ........................................ 117

పక్షి వాసన........................................ 129

హిగ్విట్ట ........................................ 137

# రెండవసారి మలయాళ మధురిమలు

**సా**హిత్య ప్రక్రియలు అన్నింటిలోకీ అత్యంత ప్రధానమైనది "కథ". ఈ కథని మనం కథానిక అని కూడా వ్యవహరిస్తున్నాం. వచన సాహిత్యంలో కథ ఇంత ప్రాముఖ్యాన్ని సంతరించుకోవడానికీ, అత్యధిక విలక్షణ సమన్వితం కావడానికి ముఖ్య కారణం, అది జీవితానికి దగ్గర కావడం. సమాజంలోని నిమ్నోన్నతాలను యధాతథంగానూ, కళాత్మకంగానూ చూపించడం. మనుషుల బాహ్య ప్రవృత్తులనూ, ప్రవర్తనలనే కాకుండా కథ మనిషి మనస్సులోనే ఆంతరిక ప్రకృతులనూ పాఠకలోకానికి అందించింది. కథకు పాఠకుల సంఖ్య ఎక్కువ. కారణం అది కాల్పనిక సాహిత్య ప్రక్రియ కావడం. కేవలం భావోద్వేగ ప్రకటన అయిన కవిత్వంలా కాక ఆలోచనాత్మకమైన ప్రక్రియ కావడం వల్ల చాలామందికి అందుబాటులోకి వచ్చింది.

కథకు సంబంధించిన లక్షణాలు అన్ని కొంచెం ముందూ వెనకా కాస్త అటూ ఇటూ భారతీయ భాషలు అన్నింటిలోనూ దాదాపు ఒకేలా వున్నాయి. మలయాళ సాహిత్యంతో తొలి కథ 1891లో వచ్చింది. రాసిన వ్యక్తి వేంగయిల్ కుంబి రామన్ నాయనార్. 1930ల వరకూ మలయాళంలోని తొలినాళ్ళ కథలకు మానవ జీవితంలోని లోతుల్ని బాగా ఆవిష్కరించగల్గిన సామర్థ్యం లేకుండా పోయింది. 1930ల నుండి 1950ల వరకు మలయాళ కథకు స్వర్ణయుగం. యుగకర్తలైన చాలామంది కథలు రాశారు ఈ దశలో. స్పష్టమైన సిద్ధాంత జ్ఞానంతో, సూక్ష్మమైన మనస్తత్వ శాస్త్ర స్పృహతో – తగళి శివశంకరపిళ్ళై, మొదటిసారిగా ముస్లిం జీవితాల్లోని పరిస్థితుల్ని యధాతథంగా చిత్రించిన వైక్యం – మహమ్మద్ బషీర్, క్రైస్తవ జీవితాల్లోని సామాజిక అంతరాలను, ఆధిపత్యాలను ధిక్కరించిన సాహసి – పొన్‌కున్నం వర్కి మొదలైన దిగ్దంతులు ఈ దశలో అద్భుతమైన కథా రచన చేశారు.

1950 నుండి 1960ల మధ్య ఎం.టి. వాసుదేవన్ నాయర్, టి. పద్మనాభన్ మొదలైన కథా రచయితలు మనస్తత్వశాస్త్రం వెలుగులో మనిషి మనస్సులోని సంవేదనలకు పెద్ద పీట వేశారు. నాయర్ల సమష్టి కుటుంబం ఎట్లా విధ్వంసమవుతున్నదో ఎం.టి. ఆవిష్కరించి చూపారు. మలయాళ సాహిత్యంలో కేవలం కథకు మాత్రమే అంకితమై రాస్తున్న ఏకైక వ్యక్తి టి. పద్మనాభన్.

1960ల కన్నా ముందు మనిషి మీదా, మనిషి మంచితనమ్మీదా అచంచలమైన విశ్వాసం కల్గి వున్న ఉఱూబ్, ఉపాధ్యాయ జీవితాల్లోని కష్టసుఖాల్నీ కడగండ్లనీ కారూర్ చాలా గొప్పగా అక్షరబద్ధం చేశారు.

ఇక 1960ల తర్వాత మాధవి కుట్టి, ఓ.వి. విజయన్ తదితరుల రంగ ప్రవేశంతో మలయాళ కథ కొత్త మలుపులు తీసుకుంది. అప్పటి సమాజంలో చలామణీ అవుతున్న విలువలన్నింటినీ తృణీకరించిన రచయిత్రి మాధవి కుట్టి. ఈమే కమలాదాస్ అనే పేరుతో ఆంగ్లంలో కవిత్వం రాస్తుంది ఆ తర్వాత ముస్లిం మతంలోకి మారి కమలా సురయ్యా అయ్యింది. విబియన్ బహుముఖ ప్రతిభాశాలి. ఎన్.ఎస్. మాధవన్ లాంటి వాళ్ళు ఆధునికులు.

మలయాళ కథ ఆవిర్భవించి 1991 నాటికే నూరేళ్ళు అయిన సందర్భంగా "మలయాళ మనోరమ" అనే పత్రిక కవులూ, రచయితలూ, పాత్రికేయులూ, విమర్శకులూ, ప్రచురణ కర్తల్నీ సంప్రదించి 146 కథల్ని ఎంపికచేసింది. వాటిల్లోంచి జనప్రియత్వం ఆధారంగా ట్యాబ్‌లేట్ చేసి ఓ పది కథల్ని ఎన్నుకొని తమ పత్రికలోనే ప్రచురించింది. ఈ పత్రికను నిజాం వేంకటేశం సార్ నా కోసం కొనుక్కుని తీసుకొచ్చాడు. వాటిని అనువదించి 1993లో "నూరేళ్ళ పది ఉత్తమ మలయాళ కథలు" అనే పేరున తెలుగు పాఠకులకు అందించాను. అచ్చు వేసిన వెయ్యి ప్రతులూ ఒక సంవత్సరంలోనే అమ్ముడైపోయిన కారణంగా ఆ పుస్తకాలు అందుబాటులో లేకుండా పోయాయి. ఆయా కారణాల వల్ల నేను స్వయానా మరలా ఆ సంకలనాన్ని ప్రచురించలేకపోయాను. ఇప్పుడు మళ్ళీ ఒకసారి ఇరవైమూడు ఏళ్ళ తరువాత ఈ కథా సంకలనం నవతెలంగాణ తరఫున పునర్ ముద్రించబడటం ముదావహం. ప్రచురణకర్తలకు నా కృతజ్ఞతలు.

చివరగా ఒక్కమాట! ఈ కథల్ని నేను నేరుగా మలయాళం నుండి అనువదించాను. మక్కికి మక్కి అన్నట్లు కాకుండా మూలవిధేయానువాదం చేశాను. కథ, కవిత్వం మొదలైన అనువాదాల్లో అంటే సాహిత్యానువాదాల్లో కొంత స్వేచ్ఛ తీసుకోవచ్చును. కానీ నేను ఆ పని చేయలేదు. కారణం ఈ కథలు మలయాళంలో గత వందేళ్ళలో వచ్చిన ఉత్తమమైన పది కథలు. వాటిని యథాతథంగా చూపించాలన్నదే నా సంకల్పం. ఇంకేం? మలయాళ మధురిమల్ని ఆస్వాదించండి.

**27-10-2016,** **- డా॥ నలిమెల భాస్కర్**

**కరీంనగర్.**

# ముందుమాట

**కే**రళ ప్రజలూ, వారి మలయాళ భాషా మనకు అతి సన్నిహితం అన్నట్లు ధ్వనిస్తుంటుంది. కారణాలు అనేకం.

మనం పుట్టకముందే మన "యుగ పురుషుడు" కందుకూరి వీరేశలింగం పంతులుగారు "సత్యరాజా పూర్వదేశయాత్రలు" అనే పేర ఓ పుస్తకం రాసి ఆ పేరు క్రింద బ్రాకెట్లలో "అను, ఆడ మలయాళము" అనే మరో పేరు కూడా జోడించారు.

దేశంలో కెల్లా అత్యధిక శాతం విద్యావంతులున్న రాష్ట్రంగా పూర్వం నుండి కూడా కేరళకు ప్రాముఖ్యం ఉంది.

కేవలం అక్షరాస్యత మాత్రమే కాదు, అందుకు తగిన స్థాయిలో పఠనాతృష్ణ కూడా విపరీతం అనేందుకు ఉదాహరణగా అక్కడ ఆఫీసు బంట్రోతులు కూడా తీరిక సమయాల్లో దినపత్రికో, వారపత్రికో, పుస్తకమో చదువుతూ కూర్చుంటారని ఒకప్పుడు విశేషంగా చెప్పుకునే వాళ్ళం.

అందుకు తగ్గట్లే అక్కడి కొన్ని పత్రికలు కూడా ఆశ్చర్యకరమైన సంఖ్యలో అచ్చయి అమ్ముడుపోతూ వుంటాయి. సుప్రసిద్ధమైన మలయాళ మనోరమ దినపత్రిక తాజాగా ఏడు లక్షల కాపీల దాకా నిత్యం అమ్ముడవుతుండగా, అదే పేరుతో వచ్చే వారిదే వారపత్రిక పదకొండున్నర లక్షలు అమ్ముడవుతోంది. భారతదేశంలోని అన్ని భాషలలో ఇవే రికార్డు సంఖ్యలు.

ఇవిలా ఉండగా, రాజకీయంగా కేరళ ప్రజలు పరిణితి చెందిన వారనే అభిప్రాయం కూడా వుంది. ఆశ్చర్యకరంగా నేటికి దాదాపు మూడున్నర దశాబ్దాల నాడే వారు ప్రజాస్వామ్య పద్ధతుల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే కమ్యూనిస్టులు రాజ్యాధికారంలోకి వచ్చేలా చేశారు. ఎన్నికల్లో ఘన విజయాలు సాధించి పెట్టారు.

అయినా ఆ కేరళ ప్రజల గురించి, వారి మలయాళ భాషా సాహిత్యం గురించి మనకు తెలిసింది చాలా తక్కువ.

తకళి శివశంకర పిళ్లె "చెమ్మీన్" నవలకు అఖిల భారత స్థాయి జ్ఞానపీఠ్ అవార్డు రావడంతో, ఆ నవలే సినిమాగా కూడా రూపొంది మనం కూడా చూసే అవకాశం కలగడంతో మలయాళ సాహిత్యం మనకు సన్నిహితంగా వచ్చి మన ఆసక్తిని పెంచింది. ఎమర్జెన్సీలో ఆగిపోయే దాకా దేశంలోనే ఏకైక రాజకీయ కార్టూన్ల పత్రికగా సుప్రసిద్ధమైన 'శంకర్స్ వీక్లీ" సంస్థాపకుడు, సంపాదకుడు అయిన "సుప్రసిద్ధ కార్టూనిస్టు శంకర్ పిళ్లై మలయాళీయే. విశిష్ట శైలితో మేధావి పాఠకులను ఆకట్టుకున్న ఓ.వి. విజయన్ కార్టూనిస్టే గాక ప్రసిద్ధి పొందిన కథా రచయిత కూడా.

ఇంతగా సుప్రసిద్ధమై సర్వతోముఖంగా వికసించిన మలయాళ సాహిత్యంతో తెలుగు వారి పరిచయం ప్రత్యేకించి చెప్పుకోదగిన స్థాయిలో లేకపోవడం సమర్థించు కోదగినది కాదు. ఆ భాషలో అక్షరాస్యులూ, విద్యాధికులూ, పత్రికలూ అధిక సంఖ్యలో ఉండటమే గాదు, పుస్తక ప్రచురణ కూడా మరే రాష్ట్రంలోనూ, భాషలోనూ లేనంతగా అభివృద్ధి చెందిందే నాడో వేల సంఖ్యలో గ్రంథ ప్రచురణ చేసిన కేరళ రచయితల సహకార గ్రంథ ప్రచురణాలయం దేశం మొత్తం మీదనే విఖ్యాతమై, ఆదర్శప్రాయంగా నిలిచినా, మరే భాషా సాహితీపరులూ ఆ దారిని అనుసరించలేకపోయారు.

మనల్నింతగా ఆకర్షించిన కేరళ ప్రజల మలయాళ భాషా సాహిత్యం మనకు అందవలసిన స్థాయిలో నేటికీ అందడం లేదు. ఇతర భాషలతో ఉన్నంతగా మలయాళ భాషలో ప్రావీణ్యం సాధించిన తెలుగు వారు గానీ, తెలుగులోకి అనువదించగల మలయాళ సాహితీపరులు గానీ దాదాపుగా లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. పదిహేనేళ్ళ క్రితం, ఆనాటికే కాదు, నేటికి కూడా మరే భారతీయ భాషలోనూ లేని "వివిధ భాషా కథా వేదిక"గా ప్రసిద్ధమైన "విపుల" ప్రారంభించినపుడు మరే ఇతర భారతీయ భాష కన్నా కూడా ఈ మలయాళ భాష నుండే కథా సాహిత్యాన్ని నేరుగా ఆ భాష నుండే అనువదించగల వారి కొరత సంపాదకునిగా నేనెదుర్కొన్నది.

"విపుల" ఈ పదిహేనేళ్ళలో అందాకా వివిధ భాషల నుండి సేకరించి ప్రచురించిన దాదాపు మూడు వేల కథలలో నూట యాభై దాకా మలయాళ కథలున్నాయి. తొలి నాళ్ళ సుప్రసిద్ధ మలయాళ రచయితల నుండి నేటి యువతరం దాకా ఉన్న ఈ రచయితల కథలలో అధిక శాతం హిందీ, ఇంగ్లీష్ భాషల సాయంతో అనువదించినవే. ఒక దశలో ఈ లోటును పూరించిన ఏకైక వ్యక్తి నా. భక్తవత్సలరెడ్డిగారు కాగా, ప్రస్తుతం ఆ పని చేయగలుగుతున్న యువ సాహితీపరుడు నలిమెల్ల భాస్కర్‌గారు.

"స్వబోధిని" సాయంతో మరికొన్ని ఇతర భాషలతో పాటు మలయాళ భాషను కూడా నేర్చుకున్న భాస్కర్‌గారు ఇపుడు ప్రత్యేకించి ఓ సంకలనాన్నే అనువదించి ప్రచురిస్తున్నారు. ఇంతకుముందే పేర్కొన్న "మలయాళ మనోరమ" పత్రిక నూరేళ్ళ

మళయాళ కథా సాహిత్యంలోని అసంఖ్యాక కథల నుండి ఎన్నిక చేసిన పది కథలను ప్రత్యేకాభిమానంతో అనువదించి మీ ముందుంచుతున్నారు.

కథల ఎన్నిక భాస్కర్ గారిది కాదు. అనువాదం వరకే ఆయన బాధ్యత. ఎన్నిక చేసినది. తిరుగులేని అథారిటీ అనదగిన పత్రిక గనుక ఆ విషయంలో చర్చకు ఆస్కారం లేదు. అదే సమయంలో ఈ కథలు మన తెలుగు పాఠకులకు సుపరిచితాలుగా అనిపించినా ఆశ్చర్యం లేదు. తెలుగు రచయితలిప్పటికే వేలాది కథలతో మన సాహిత్యాన్ని సుసంపన్నం చేయగా చదివేసిన మన పాఠకులను సంతృప్తిపరచడం ఏమంత తేలిక కాదు.

సాహిత్యం విషయంలో అనువాదం అనేది భాష వచ్చి ఉండి, పుస్తకాన్ని ముందే సమకూర్చుకున్నంత మాత్రాన అయిపోయేది గాదు. ఆ రెండు భాషల జీవ శక్తిని అవగతం చేసుకుని ఉండటంతో పాటు, మూల భాషా ప్రాంత జీవన సరళిని, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకుని ఉండాలి. నుడిలోని పలుకుబడితో పాటు జాతి జీవనాడి గ్రహించగలిగి వుండాలి. అలాగే అనువాదం యధాతథంగా ఉండాలి. కాని ముక్కకు ముక్కానువాదంగా ఉండరాదు. ఆంగ్లంలో దీనినే వర్డ్ టూ వర్డ్ ట్రాన్స్‌లేషన్ అంటారు. మన అకాడమీలు, ప్రభుత్వ సంస్థలు ఈ పద్ధతిని పాటించడం వలననే వారి అనువాద సాహిత్యం అటకల మీదనే ఉండిపోతున్నది. యధాతథానువాదం సమర్ధవంతంగా కొనసాగాలంటే పైన పేర్కొన్న "గ్రహింపుట" తప్పనిసరి.

ఆ దారిలోనే ఉన్నారు నలిమెల భాస్కర్‌గారు. తొలి దశలో చేసిన అనువాదాలు సర్వులను సంతృప్తిపరచకలేకపోవచ్చు. కానీ...

ఒక సాహిత్యాభిమానానికి, అటు మూల రచయితల పట్ల, ఇటు తెలుగు పాఠకుని పట్ల ఉండవలసిన "బాధ్యత" విషయంలో ఈ అనువాదకుడు ప్రదర్శిస్తున్న "నిజాయితీ"ని గమనించాలి.

దీనిని నిలబెట్టుకున్నంత కాలం ఈ మార్గాన్ని విజయపథంగా మలుచుకోవడం భాస్కర్‌గారికి ఏమంత కష్టం కాబోదు.

కథలు మీ ముందున్నాయి. వాటి బాగోగులు నిర్ణయించవలసిన వారు మీరే.

అనువాదకుని విషయంలో అతనికి గల పరిమితులను దృష్టిలో వుంచుకుని నేరుగా మలయాళ భాష నుండి అనువదించిన సాహసిగా సానుభూతితో పరిశీలించడం మీ వంతు.

త్వరలోనే భాస్కర్‌గారు ఇప్పుడు మనం వేస్తున్న అంచనాలను అధిగమించి దూసుకుపోగలరనడంలో సందేహం లేదు.

**– చలసాని ప్రసాదరావు**

**14 ఆగస్టు, 1993.**



# తగళి శివశంకర పిళ్ళై

17-4-1912 జననం. అల్లెప్పీ జిల్లాలో అంబలప్పుళ సమీపంలోని తకళి అనే గ్రామంలో జన్మించారు. "తోట్టియుడె మగన్" (పాకీ మనిషి కొడుకు) అనే మొదటి నవల వీరికి ఖ్యాతిని తెచ్చి పెట్టింది. (1947) తర్వాత 'రండిడంగళి' (రెండు సేర్లు / కూలి గింజలు) ప్రచురించారు. 1957లో చెమ్మీన్ (రొయ్యలు) నవలనీ, 1978లో కయర్ (తాడు)నీ వెలువరించారు. వయలార్ అవార్డు (1980), కేంద్ర సాహిత్య అకాడమీ ఫెల్లోషిప్, కేంద్ర మరియు కేరళ సాహిత్య అకాడమీల అవార్డులు (1989), జ్ఞానపీఠ పురస్కారం (1984) .... ఇలా అనేక సన్మానాలు పొందారు. 1985లో పద్మభూషణులయ్యారు. కొంతకాలం కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా పనిచేశారు.

భాషా సాంప్రదాయపు సంకెళ్ళని తన ఎడం చేత్తో తోసిరాజని చిన్న చిన్న వాక్యాలతో మలయాళ భాషా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ఈ రచయిత మలయాళీలకు గర్వకారణం. వ్యధార్థ జీవిత యధార్థ దృశ్యాల పదార్థమే వీరి సాహిత్యమంతా. మనిషికి మట్టితో వున్న సంబంధాన్ని చక్కగా చిత్రీకరిస్తారు.

వీరు 36 నవలలూ, 600కు పైగా కథలూ రాశారు. ఏణిప్పడిగళ్ (నిచ్చెన మెట్లు), అనుభవంగళ్ (అనుభవాలు), ఔసేప్పిండె మక్కళ్ (ఔసేప్పు పిల్లలు) అనేవి వీరి తదితర ప్రధాన కృతులు. వీరి చెమ్మీన్, రండిడంగళి, తోట్టియుడె మగన్ మొదలైన నవలలు భారతీయ భాషల్లోకే కాకుండా ఇతర ప్రపంచ భాషల్లోకి అనూదితమయ్యాయి.

'కయర్' నవల ఐదారు తరాలకు చెందిన బృహద్గ్రంథం. దాదాపు నాలుగు వందల పాత్రలతో ఒకటిన్నర శతాబ్దపు కథ అది.

# వరద

**- తగళి శివశంకర పిళ్ళై**

**ఊ**రి దేవాలయంలోకి కూడా వరద వచ్చేసింది. దేవుడు పీకల బంటి నీటిలో మునిగి వున్నాడు. వరద ! ఎటు చూసినా నీళ్ళు. సర్వత్రా జల ప్రళయం. ఊళ్ళో వున్న చాలామంది అప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళారు. సొంతంగా పడవలు ఉన్నవాళ్ళు మాత్రం ఎవరో ఒకరిని ఇంటికి కాపలాగా వుంచి వెళ్ళిపోయారు. వరదలు వచ్చాయంటే చాలు దొంగలకు మంచి అవకాశం. అందుకని కొంతమంది తమ తమ ఇళ్ళ కాపలా కోసం పడవలతో సహా వుండిపోయారు. వరద బాగా వచ్చినట్లయితే పడవలో సామాగ్రి వేసుకొని వెళ్ళిపోవచ్చు. గుళ్ళో మూడు గదులున్నాయి. వాటి మీది అంతస్తులో అరవై ఏడుగురు పిల్లలున్నారు. మొత్తం మూడు వందల యాభై ఆరు మంది. కుక్కలు, పిల్లులు, మేకలు, కోళ్ళు... మొదలైన పెంపుడు జంతువులతో గోల గోలగా వుంది. అయితే అంతా కలిసి మెలిసి వున్నారు. ఎలాంటి గొడవలూ లేవు.

చేన్నన్ ఒక రాత్రీ, ఒక పగలూ నీటిలోనే నిలుచుని వున్నాడు. అతనికి పడవ లేదు. నీళ్ళు అతని గుడిసెలోకి ప్రవహించడం ప్రారంభం కాగానే ముందు కొబ్బరి మట్టలతోనూ, వెదురుతోనూ ఓ అటక కట్టి ఎత్తు పెంచాడు. వరద వెంటనే తగ్గిపోతుందనుకుని లోన కూచుని రెండు రోజులు గడిపాడు. అతనికి ఐదారు అరటి చెట్లే కాకుండా గడ్డి మోపులూ వున్నాయి. ఆ చెట్లు గెలలు వేసి వున్నాయి. గుడిసె ఖాళీ చేసి వెళ్ళిపోతే వాటిని ఎవరైనా ఇట్టే ఎత్తుకుపోవచ్చు.

ఇప్పుడు అటక మీదికి, మంచె మీదికి మోకాలి బంటి నీళ్ళు వచ్చేశాయి. ఇంటి చూరుకు వేళ్ళాడుతున్న ఆకులు నీటిలో మునుగుతున్నాయి. లోపలి నుంచే చేన్నన్ "కాపాడండి" అంటూ ఎవరినో పిలుస్తున్నాడు. అతని పిలుపు ఎవరు వింటారని?

అసలు దగ్గరలో ఎవరు వున్నారని? గర్భవతి అయిన అతని భార్య, నలుగురు పిల్లలు, ఓ పిల్లి, ఒక కుక్క.... ఇంతే! వీటితోనే అతని నివాసం. అతనే ఆశ్రయం వీళ్ళందరికీ. వరద ఇలాగే వస్తే గుడిసె మీంచి నీళ్ళు ప్రవహించడానికి, తనకి తన కుటుంబానికి నూకలు చెల్లిపోవడానికి పన్నెండు గంటలు సరిపోతాయని అతను లెక్కలు కట్టాడు. భయంకరమైన వర్షం ప్రారంభమై అప్పటికే మూడు రోజులైంది. పై కప్పుకు ఉన్న సందులోంచి చేన్నన్ బయటికొచ్చి చుట్టూ పరికించాడు. ఉత్తరం దిక్కు నుంచి ఉధృతంగా నీటి ప్రవాహం ఉరకలు వేస్తోంది. చేన్నన్ బిగ్గరగా పడవ వాళ్ళని కేకేసి పిలిచాడు. అదృష్టవశాత్తు అతని మాటలు వాళ్ళకి విన్పించాయి. వాళ్ళు పడవని అతని గుడిసె వేపు తిప్పారు. పిల్లల్నీ, పెళ్ళాన్నీ, కుక్కనీ, పిల్లినీ, పై కప్పుకు వున్న వాసాల మధ్యలోంచి బయటికి తెచ్చాడు చేన్నన్. అప్పటికి పడవ కూడా వచ్చేసింది.

పిల్లలు పడవలోకి ఎక్కుతున్నారు.

"చేన్నచ్చా! వెళుతున్నావా?" ఎవరో పడమర నుంచి పిలుస్తున్నారు. చేన్నన్ అటుకేసి తిరిగాడు.

"వస్తావా?"

అతని మడియత్తుఅ కుజ్జేప్పన్. గుడిసె బయటి నుంచి పిలుస్తున్నాడాయన. చేన్నన్ తన భార్యని పడవ ఎక్కించాడు. పిల్లి కూడా పడవ లోకి దూకేసింది. కుక్క విషయం ఏ ఒక్కరూ ఆలోచించలేదు. అది గుడిసెకు పడమటి వాలులో అక్కడా ఇక్కడా వాసన చూస్తూ నడుస్తోంది.

పడవ కదిలిపోయింది. కనుచూపు మేర దాటిపోయింది.

కుక్క చూరు మీదకి వచ్చింది. చేన్నన్ కుటుంబం పడవలో బహు దూరం తరలిపోయింది. ఆ పడవ ఉరుకులు, పరుగులతో వెళుతోంది. కుక్క ప్రాణభయంతో మొరగడం మొదలుపెట్టింది. అసహాయుడైన ఓ మనిషికి మల్లే అది దీనంగా మొరుగుతోంది. దాని బాధ వినడానికి ఎవరున్నారు? గుడిసె చుట్టూ అది పరుగులు పెడుతోంది. కొన్ని చోట్ల వాసన చూస్తోంది. మొరుగుతోంది.

మొరుగుతున్న కుక్కకు భయపడి గుడిసె బయట వున్న ఓ కప్ప ఉన్నట్టుండి 'ధడిం' అనే శబ్దం చేస్తూ నీళ్ళలోకి దూకింది. కుక్క భయాశ్చర్యాలతో వెనక్కి తగ్గి, నీళ్ళలో కలిగిన కదలికల్ని కాసేపు నిశితంగా చూస్తూ నించుని వుండిపోయింది.

ఆహారం కోసం కావొచ్చు. ఆ జంతువు అటూ ఇటూ అంతటా తిరుగుతూ వాసన చూస్తోంది. ఓ కప్ప దాని నాసారంధ్రాల్లో మూత్రం పోసి చల్లగా నీళ్ళలో

దూసుకుపోయింది. కుక్క ఇబ్బందిపడిపోతూ తుమ్మింది. ముందరి కాళ్ళతో ఓ మారు ముట్టి తుడుచుకుంది.

కుంభవృష్టి మళ్ళీ భయంకరంగా ప్రారంభమైంది. ఓ చోట కుక్క మహా సహనంగా కూచుంది. దాని యజమాని ఇప్పటికి అంబళప్పుళ నదిని దాటిపోయి వుండవచ్చు.

రాత్రి అయ్యింది. నీళ్ళలో సగం మునిగి తేలుతోన్న గుడిసెకు రాసుకుంటూ ఓ భయంకరమైన మొసలి మెల్లగా కదిలిపోయింది. భీతిగొన్న కుక్క తోక వాల్చి మొరిగింది. మొసలి మాత్రం ఏమీ ఎరగని నంగనాచిలా వెళ్ళిపోయింది.

పై కప్పు మీద కూచుని ఆకలిగొన్న ఆ కుక్క ఆకాశం కేసి చూస్తూ మొరిగింది. ఆకాశం మేఘావృతమై వుంది. వాతావరణమంతా అంధకార బీభత్సంగా వుంది. ఆ కుక్క దీన రోదనం అతి దూర ప్రదేశాలకు చేరిపోయింది. దయార్ద్రహృదయుడైన వాయుదేవుడు దాని శోకాన్ని సుదూర ప్రాంతాల దాకా మోసుకుపోయాడు. ఇంటికి కాపలాగా వున్న ఏ దయామయుడైనా దాన్ని రక్షిస్తాడేమో! సముద్రానికి ఆవల ఇప్పుడు దాని యజమాని భోజనం చేస్తూ వుండవచ్చు. ఎప్పటిలా ఇవాళ కూడా అతను తన కుక్క కోసం ఓ ముద్ద పక్కకు పెట్టి వుండవచ్చు.

ఎడతెరపి లేకుండా ఆ కుక్క మళ్ళీ మొరిగింది. క్రమేపీ దాని మొరుగుడు తగ్గి నిశ్శబ్దమైంది. ఉత్తరాన ఎక్కడో ఇంటికి కాపలాగా వున్న మనిషి రామాయణం చదువుతున్నట్టున్నాడు. ఆ మాటలు వినవస్తున్నవేపు అది జాగ్రత్తగా మొహం పెట్టి మౌనంగా వుండిపోయింది. అది గొంతు పగిలేలా రెండోసారి మొరిగింది.

అది నీరవ నిశీథి. శ్రుతి మధురమైన రామాయణ పఠనం మరోసారి అంతటా వ్యాపించింది. శునకం ఈ మానవ శబ్దాల్ని చెవులొగ్గి వింటూ కొంతసేపు నిశ్శబ్దంగా నిలుచుంది. ఆ శీతల మారుత ప్రవాహంలో శాంత మధురమైన రామాయణ గానం పాలలో పంచదారలా కలిసిపోయింది. గాలి చేస్తున్న చప్పుడు, అలల కదలికల 'బ్లబ్బ' శబ్దాలూ తప్ప మరేమీ లేవు.

కుక్క కప్పు మీదకి ఎక్కి కూచుంది. అది గట్టిగా ఊపిరి పీలుస్తోంది. మధ్య మధ్య నిరాశగా ఏదో గొణుక్కుంటోంది. ఇంతలో ఓ చేప హఠాత్తుగా నీళ్ళల్లోంచి లేచి శబ్దం చేసింది. కుక్క ఒక్క ఉదుటున లేచి దూకుతూ మొరిగింది. మరోచోట కప్ప దూకింది. కుక్క ఎందుకో అశాంతిగా సన్నగా గొణుక్కుంది.

తెల్లవారింది. కుక్క చిన్నగా మొరగసాగింది. హృదయవిదారకమైన దాని శోకరాగం క్రమంగా అంతటికీ విస్తరించసాగింది. కప్పలన్నీ దాన్ని తరచి చూస్తున్నాయి. అవి నీళ్ళలో దూకి నీటి ఉపరితలంలో ప్రవహించడం మొదలు అన్నింటినీ కుక్క రెప్పవెయ్యకుండా గమనిస్తోంది.

నీటి ఉపరితలంలోంచి లేచి కనిపిస్తోన్న కొబ్బరి ఆకుల పాకలన్నింటినీ అది ఆశగా చూస్తోంది. అంతా నిర్మానుష్యం. ఎక్కడా పొగ లేవడం లేదు. తన శరీరాన్ని కరుస్తూ ఆనందిస్తోన్న ఈగల్ని తోకతో తోలుతోంది. కొన్నింటిని కొరుకుతోంది.

కొంతసేపు ఆకాశంలో సూర్యుడు కనిపించాడు. అది లేయెండలో మగతగా పడుకొంది. మందపవనాల మూలంగా కదులుతోన్న అరటి ఆకుల నీడలు గుడిసె మీద అలా అలా చలిస్తున్నాయి. అది చెంగున లేచి ఓ మారు మొరిగింది.

సూర్యుడు మేఘాల మాటున దాక్కుని వున్నాడు. ఊరంతా చీకటైపోయింది. గాలి అలల్ని సృష్టించింది. జల ప్రవాహంలో జంతువుల మృత కళేబరాలు కొట్టుకొని పోతున్నాయి. అవి వెల్లువకు అనుగుణంగా దూకుతూ, లేస్తూ తేలుతూ పోతున్నాయి. యధేచ్ఛగా సంచరిస్తున్నాయి. నిర్భీతిగా నడుస్తున్నాయి. కుక్క వాటివైపు ఆశగా చూస్తోంది. అది గొణుగుతోంది.

దూరంగా ఎక్కణ్ణుంచో ఓ చిన్న పడవ వేగంగా దూసుకొస్తోంది. కుక్క లేచి నించుని తోక ఊపింది. పడవ వేగాన్ని శ్రద్ధగా గమనించసాగింది. దక్షిణం వైపు వెళ్ళి పడవ క్రమంగా మాయమైంది. కుక్కకు ఎవ్వరైనా వచ్చి రక్షిస్తారని కొండంత ఆశ!

వర్షం కారడం చిన్నగా మొదలైంది. వెనక కాళ్ళు మడిచి ముందరి కాళ్ళను నేలకేసి బలంగా ఊన్చుతూ కూచుని ఆ కుక్క నలువేపులా దృష్టి సారించింది. దాని కళ్ళలో ప్రపంచంలోని ప్రతి ఒక్కరిని ఏడిపించగల అసహాయత, ఒక దయనీయ స్థితి ప్రతిఫలిస్తున్నాయి.

వాన పడుతూనే వుంది. ఉత్తరం ఇంటి నుంచి ఓ చిన్న పడవ కొబ్బరి చెట్టును సమీపించింది. కుక్క తోక వూపి ఆవులిస్తూ గొణిగింది. పడవ వాడు చెట్టు ఎక్కి బోండాం కోసి కిందికి వచ్చాడు. అతను పడవలోనే బొండాం కోసి తాగేసి తెడ్డు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

దూరంగా వున్న చెట్టు కొమ్మల్లోంచి ఓ కాకి పరుగున వచ్చి నీళ్ళలో కొట్టుకుపోతున్న పోతు మృత దేహమ్మీద వాలింది. కుక్క మొరుగుతున్నా అది లెక్క చేయక మాంసం పొడుచుకు తింది. తర్వాత తృప్తిగా ఆ కాకి ఎక్కడికో ఎగిరిపోయింది.

ఓ రామచిలుక ఇంతలో గుడిసె దగ్గర అరటి చెట్టు ఆకు మీద బైఠాయించి తియ్యగా పలికింది. కుక్క మళ్ళీ అదోమాదిరి మొరిగింది. ఆ చిలుక కూడా ఎగిరిపోయింది.

నీటిలో కొట్టుకు వస్తోన్న ఓ చీమల పుట్ట ఆ గుడిసెను తాకింది. కుక్క తప్పించుకుంది. దాన్ని చూసి ఏదో ఆహారపదార్థంగా ఎంచి కుక్క ఆ పుట్టను ముద్దాడి కసుక్కున తుమ్మి తన ముట్టి తుడుచుకుంది.

అది మధ్యాహ్న సమయం. చిన్న పడవలో ఇద్దరు వ్యక్తులు అటుకేసి వచ్చారు. కుక్క కృతజ్ఞతగా మొరిగింది. తోక వూపింది. మానవులకు సన్నిహిత సంబంధమున్న భాషలో మాట్లాడింది. మొరిగింది. అది నీళ్ళలో దిగి వాళ్ళ పడవలో దూకి తనను రక్షించుకోవడానికి సిద్ధంగా నించుంది.

ఆ ఇద్దరిలో ఒకడు "అదిగో! అక్కడ ఓ కుక్క ఉంది" అన్నాడు. అతని దయార్ద్ర హృదయం తనకు అర్థమైనట్లు అది మరోమారు కృతజ్ఞతా సూచకంగా మొరిగింది.

"ఉండనీ!" అన్నాడు రెండోవాడు.

నమలకుండా మింగుతున్న మాదిరి అది నోరు తెరిచి మళ్ళీ మూసుకుంది. తనను కాపాడతారని ఆశించింది. తర్వాత అది మాట్లాడింది. ప్రార్థించింది. రెండుసార్లు పడవలోకి దూకేందుకు ప్రయత్నించింది.

కాని పడవ దూరమైపోయింది. కుక్క మరోమారు మొరిగింది. పడవ వాళ్ళలో ఒకడు వెనుదిరిగి చూశాడు.

"అయ్యో!"

అలా అన్నది పడవ వాళ్ళలో ఎవ్వరూ కాదు. కుక్కే అలా పిలుస్తోంది.

"అయ్యో!" మళ్ళీ అంది.

బాగా అలసిపోయిన, హృదయ స్పర్శ అయిన దాని దీన రోదనం అలా గాలిలో విలీనమైంది. మళ్ళీ నీటి అలల విరామంలేని సవ్వడి. పడవ వాళ్ళలో ఎవ్వరూ వెనక్కి తిరిగి చూడనే లేదు. కుక్క మాత్రం ఆ పడవ కనుమరగయ్యే వరకూ చూస్తూ నించుంది. అది ఈ లోకంతో శాశ్వతంగా వీడ్కోలు చెబుతున్నట్లుగా గొణుక్కుంది. గుడిసె మీదికి చేరింది. బహుశా... అది ఇంక ఎప్పుడూ మానవ జాతిని ప్రేమించకూడదు అని తనలో తనే గొణుక్కుంటుందేమో!

అది కాస్త నీళ్ళు గతికింది. గగన మార్గంలో ఎగిరిపోతున్న పక్షుల్ని ఆ సాధు జంతువు గమనించసాగింది. గుడిసె దగ్గర అలల్లో ఓ నీటి కోడి వెళుతోంది. చేన్నన్,

అతని కుటుంబమూ బయటికి వెళ్ళిపోయిన సందులోంచి ఆ కోడి లోనికి వెళ్ళింది. కుక్క లోపలికి వెళ్ళి చూసి గర్జించింది. అది క్రూరంగా మొరగసాగింది. తర్వాత గొణిగింది. ఆ గొణుగుడులో ప్రాణభయమే కాక ఆకలీ వుంది. కుక్క అలా మొరగడం, దాని భాష... ఏ ప్రాంతం మనిషికైనా, ఏ భాషీయుడికైనా చాలా సులభంగా అర్ధమవుతాయి. అయినా ఎవ్వరూ కాపాడలేదు.

మళ్ళీ రాత్రి అయింది. భయంకరమైన గాలీ, వానా మొదలయ్యాయి. అలల తాకిడికి గుడిసె పైకప్పు బతుకమ్మలా ఆడుతోంది. రెండుసార్లు కుక్క కప్పు మీంచి జారి నీళ్ళలో పడబోయింది. మళ్ళీ తమాయించుకుంది. ఇంతలో ఓ పొడవాటి తల నీటి మీద తేలుతోంది. అది మొసలి తలే! కుక్క ప్రాణభయంతో మొరగనారంభించింది. దగ్గరలోనే ఎక్కణ్ణించో కోళ్ళు ఉమ్మడిగా దుఃఖిస్తోన్న శబ్దం వినిపిస్తోంది.

"ఎక్కడో కుక్క మొరుగుతున్నట్టుంది. ఇక్కణ్ణించి ఇంకా జనాలు వెళ్ళిపోలేదా?" అన్న మాటలు విన్పించాయి. ఓ పడవ అరటి చెట్టు వైపు సమీపిస్తోంది. అందులో గడ్డీ, కొబ్బరి కాయలు, అరటి గెలలూ వున్నాయి.

కుక్క ఆ పడవ వాళ్ళ వైపు తిరిగి నించుని మొరగడం మొదలెట్టింది. కోపావేశంగా తోకని ఊపుతో లేపుతో మొరుగుతోంది. పడవ వాళ్ళలో ఒకడు అరటి చెట్టు ఎక్కాడు.

"కుక్క కరుస్తుందేమో!" అన్నాడు.

అది ఉన్నట్టుండి ముందుకు దూకింది. చెట్టు ఎక్కిన మనిషి జారి నీళ్ళలో పడిపోయాడు. మరొకడు వాణ్ణి పట్టుకుని పడవలో ఎక్కించాడు. కుక్క ఈదుకుంటూ గుడిసె మీదకి వచ్చి శరీరాన్ని పొంగింపచేసింది. కోపంతో మొరుగుతూనే వుంది.

ఆ దొంగలు గెలలన్నీ కోశారు.

"నీకు ఉంచుతున్నాం లేవే!" అన్నారు. గడ్డినంతా పడవలో వేసుకున్నారు. చివరికి ఒకరు గుడిసె మీదికి ఎక్కాడు. ఇంకేం? వాడి కాలి పిక్కను నొక్కి పట్టేసింది కుక్క. దానికి నోటి నిండా మాంసం చిక్కింది. అతను "అయ్యో! కుయ్యో మొర్రో" అంటూ పరుగు లంకించుకుని పడవెక్కాడు. పడవలోంచి పెద్ద కర్రతో కుక్క మూతి మీద గట్టిగా కొట్టాడు.

"మ్యావూ! మ్యావూ!! మ్యావూ!!!" కుక్క స్వరం క్రమేపీ తగ్గి శక్తిహీనమైన ఉత్త మూలుగులా పర్యవసించింది. కుక్క కాటు తిన్న వ్యక్తి పడవలో ఇంకా ఏడుస్తూనే వున్నాడు.

"అల్లరి చెయ్యకురా! ఎవరైనా వింటే..." అన్నాడు మరొకడు. వాళ్ళు వెళ్ళిపోయారు.

కొంతసేపు అది పడవ వెళ్ళిన వేపే చూస్తూ భయంకరంగా మొరిగింది. గర్జించింది. గద్దించింది.

అర్ధరాత్రి అయ్యింది. ఓ పెద్ద పశువు మృతకళేబరం కొట్టుకొస్తూ గుడిసెకు తాకింది. కుక్క ఇదంతా కప్పు మీద నుంచుని గమనిస్తోంది. అది కిందకి దిగలేదు. ఆ శవ శరీరం మెల్ల మెల్లగా వెళ్ళిపోతోంది. కుక్క గొణుక్కుంది. తాపీగా కిందకి దిగి ఆ శవ శరీరాన్ని నోట కరుచుకుని తృప్తిగా తినసాగింది. క్రూరమైన ఆకలికి వలసినంత తిండి దొరికింది.

"ఠే!" – ఒకే దెబ్బ. ఇప్పుడు కుక్క కనిపించడం లేదు. ఇందాకటి పశువు మృత కళేబరం తేలుతూ, మునుగుతూ నీటిలో పడి కొట్టుకుపోతోంది.

పెనుగాలి చప్పుడూ, కప్పల బెకబెకలూ, అలల కదలికలూ తప్ప మరేమీ వినిపించడం లేదు. అంతా నిశ్శబ్దం. గడ్డ కట్టిన మౌనం. కుక్క అసహాయతని బహిర్గతం చేసిన మొరుగుడు చేన్నన్‌కు వినిపించలేదు. కుళ్ళి చీకిపోయిన మృత కళేబరాలు బోలెడు ఆ నీటిలో కొట్టుకుపోతున్నాయి. కొన్నింటి మీద కాకులు తిష్ట వేసుకొని సుష్టుగా మాంసం తింటున్నాయి. దొంగలు యదేచ్ఛగా తిరుగుతున్నారు. అంతా శూన్యం. మౌనం.

కాసేపయ్యాక ఆ గుడిసె కుప్పలా కూలిపోయింది. నీళ్ళ మీద కదలాడింది. అనంతమైన ఆ నీటి ఉపరితలం మీద ఇప్పుడు ఏదీ కనిపించడం లేదు. స్వామి భక్తి ఉన్న ఆ సాధు జంతువు చచ్చేదాకా తన యజమాని ఇంటిని రక్షించింది. అది వెళ్ళిపోయింది. ఆ కుక్క గురించే కావచ్చు.. గుడిసె కూడా దాన్ని మొసలి పట్టుకునే వరకూ నీటి మీద తేలుతూ వుంది. తర్వాతి ఘోరం చూడలేకే ఆ గుడిసె కుప్పలా కూలిపోయింది. నీళ్ళలో వాలిపోయింది.

వరదలు తగ్గుముఖం పట్టాయి. చేన్నన్ ఈదుకుంటూ కుక్కను వెదుకుతూ తన గుడిసె వేపు వస్తున్నాడు. ఓ కొబ్బరి చెట్టు కింద ఉన్న కుక్క మృతకళేబరం పడి వుంది. అలలు దాన్ని చిన్నగా కదిలిస్తున్నాయి. చేన్నన్ తన కాలి బొటనవేలితో దాన్ని కిందా మీదా దొర్లించి చూశాడు. అతనికి అది తన కుక్కేనా అనే అనుమానం కలిగింది. దానికి ఓ చెవి కొరకబడి సగం మాత్రమే వుంది. చర్మం చీకిపోవడం వల్ల ఆ కుక్క రంగు ఏమిటో తెలియడం లేదు.



## వైక్కం ముహమ్మద్ బషీర్

1908లో వైక్కం దగ్గర్లోని తలయోల పురంబులో పుట్టారు. ఐదో తరగతిలో వున్నప్పుడు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనేందుకు కాలికట్ వెళ్ళారు. అనేక పర్యాయాలు జైలుకి వెళ్ళారు. 1930 ప్రాంతాల్లో రచన ప్రారంభించిన వీరు ముస్లిం ప్రజల జీవన సౌందర్యాన్ని అద్భుత రీతిలో చిత్రీకరించారు. వీరికి తనదైన ఓ ప్రత్యేక శైలి వుంది. వాక్య నిర్మాణ పద్ధతీ, పద ప్రయో, సరళీ... అన్నీ విలక్షణమైనవే! మలయాళంలో సుప్రసిద్ధ కథా రచయిత. కేరళ సాహిత్య అకాడమీ సభ్యులుగా కొంతకాలం సేవ చేశారు. 1972లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డూ, 1982లో పద్మశ్రీ బిరుదూ, 1987లో కాలికట్ యూనివర్సిటీ వారి హానరరీ డాక్టరేట్ వచ్చాయి. దాదాపు 32 పుస్తకాలు రాశారు.

# ఓ మనిషి

## - వైక్కం ముహమ్మద్ బషీర్

**మీ**కు కచ్చితమైన కార్యక్రమం అంటూ ఏదీ లేదు. దూరదేశాల్లో సంచరిస్తున్నారు. చేతిలో కాసుల్లేవు. అక్కడి భాష తెలీదు. మీకు ఇంగ్లీషు, హిందూస్థానీ మాట్లాడ్డం తెలుసు. అయినా, ఈ రెండూ అర్థం చేసుకోగల్గిన వాళ్ళు అక్కడ చాలా తక్కువ మంది. అందుకని మీరు అనేక ప్రమాదాల్లో ఇరుక్కుపోతారు. ఎన్నో సాహస కృత్యాలు తద్వారా చేస్తారు.

అలా మీరు ఓ మారు ఓ ఆపదలో చిక్కుకున్నారు. ఆ విపత్తు నుండి అపరిచితుడైన ఓ మనిషి మిమ్మల్ని రక్షించాడు. అది జరిగి చాలాకాలం గడిచిపోయినా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఆ మనిషిని మీరు గుర్తు చేసుకుంటున్నారు. అతను అప్పుడు ఎందుకలా చేశాడు?

ఇలా గుర్తు చేసుకుంటోన్న మీరు నేను అని భావించండి. నేను చెప్పుకొస్తోంది నా అనుభవమే! నాకు నాతోపాటు ఉన్న ఈ సమస్త మానవ జాతి గురించి అవ్యక్తమైన తెలివితేటలు సుమారుగా వున్నాయి. నా చుట్టూ వున్నవాళ్ళలో మంచివాళ్ళున్నారు. మహాక్రూరులూ, చోరులూ వున్నారు. అంటువ్యాధులు వున్న రోగులూ వున్నారు. పిచ్చి వాళ్ళున్నారు. ఎప్పుడూ ఎంతో మెలకువతో జీవించాలి. ఈ లోకంలో చెడే ఎక్కువగా వుంది. కాని చెడు గురించి మనం ఎప్పటికప్పుడు మరచిపోతుంటాం. ప్రమాదంలో చిక్కుకోగానే మనకు దీని ప్రభావం తెలిసి వస్తుంది.

ఇక్కడ నేను అత్యంత ఆసక్తికరమైన ఓ పాతకాలం సంఘటన చెబుతాను.

ఇక్కణ్ణించి సుమారు పదిహేను లేక ఇరవై ఐదువందలో ఉన్న మైళ్ళ దూరంలోని ఓ పెద్ద నగరం. అది పర్వతశ్రేణుల వాలులో వుంది. అక్కడ వున్నవాళ్ళు పూర్వం నుంచే దయాగుణానికి అంత పేరుమోసిన వాళ్ళు కారు. మహాక్రూరులు. హత్యానేరాలు, సామూహిక చోరీలు, సాంఘిక అత్యాచారాలు, జేబులు కొట్టడం... ఇవన్నీ అక్కడ నిత్యకృత్యాలు. అక్కడ వున్న వాళ్ళలో చాలామంది వంశపారంపర్యంగా సైనికులు. మిగిలిన వాళ్ళు దూరంగా విదేశాల్లో డబ్బును వడ్డీకి ఇచ్చేవాళ్ళు. మరికొంతమంది మిల్లులు, పెద్ద పెద్ద ఆఫీసులు, బ్యాంకులు.. మొదలైన వాటిల్లో గేటు కీపర్లుగా జీవిస్తున్నారు.

డబ్బు అక్కడ కూడా మహా దొడ్డ విషయం! దాని కోసం వాళ్ళు ఏమైనా చేస్తారు. ఎవరినైనా చంపుతారు. ఎందుకైనా తెగిస్తారు.

అక్కడ నేనుండే ప్రాంతం అపరిశుభ్రమైన వీధి. అందులో ఎంతో అసహ్యమూ, మరెంతో చిన్నదీ అయిన ఓ గదిలో నా నివాసం. ఉద్యోగం వుంది. రాత్రి తొమ్మిదిన్నర నించి పదకొండు గంటల దాకా విదేశీయులైన కొంతమంది కార్మికులకు నేను ఇంగ్లీషు నేర్పించాలి. కేవలం అడ్రస్ రాయడం వరకే! ఈ అడ్రస్ నేర్పడమే అక్కడ ఓ పెద్ద విద్యాభ్యాసం.

అక్కడి పోస్టాఫీసుల్లో ఇలా అడ్రస్ రాసేవాళ్ళను ఎంతోమందిని చూడొచ్చు. ఒక్కో అడ్రస్ రాసిపెట్టినందుకు రూపాయి పావలా నించి రూపాయిన్నర వరకు గిట్టుతుంది.

అప్పుడు నేను సాయంకాలం నాలుగు గంటలకే నిద్రలేచేవాణ్ణి! ఇది వేరే కొంత లాభించడానికి, పొద్దుటే టీ, పగలేమో భోజనం.

అలవాటు ప్రకారం అలా ఓ రోజు నాలుగ్గంటలకు లేచాను. కాలకృత్యాలు తీర్చుకొని భోజనం కోసం బయటపడ్డాను. ఫుల్‌సూట్‌లో బయలుదేరాను. నా కోటు పాకెట్లో పర్సు పెట్టుకున్నాను. అందులో పదునాలుగు రూపాయలున్నాయి. అదే నా జీవితంలోని యావదాస్తి.

నేను జనసమ్మర్ధంలోంచి ఓ హొటల్లో దూరాను. ఇక్కడ భోజనం అంటే.. కడుపు నిండా చపాతీలు, మాంసమూ హాయిగా ఆరగించాను. ఓ టీ కూడా కొట్టాను. మొత్తం సుమారు మూడుంపావలా వరకు బిల్లు.

నేను బిల్లు చెల్లించేందుకు కోటు పాకెట్లో చెయ్యి జొనిపాను. ఒళ్ళంతా ముచ్చెమటలు పోశాయి. ఉన్న పళంగా తిన్నదంతా అరిగిపోయింది. కారణం... కోటు పాకెట్లో నా పర్సు లేదు.

ఇబ్బందిగా "నా పర్సు ఎవరో కొట్టేశారు" అన్నాను.

అది మహా సందడిగా వున్న భారీ హోటల్. హోటల్ యజమాని అందరూ అదిరిపోయేలా బిగ్గరగా నవ్వాడు. తర్వాత నా కోటు పట్టుకుని ఈడ్చి కుదుపుతూ "డబ్బులు ఇచ్చి వెళ్ళు, లేకుంటే నీ కళ్ళు పీకి పారేస్తాను" అన్నాడు.

నేను అందరినీ చూశాను. దయాగుణం వున్న ఒక్కరూ కన్పించలేదు. ఆకలిగొన్న తోడేళ్ళలాంటి చూపులు వాళ్ళవి.

వాడు కళ్ళు పీకి పారేస్తాను అన్నాడంటే, సందేహం లేదు నిజంగానే పీకి పారేస్తాడు. అంతే!

"నా కోటు ఇక్కడ ఉండనివ్వండి. వెళ్ళి డబ్బులు తీసుకొస్తాను" అన్నాను. హోటల్ యజమాని మళ్ళీ నవ్వాడు.

నాతో కోటు విప్పదీయమని చెప్పాడు.

నేను విప్పేశాను.

షర్టు విప్పమన్నాడు.

షర్టు విప్పాను.

బూట్లు రెండూ విడవమన్నాడు.

నేను బూట్లు రెండూ విడిచాను.

చివరికి ట్రౌజర్ విప్పమన్నాడు.

అలా నన్ను పూర్తి నగ్నంగా మార్చి కళ్ళు పీకేసి బయటికి తరమడమే అతని తీర్మానం.

"ట్రౌజర్‌కు లోపల ఏమీ లేదు" అన్నాను.

అందరూ నవ్వారు.

హోటల్ యజమాని "నాకు ఇంకా సందేహమే! ట్రౌజర్ లోపల ఏదైనా వుండి వుండాలి" అన్నాడు.

ఓ యాభైమంది క్రూరంగా నవ్వుతో "లోపల ఏదైనా వుండి వుండాలి" అన్నారు.

ట్రౌజర్ విప్పేందుకు చేతులు రావడం లేదు. నేను ఇలా ఊహించుకోసాగాను.

"రెండు కళ్ళు లేని ఓ కబోది జనమంతా నవ్వుతూ కేరింతలు చేస్తోంటే నగ్నంగా వీధిలో తలొంచుకుని వున్నాడు. అలా అతని జీవితం అంతమవుతోంది. అంతం కానీ! ఓస్.. పోనీ!! సృష్టికర్తా! ఓ భగవాన్!!! ఇంక పనేమీ చెప్పలేను. చివరికి ఈ సంఘటన శుభం సుఖాంతం. ఓ అంతా శుభం... మంగళం...

ట్రౌజర్ బటన్లు ఒక్కొక్కటే ఊడదీయడం మొదలెట్టాను. ఉన్నపళంగా ఓ గంభీరమైన శబ్దం వినిపించింది.

"ఆగు... డబ్బులు నేనిస్తాను."

అందరూ అతని వేపు చూశారు.

ఎర్రని తలపాగా, నల్లని కోటూ, తెల్లని సాక్సూ, కోరమీసాలూ, నీలి కళ్ళూ వున్న ఓ తెల్లని మనిషి... అతను.

ఈ నీలివర్ణ నయనాలు అక్కడ సర్వసాధారణం. అతను ముందరి కొస్తూ హోటల్ యజమానిని ప్రశ్నించాడు.

"ఎంత చెల్లించాలి?"

"మూడుంబావలా వరకు"

అతను డబ్బులు చెల్లించాడు. ఆ తర్వాత నాతో "గుడ్డలు వేసుకో" అన్నాడు. అన్నీ ధరించాను.

"రా!" అతను పిలిచాడు. నేను అతన్ని అనుసరించాను. అతనికి కృతజ్ఞతలు చెప్పడానికి నాకు మాటలు కరువయ్యాయి.

"తమరు చేసింది గొప్ప సాయం. మీ అంత మంచి మనిషిని నేను ఇప్పటిదాకా చూళ్ళేదు."

అతను నవ్వాడు.

"పేరేంటి?" అడిగాడు. నేను పేరూ... ఊరూ... అన్నీ చెప్పాను.

నేనూ ఆ మనిషి పేరు అడిగాను.

"నాకు పేరు లేదు" అతను అన్నాడు.

"అయినా... మీ పేరు కరుణ కావచ్చు" అన్నాన్నేను.

అతను నవ్వలేదు. మేము అలా కొంతదూరం నడిచాం. నడిచి నడిచి ఆఖరుకు నిర్మానుష్యమైన ఓ వంతెన మీదకి చేరాం.

అతను చుట్టూ కలియచూశాడు. కనుచూపు మేరలో ఏ ఒక్కరూ లేరు.

అతను అన్నాడు.

"చూడూ! వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోవాలి. నా గురించి ఎవరైనా అడిగితే తెలీదని చెప్పాలి" అని.

నాకు విషయం అర్థమైంది.

అతను తన కోటు పాకెట్ల లోంచి ఐదు పర్సులు వెలికి తీశాడు. కచ్చితంగా ఐదు పర్సులు. వాటిలో నా పర్సు కూడా వుంది.

"ఇందులో ఏది నీది?"

నా పర్సును చేత్తో తాకి చూపించాను.

"తెరిచి చూడు"

నేను తెరిచి చూశాను. డబ్బంతా అందులో భద్రంగా వుంది. దాన్ని నా జేబులో పెట్టుకున్నాను.


అతను నాతో ఇలా అన్నాడు.

"పో! దేవుడు నిన్ను కాపాడుగాక!"

నేనూ అన్నాను.

"దేవుడు... మిమ్మల్నీ... నన్నూ... అందర్నీ కాపాడుగాక!"

మంగళం... శుభం...



## ఉఱూబ్

## (పి.సి. కుట్టి కృష్ణన్ - 1915-1979)

**మ**నిషి మీదా, అతని మంచితనమ్మీదా కొండంత ఆశతో, విశ్వాసంతో కలం పట్టిన కవి రచయిత. ప్రపంచంలో వున్న వాళ్ళంతా వీరి దృష్టికి అందగత్తెలూ, అందగాళ్ళూనూ (సుందరిగళుం, సుందన్మారుం). వీరి 'నీలక్కుయిల్' సినిమాకు రాష్ట్రపతి రజత పతకం లభించింది. 'ఉమ్మాచు' నవలకు కేరళ సాహిత్య అకాడమీ అవార్డు 'సుందరిగళుం, సుందరన్మారుం' అనే నవలకి 1960లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి. కొన్నాళ్ళు కేరళ సాహిత్య అకాడమీకి అధ్యక్షులుగా, 1951 నుండి 1975 దాకా కాలికట్ ఆకాశవాణి కేంద్రంలో స్టాఫ్ ఆర్టిస్టుగాను, కొంతకాలం కుంకుమం, మలయాళ మనోరమ పత్రికలకు సంపాదకులుగానూ పనిచేశారు. 8 నవలలు, 21 కథా సంపుటాలు, 4 నాటకాలు, మూడు బాలసాహిత్య పుస్తకాలు, రెండు వ్యాస సంకలనాలు... ఇదీ వీరి వ్యాసంగం.

# రాచ్చియమ్మ

**- ఉరూబ్**

**ప**దమూడేళ్ళ తర్వాత నేను రాచ్చియమ్మను చూశాక... ఆమెలో కనిపించిన మార్పుల కన్నా ఆశ్చర్యం ఏమిటంటే... ఆమెలోనూ మార్పులు రావచ్చు అని అందాకా నేను అనుకొని వుండకపోవడమే!

నీలగిరి నించి వెళ్ళిపోయాక నేను చాలాసార్లు రాచ్చియమ్మ గురించి గుర్తు చేసుకున్నాను. నల్లని శిలాప్రతిమ లాంటి ఆ శరీరమూ, గట్టి కంఠస్వరమూ మనసులోంచి ఏనాటికి చెరిగిపోతాయని అనుకోలేదు. కానీ కాలం చేసే తమాషాలో అన్నీ మసకై పోతున్నాయి. అయినా అప్పుడప్పుడు నేను రాచ్చియమ్మను గుర్తు చేసుకోకుండా ఉండలేకపోయేవాణ్ణి.

చేతులు ఊపుతూ చెంగు చెంగున వచ్చే రాచ్చియమ్మ చీకట్లో అసలు కనిపించదు. కాని ఆమె రాకను విని తెలుసుకోవచ్చు. చేతులకి వున్న వెండి గాజుల ఘలఘలల సవ్వడి నవ్వులా విన్పిస్తుంది.

నీలి ఆకాశం కింద నిర్లక్ష్యంగా పడుకుని వున్న పర్వతాలు, పచ్చదనమూ రాచ్చియమ్మను ఎప్పుడూ జ్ఞప్తి చేస్తుంటాయి.

పదమూడేళ్ళ కిందటి ఆ రాచ్చియమ్మేనా ఇప్పుడు నా ముందు నిలుచున్నది?

నేను మరోమారు గుచ్చి గుచ్చి చూశాను. నల్లని పొడవాటి ఆమె చేతి వేళ్ళ చివర్లలో అర్ధ చంద్రాకృతిలో ఉన్న గోళ్ళు ఇప్పటికీ స్వచ్ఛంగా మెరుస్తున్నాయి. ముక్కూ కళ్ళూ... అన్నీ అలాగే ఉన్నాయి. టార్చిలైట్ వెలుతురు లాంటి ఆమె నవ్వులోనూ ఏమాత్రం

వ్యత్యాసం లేదు. టార్చిలోని బ్యాటరీ మాత్రం కొంత 'వీక్' అయినట్టు కన్పిస్తోంది. అయితే.... రాచ్చియమ్మ తలలో ఒకటి రెండు వెండితీగలు అవి నాకు కొంత అశాంతిని కల్గిస్తున్నాయి.

పదమూడేళ్ళు అడ్డూ, అదుపూ లేకుండా దొర్లిపోయాయి. అయినప్పటికీ రాచ్చియమ్మలో స్వల్పమైన మార్పులే వచ్చాయి. కాని ఎందుకో అలా ఊహించుకోలేక పోతున్నాను.

మిసెస్ నాయర్ "రాచ్చియమ్మ గుర్తుకొస్తోందా?" అంది. జవాబు చెప్పలేదు. చిన్నగా నవ్వి ఊరుకున్నాను. మిసెస్ నాయర్ బాగానే ఆతిథ్యం ఇచ్చింది.

ఆ రోజుల్లో రాచ్చియమ్మను నాకు ఎవ్వరూ పరిచయం చేయలేదు. అప్పటికే నీలగిరి వయనాడుకు ఉద్యోగిగా వచ్చి నాల్గు రోజులయ్యాయి. అప్పుడు అక్కడ హోటళ్ళు లేవు. కొట్లు లేవని చెప్పడం తప్పే అవుతుంది. టీ తోటల్లోని మనుషులతో పని చేయించుకోవడానికీ, స్మగ్లింగ్ కోసం వసతులు కల్పించడానికి ఓ కొట్టు వుండేది. అక్కణ్ణించి కొనుక్కొచ్చిన సబ్బుతో స్నానం చేస్తే అంతా అంటుకుపోయేది. అదోరకంగా ఎలుక గొద్దెల్లాంటి వాసన వేసేది.

నేను ఎక్కడ బస చేయడం? ఎక్కడ భోంచేయడం?

నా మిత్రులు ఇంటినీ, ఓ వంట మనిషినీ ఏర్పాటు చేశారు. ఆ కట్టడాన్ని ఇల్లు అనీ, ఆ అబ్బాయిని వంట మనిషనీ పిలవడమే నాకు ఇష్టంగా వుండేది.

నేను ఎప్పుడూ ఉల్లాసంగా ఉండటానికే ప్రయత్నించేవాణ్ణి! జీవితం అనేది ఆకస్మికమైన, అనిర్వచనీయమైన ఓ మహా ప్రవాహం. అది పర్వత సానువుల్లోంచి సాగి, పాషాణాల్లోంచి పాకి, నదీ తీరాల్లోంచి దూసుకుపోతుందని ఎంతమందికి తెలుసు? అలా ప్రవహిస్తున్నప్పుడల్లా ఆకాశంలో మారుతోన్న రంగులకు అనుగుణంగా ఆ ప్రవాహమూ మారుతుందని ఎందరికి తెలుసు?

మూడో రోజు నేను అమ్మకు ఉత్తరం రాశాను.

"నాకిక్కడ సుఖంగా వుంది. చక్కని ప్రదేశం, మంచి మనుషులు" అని రాసి పెట్టిన ఉత్తరమ్మీద ఇంటి చూరు నుంచి చెదపురుగులు పడ్డాయి. సరిగ్గా అప్పుడే రాచ్చియమ్మ వచ్చింది. ఇంటి చుట్టూ కంచెలా పెరిగిపోయిన పొదల్నీ, తుప్పల్నీ చేతులతో దూరం జరుపుకుంటూ వాకిట్లోకి దూకింది.

"ఏరా అబ్బాయి?" అంది నా వంట మనిషిని ఉద్దేశించి.

అతను కట్టెలు కొడుతున్నాడు. ఆమె అలా పిలవడం వాడికి బొత్తిగా నచ్చులేనట్టుంది. అయినా జవాబు చెప్పే ధైర్యం లేనట్టు ఆమెకేసి గుడ్లు అప్పగించి చూస్తూ వుండిపోయాడు.

"మీ అయ్యగారు లేరా?"

"ఏం కావాలి?"

"నీతో కాదు. మీ అయ్యగారితో మాట్లాడాలి. ఉన్నారా?"

"ఉన్నారు"

ఆ అబ్బాయి తన చేతిలో ఉన్న కఱ్ఱను చీల్చే లోపు "పిలువ్" అని ఆజ్ఞాపించింది.

నేను ఇదంతా కిటికీలోంచి గమనిస్తున్నాను. ఏదో నల్లని రాళ్ళ పర్వతం ఆమెను ప్రసవించి, ఈ లోకంలో పడేసినట్టుంది.

అబ్బాయి వచ్చి నాకు చెప్పగానే ఏమీ ఎరగనట్టు బయటకు వచ్చాను. ఆమె నన్ను ఎగాదిగా చూస్తూ "మీకు పాలు కావాలా?" అంది.

"కావాలి"

"మీరు చెప్పకపోతే మరి నాకెలా తెలుస్తుంది? ఎన్ని సీసాలు కావాలి?"

"ఒకటిన్నర సీసాలు"

"పొద్దున ఎన్ని?"

"అర సీసా?"

"సరి ఏరా అబ్బాయ్? రేపటి నించి పాలు తీసుకెళ్ళు"

"ఇక్కడికి తీసుకొని రాకూడదా ఏం?"

"ఇంకా నయం, వేడి చేసి పంచదార కలిపి తీసుకురమ్మనలేదు."

ఆ అబ్బాయి కూడా ఏదో చెప్పాలనుకున్నాడు. కాని నా ముఖంలోకి చూసి వంట చెరకు తీసుకొని వంటింట్లోకి నడిచాడు.

ఆమె ఇంకా గుచ్చి గుచ్చి చూస్తూ వుండటం గమనించి నేను ఇలా అడిగాను. "రేపటి నించీ పాలు..."

"పోస్తాను, కాని మీ అబ్బాయితో తెప్పించుకోవాలి. చెప్పండి వాడికి"

"అతనికి మీ ఇల్లు తెలియకపోవచ్చు...."

"నోట్లో నాలుక లేదూ? అడగమనండి. పాలుపోసే రాచ్చియమ్మ అంటే ఎవరైనా చెబుతారు. అర్ధమైందా?"

"ఓ!"

ఆమె మరోమారు తరచి చూసి గిర్రున వెనక్కి తిరిగి మళ్ళీ పొదల్ని దూరం జరుపుకుంటూ వెళ్ళిపోయింది.

ఉన్నట్టుండి ఆ పొదల మాటు నుంచి "ఉత్తరం దిక్కు కొండవాలులో మా ఇల్లు. అబ్బాయితో చెప్పండి" అన్న పిలుపు వినిపించింది.

ఏపుగా పెరిగి పొలంలోంచి పంది వెళ్ళిపోతున్నట్లు, ఆ పొదల హృదయాల్లో కలిగిన కదలిక... ఆమె ఎలా వెళ్ళిపోతుంటే అలా మాయమైంది.

చప్పున చిన్నతనంలో నేను చదివిన ఓ పాట గుర్తుకొచ్చింది.

"ఈమెను భీతిల్లి ఎవ్వరూ

నేరుగా దారిలో నడవలేరూ" అని

మరునాడు పాల కోసం వెళ్ళిన అబ్బాయి రాచ్చియమ్మ ఇల్లు దొరకలేదని తిరిగొచ్చాడు. అయిదు నిమిషాలు కాలేదు. అడవి పొదల్లోంచి ఆమె ఓ అల్యూమినియం పాత్రతో రానే వచ్చింది.

"ఏరా అబ్బాయి? కొండవాలుకు వచ్చి అటూ ఇటూ చూసి వెళ్ళిపోయావు కదూ! ఇదిగో పాలు" అంది. ఆమె నేరుగా నా వేపు చూసి "రేపు నేను తీసుకురాను. అంతే! ఈ అబ్బాయికి బుద్ధి లేదూ?" అంది.

అబ్బాయి ముఖం ముడుచుకొని పాల పాత్ర తీసుకొని లోనికి వెళుతోంటే రాచ్చియమ్మ నా దగ్గరకొచ్చి "మీరు మలయాళం మనిషని ఆలస్యంగా తెలిసింది" అంది.

"ఓహో... మరి మీ ఊరు ఎక్కడ?"

"మైసూరు"

ఆ కన్నడిగురాలు అంత చక్కగా మలయాళం మాట్లాడ్డం విని విస్తుపోయాను.

"ఎంత కాలమైంది ఇక్కడికొచ్చి?"

"మేం రాలేదు"

"మరి?"

"మా అమ్మమ్మను తీసుకొచ్చారు"

"ఎవరు?"

రాచ్చియమ్మ సిగ్గుల మొగ్గయింది. ఆమె అలా లజ్జ పడుతుందని నేను ఊహించనే లేదు.

"మీ మలయాళం మనిషే తీసుకొచ్చాడు" అంది.

"అవును"

"మీ నాన్న ఎవరు?"

"మునియప్పన్"

మూడు ప్రాంతాల సంతతి అయిన రాచ్చియమ్మను చూస్తోంటే మహా ఆసక్తిగా వుంది. అప్పటికే అబ్బాయి పాల పాత్ర తిరిగి తీసుకొచ్చాడు. దాన్ని తీసుకొని అడవిలోకి అడుగు పెట్టబోతూ రాచ్చియమ్మ "అబ్బాయ్! రేపు నువ్వు రాకపోతే మీ అయ్యగారు పాలు తాగరు" అంది.

మర్నాడు అబ్బాయి ఆమె ఇల్లు కనుక్కొని పాలు తెచ్చాడు. ఆ తర్వాత ఓ వారం వరకూ ఆమె కనిపించలేదు.

ఆ రోజు సాయం సమయం. నేను ఆఫీసు నుంచి వస్తోంటే దారిలో ఏదో గలాటా జరుగుతోంది. రాచ్చియమ్మ ఎవరినో నోటికి వచ్చినట్టు తిట్టి పోస్తోంది.

"ఏరా పాపీ! చీపురు కట్ట పుచ్చుకొని నీ ముఖమంతా వాయించేస్తాను. నువ్వు పస్తులతో మలమల మాడుతున్నప్పుడు, అప్పు ఇవ్వడం నా తప్పా? నీ దగ్గర డబ్బులుండీ నన్ను మోసం చేయాలని చూస్తున్నావు. నా సంగతి నీకు సరిగ్గా తెలియదు" అంది.

రాచ్చియమ్మ ముందు నిలుచున్న యువకుడు కంగారు పడిపోతున్నాడు. అతను "రేపు... నేను....' అంటూ నసిగాడు.

"నాకు డబ్బులు ఇప్పుడే కావాలి" అమె ఆ యువకుని చేతిలోంచి డబ్బులు లాక్కుంది. అతను విచారవదనంతో వెళ్ళిపోతుంటే మళ్ళీ పిలిచింది.

"ఆగు"

"ఇంకా ఎందుకు?"

"ఇది తీసుకో! వడ్డీ వద్దు. అసలు తీసుకున్నాను కదా! అదే పదివేలు" యువకుడు తిరిగి తీసుకోవడానికి ఇష్టపళ్ళేదు. అతని స్వాభిమానం దెబ్బతిన్నట్టుంది. రాచ్చియ్యమ్మ "తీసుకో!" అంటూ గద్దించింది.

అతను  చేతులు చాచాడు. డబ్బులు చేతిలో పెట్టి అతని ముఖం కేసి తీక్షణంగా చూసి "ఓ... పెద్ద సత్యవంతుడు" అంది.

ఏమీ ఎరగనట్టు నించున్న నా ముందరికొచ్చి రాచ్చియమ్మ కాస్త ఇబ్బంది పడుతూ "వాడు మోసకారి. డబ్బులు తీసుకుంటే తిరిగి ఇవ్వడు. నేనిప్పుడు ఆ డబ్బులు తీసుకోనట్లయితే, బీరు షాపులో తగలేస్తాడు" అంది.

నేను ఏదో మాట్లాడతానని ఆమె ఆశించలేదు. అయినా ఆమె నాతో ఇదంతా క్షమాపణ కోరుతున్న విధంగా ఎందుకు చెబుతున్నట్టు?

రాచ్చియ్యమ్మ వెళ్ళిపోగానే చప్పున ఆ పాత పాట గుర్తుకొచ్చింది.

"ఈమెకు భీతిల్లి ఎవ్వరూ

....        ....        ...."

రాచ్చియమ్మ ఈ విషయాలు ఎప్పుడైనా గుర్తు చేసుకుంటోందా? టార్చిలైటు వెలుతురులాంటి ఆమె నవ్వు పదే పదే పెదాల మీద అరవిచ్చుకునేది. అయినా ఆ నవ్వులో విషాదం మిళితమై లేదు కదా? ఆమె చెక్కిళ్ళలోని గులాబి పూల సౌరభాల్ని మాయం చేసిన కాలపిశాచి రాచ్చియమ్మతో ఆటలాడుకుంటుందని నేను కలలో సైతం ఊహించలేదు.

"నన్ను గుర్తు పట్టలేదా?" అంది.

"ఓ.... రాచ్చియమ్మ" నేను పూర్తిగా క్షమాపణ స్వరంతో అన్నాను. 'ఓరి కృతఘ్నుడా!" అని నన్ను నేనే అనుకోవాలనుకున్నాను.

నేను ఆ కొండ దారంట వస్తున్నప్పుడు కూడా రాచ్చియ్యమ్మ గురించి ఆలోచించలేదు. ఒకదాని మీద మరొకటి తలలు వాల్చి వరుసగా పడుకొని వున్న పచ్చని పర్వతాలనీ, అడవిలోంచి అకస్మాత్తుగా ప్రత్యక్షమై నవ్వుతున్న తెల్లని జలపాతాలనీ చూసి కూడా నేను రాచ్చియమ్మను ఎందుకు జ్ఞప్తి చేసుకోలేదు?

ఇదంతా కాలపిశాచి చేస్తోన్న క్రూరమైన తమాషా. పచ్చని పర్వతాలకి తెల్లని అంచులు వేస్తోన్న కాలిబాటలు నా స్మృతిపథంలోకి అనేకానేక సంఘటనల్నీ, వ్యక్తుల్నీ తీసుకొస్తున్నాయి. అవి నెత్తూరూ, కన్నీళ్ళూ, శవాలూ పడిపోయిన కాలిబాటలు. ఆ నెత్తురూ, కన్నీళ్ళూ టీ తోటలకు ఎరువులై వుండొచ్చు. ఆ తోటలు చిగుళ్ళు వేశాయి. నీలగిరి ఆరెంజ్ పెకో! కాస్పియన్ సముద్ర తీరంలోనో, క్రీస్తుమస్ ద్వీపంలోనో, ఫ్రెంచి కారేబియన్‌లోనో హనీమూన్ అనుభవించే ప్రేయసీ ప్రియులు ఈ భారతీయ ఆరెంజ్ పెకోను పొగుడుతూ వుండవచ్చు.

అప్పటికీ, ఇప్పటికీ ఎన్ని మార్పులు! రోడ్డు పక్కన వున్న గుడిసెలు మనుషులు నివసించే ఊళ్ళలా వున్నాయి. ఆసుపత్రి పెద్దగా వుంది. బోలెడు లారీలు, కార్లు అటూ ఇటూ తిరుగుతున్నాయి. అయితే మనుషుల తలల మీద కంబళ్ళూ, చెక్కిళ్ళలోని రక్తహీనతా ఏమాత్రం మారలేదు. పాడుబడ్డ ఇంటిలోనికి వెలుతురు చొరనట్టుగానే, ఇక్కడ నాగరికత ఇంకా మనుషుల మదుల్లోకి పాకలేదా అనిపించింది.

నేను ప్రయాణం చేస్తోన్న బస్సుని చూసి కనీసం చిన్నపిల్లలలైనా వేడుక పడతారనుకున్నాను. కాని వాళ్ళు లెక్కలోకే తీసుకోలేదు. మా బస్సు ఓ కొట్టు ముందు ఆగగానే కర్ణకఠోరంగా ఓ అబ్బాయి "ఏనుగొచ్చింది" అన్నాడు.

"మీ అబ్బ ఇంత పెద్దగా ఉన్నాడా?" అని అబ్బాయి ఆశ్చర్యపోతుంటే బస్సులోంచి విమర్శలూ, గొణుగుళ్ళూ విన్పించాయి. ఎర్రని గారపళ్ళున్న ఓ అమ్మాయి అప్పటికే ఎక్కణ్ణించో వచ్చి ఇందాకటి అబ్బాయిని చెవులు మెలేసి లాక్కుని వెళ్ళింది.

ఆ పిల్ల చురుకైన నడక నా జ్ఞాపకాల తీగల్ని ఉన్నట్టుండి కదిలించినట్టు అన్పించింది.

"ఏ తీగల్ని?"

"రాచ్చియమ్మ జ్ఞాపకాలు" అని చెప్పేందుకు నా మనస్సు ఆరాటపడుతోంది.

నా జీవితం ఈ ప్రాంతంలోని రాచ్చియమ్మతో అంత బాగా పెనవేసుకుని వుంది. అయినప్పటికీ ఆమె రూపం మనస్సులో స్పష్టంగా కన్పించడం లేదు.

బస్సు రెండు మలుపులు తిరగ్గానే జ్ఞాపకాలు ఉన్నట్టుండి నాలోంచి తన్నుకొని వచ్చాయి. ఆ సంఘటన ఎన్నో సంవత్సరాలకు ముందు ఓ సందెవేళ జరిగింది. అది వెదురు మొక్కలూ, మనస్సులు చివుళ్ళు వేసే సమయం. నా మనస్సు అశాంతిగా, అస్థిరంగా వుంది. అందుకని అటూ ఇటూ పచార్లు చేస్తున్నాను. చివరికి వెదురు చివుళ్ళు హాయిగా మేస్తూ, చెవులూ, తొండమూ ఊపుతోన్న ఓ పెద్ద చీకటి ముద్దకు నేను గుద్దుకునేవాణ్ణి! మరో అడుగు ముందుకు పడితే చాలు. కాని ఆగిపోయాను. ముందుకి వెళ్ళరాదు. వెనక్కి మళ్ళే శక్తి లేదు. అలా స్థాణువులా నిలుచుని పోయాను.

ఉన్నట్టుండి ఓ చెయ్యి నా భుజమ్మీద పడింది. నేనెందుకు బిగ్గరగా పిలవలేదో నాకు తెలీదు. భయంతో గొంతు ఎండిపోయి వుండాలి. లేదా ప్రకృతే ఆపి వుండొచ్చు. అథవా ఆ చేతుల్లో సురక్షితంగా వున్నాను అనే ఏదో తెలీని భావం నాలో ఏర్పడి వుండొచ్చు.

ఏమైనా నేను నించుని వుండిపోయాను. ఓ స్త్రీ నన్ను అడవిలోకి లాక్కు వెళ్ళింది. కాసేపయ్యాకే నేను ఆ మనిషిని చూసింది.

"రాచ్చియమ్మ!"

"ఆ ఏనుగుని బెదిరించారు కదూ!" ఆమె పరిహసిస్తున్నట్టు నవ్వగానే నాకు కోపం రాలేదు. నా చెయ్యి అప్పటికి ఆమె పిడికిట్లో వుంది.

"రాచ్చియమ్మా! ఎక్కణ్ణించి ఊడిపడ్డావ్."

"ఇక్కడే కదా నేనుండేది!" అనేసి ఆమె పగలబడి నవ్వింది. ఆ నవ్వు మెరుపు ముక్కలు ముక్కలై వెలుతురు చిమ్ముతున్నట్టు వుంది.

ఆమె నన్ను అడవిలోని ఓ పిల్ల బాటంట తీసుకెళ్ళింది. దారి పొడుగూతా రాచ్చియమ్మ గురించే నా ఆలోచనంతా. నా మనస్సంతా ఆమే నిండిపోయింది. ఆమె నల్లటి కొండచరియల్లోంచి నడిచి వెళుతోన్న ఓ నీలికాంతి.

గత స్మృతులు నానిన మట్టి గోడల్లా మనస్సులో పడిపోతున్నాయి. నేను వాటిల్లోంచి ఇటుక ముక్కలూ, రాళ్ళు వేరు చేస్తూ కెలుకుతూ వుండగానే రాచ్చియ్యమ్మ "మళ్ళీ ఇప్పుడు ఎందుకొచ్చారు? తిరిగి బదిలీ అయ్యిందా?" అని ప్రశ్నించింది.

"లేదు, మిసెస్ నాయర్‌ని చూడ్డానికి వచ్చాను."

"మంచి పని చేశారు. మాకూ ఓ మారు కన్పించారు కదా!"

రాచ్చియ్యమ్మ నన్ను కాస్త పరిశీలనగా చూసి "మీరు కాస్త లావయ్యారు కదా!" అంది.

"వయస్సు మీద పడుతోంటే సహజం."

"మరి నేను లావు కాలేదే?"

"నీకు వయస్సు మీద పళ్ళేదు."

మెరుపు ముక్కలు చెల్లాచెదురైనట్టు ఆమె మళ్ళీ నవ్వింది. ఒక్కో మెరుపు ముక్కా చీకట్లోకి జారుకుంటున్నాయి.

నేనేమి మాట్లాడలేదు. రాచ్చియమ్మ కూడాను. అసలు మేం మాట్లాడుకోవడం లేదని మాకు అన్పించడం లేదు. నా మనస్సు అనర్గళంగా మాట్లాడుతోంది. మరి రాచ్చియమ్మ మనస్సో?

"మాటిమాటికి రాచ్చియ్యమ్మ ఇక్కడికొచ్చి మీ గురించి అడుగుతోంది" మిసెస్ నాయర్ అంది. ఎంతో ఉదారంగా ఆమే "మేం అన్నీ వివరంగా చెబుతుంటాం" అని గట్టిగా నవ్వింది. నా మనస్సు బాధగా మూలిగింది.

రాచ్చియ్యమ్మ అప్పటికీ నిశ్శబ్దంగా నిలుచుని వుంది. ఆమె కూడా పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటోందా? ఏమని ఆలోచిస్తూ వుంటుంది? రాచ్చియమ్మకూ గత స్మృతులు ఉన్నాయి కదూ?

నాటి రోజులు నా మనస్సులోకి మళ్ళీ తన్నుకొని వస్తున్నాయి. అప్పుడు ఓసారి రెండు, మూడు రోజులు విపరీతమైన జ్వరం వచ్చింది. అది పెద్ద ఇబ్బందికరమైంది కాదు అనుకున్నాను. తీవ్రమైన తలనొప్పి లేనట్లయితే, ఆ జ్వరమూ ఓ మంచి అనుభవంగానే మిగిలేది!

మూడో రోజు పొద్దుటికల్లా నా శరీరమంతా బొబ్బలు కిటికీ ద్వారా లేయెండ లోపలికి వస్తోంది. కిటికీ దగ్గరకి వెళ్ళి నిలుచున్నాను. కప్పుకొన్న దుప్పటి తీసి చూశాను. పగడాలు, ముత్యాలన్నీ నా దేహం నిండా వున్నాయి. అద్దం ముందరికి వెళ్ళాను. ముఖానికి వున్నాయా? కొన్నే ఉన్నాయి. బొబ్బలు మరిన్ని అవుతాయో, లేదో చెప్పలేం.

ఏదో ఆలోచిస్తూ మంచమ్మీదికి రాగానే వంటమనిషి వచ్చి..

"కాఫీ తీసుకురావాలా?" అన్నాడు.

"వద్దు"

"టీ"

"వద్దు, నువ్వు వెళ్ళు"

"ఎక్కడికి?"

"మీ ఇంటికి?"

"ఎందుకు సార్!"

"ఏమీ అడగొద్దు. ఓ నెల గడిచాక వస్తే చాలు" అతను తనకు ఏమీ బోధపడనట్టు కాసేపు నించుని తర్వాత వెళ్ళిపోయాడు. కాసేపయ్యాక నాకు రాచ్చియమ్మా అన్నమాట విన్పించింది.

"ఇంట్లో ఎవరూ లేరా?"

"లేరు" నేను పడుకున్న చోటినించే అన్నాను.

"మరి అలా మాట్లాడుతోంది దయ్యామా?"

చెంప ఛెళ్ళుమన్నట్టు అనిపించింది. తమాషాకు సైతం ఎలాంటి సమయం? ఆమె మళ్ళీ పిలిచినా నేను జవాబు చెప్పలేదు.

తలుపులు తాపీగా తెరుచుకొంటున్న శబ్దం. నా ఎదుట రాచ్చియమ్మ.

"ఎందుకలా దుప్పటి కప్పుకుని పడుకున్నారు?"

"ఆరోగ్యం బాగోలేదు."

"ఏమైంది?"

"మశూచి"

వారించే లోపే ఆమె నేను కప్పుకున్న దుప్పటి తీసి ఇలా అంది.

"ఇదేంటి? అమ్మవారు కదూ!"

ఆ తర్వాత ఆమె ఏమీ మాట్లాడలేదు. ఇల్లంతా శుభ్రంగా ఊడ్చి, కాఫీ చేసింది. అది చల్లని కాఫీ.

"చల్లటివే తినాలి, తాగాలి" అంది దగ్గరికొస్తూ.

కాసేపయ్యాక ఎక్కణ్ణించో కొన్ని అరటి పళ్ళు తెచ్చింది.

"ఇవన్నీ తినాలి. ఇంకా మీకు జ్వరం రావాలి. బాకీ వున్న బొబ్బలన్నీ రావాలి."

చల్లని గంజి, చల్లని అన్నం, చల్లని కాఫీ, ఒక్క రాచ్చియమ్మ తప్ప. అన్నీ చల్లనివే! తింటానికి ఇబ్బందిగా వుంది. అయినా ఆమె వదల్లేదు.

"తినమనే చెబుతున్నాను" అధికార స్వరంతో అనేది. అలా తినక తప్పింది కాదు.

మర్నాటి నుంచి చల్లటి నీళ్ళు కళ్ళలో ధారగా పోయసాగింది. నేను సమ్మతించడమో, వారించడమో చేయలేదు. అన్నీ ఆమె ఇష్టప్రకారమే కానీ! పొద్దుటే తిండి పెట్టి ఆమె వెళ్ళిపోయేది. మళ్ళీ సాయంత్రం తిరిగొచ్చేది.

"ఇది అంటు వ్యాధి సుమా!" అన్నాన్నేను.

"తెలుసు... " మహా నిర్లక్ష్యంగా అంది.

"నువ్వు ఇలా రావడం బావుంటుందా?"

"బాగుంటుంది"

"వద్దు రాచ్చియమ్మా!"

"మరి మీరిక్కిడికి ఇలా పడుకొని పడుకొని చచ్చిపోవడానికి వచ్చారా? ఆ వంటబ్బాయిని బెదిరించి ఇంటికి పంపినట్టు నన్ను పంపలేరు."

ఆమెతో వాదించి లాభం లేదు అనుకున్నాను.

శరీరమంతా మరిన్ని బొబ్బలు ఎక్కాయి. ముక్కు చివరా, గోళ్ళ సందుల్లోనూ అంతటా బొబ్బలే!

అవి పెద్దవై ఉబ్బి మక్కలు ఎండబోసినట్టున్నాయి.

ఒళ్ళంతా మంటలు, తీపులు, దురద.

రాచ్చియమ్మ వేప కొమ్మలతో ఒళ్ళంతా సుతారంగా నిమురుతూ “బాధపడకండి. రేపటికల్లా నయమై పోతుంది” అంది.

ఆ చిన్నమాటే నా ఒంటరి బతుకు ఎడారిని తడిపేసింది. అయినా బాధపోలేదు.

రాచ్చియమ్మ ఎక్కడికో వెళ్ళి కాస్త పసుపూ, కుంకుమ, ప్రసాదమూ తెచ్చి తలకు పూసి ఒళ్ళంతా రాసింది.

“అమ్మా! మాతా!! చూశావా?” అని ఎవరితోనో మాట్లాడుతున్నట్లు అంది. అలా అనడం ప్రార్థిస్తున్నట్లు కాకుండా గద్దింపులాగా ఉంది. యువకుని దగ్గర్నించి డబ్బు తీసుకొన్నప్పుడు ఉపయోగించిన కంఠంలాగా వుంది.

ఆఖరుకు ఆమె ప్రార్థన ఫలించిందనిపించింది. జ్వరం తగ్గింది. బాధ తగ్గిపోయింది. దురద కూడా నిదానించింది. నేను కాస్తో, కూస్తో నిద్రపోవడమే కాక చాలాసేపు మగతగా వుంటున్నాను. మత్తుగా పడుకొని వున్న నా ముందరికి ఓమారు ఆమె బైండ్లవాణ్ణి తీసుకొచ్చింది. వాళ్ళు పసుపూ, బియ్యమూ తెచ్చి, పువ్వులు పట్టుకొని దయ్యాలనీ, మశూచి లాంటి రోగాల్నీ నివారిస్తారు. అతని తల వెంట్రుకలు మెడలకు ఇరువైపులా విడిపోయి వున్నాయి. పసుపుతో బొట్టు, ఎర్రని వస్త్రాలు, అలరి పువ్వు వాసన, చేతిలోని ఖడ్గం తళతళలూ, కాలిగజ్జెల చప్పుళ్ళూ ఇదే అతని వాలకం. ఏదో మాట్లాడుతున్నాడు. రకరకాల మశూచి పేర్లు ఏకరువు పెడుతున్నాడు. అనడియన్, అత్తి తామర, చేరవళయన్, అగంతడియన్, పుఅంతడియన్, ఆటలమ్మ, పోచమ్మ, నూకాలమ్మ ఇలా తొంభయ్యారు రకాల మహమ్మారుల్ని నివారించడానికి మహాకాళిని పిలుస్తున్నాడు. అదిగో! కాళీమాత వస్తోంది. తెల్లని పట్టు ధరించి, సింహమ్మీద ఎక్కి, ఖడ్గం వాదర కళ్ళలోనూ, కంటి ప్రకాశం ఖడ్గంలోనూ కలగలిసి పోగా గర్జిస్తోంది. వాళ్ళంతా మొర పెట్టుతున్నారు.

“ఏనుగులాగా వచ్చిందీ

పీనుగులాగా వెళ్ళిందీ" అంటున్నారు.

"బాధ పోయింది కదా?" అన్నారు.

కళ్ళు తెరవగానే నా ముందు కాళి నించుంది. మెరుపులాంటి దరహాసంతో "పోయింది... పోయింది.. ఇంకా వుంటే నీ పని పడతాం" అంది.

నవ్వు ముంచుకొచ్చినా ఆపుకున్నాను. కళ్ళు మూసుకునే కిమ్మనకుండా పడుకున్నాను. నా కళ్ళ ముందు కాళీమాత విగ్రహం నిలుచుంది.

"అసురుల నెత్తురు తాగి గర్జిస్తోన్న ఓ మాతా!

అందెల చప్పుడుతో ఆడుతోన్న ఓ తల్లీ!"

ఆ పాట గుర్తుకొచ్చి నవ్వకుండా వుండలేకపోయాను.

"మీరు తెగ నవ్వుతున్నారు. బాధ పోయిందా?" అంది.

కళ్ళు తెరవలేదు. అయినా ఆ ప్రశ్నలో ఏదో బాధ పెట్టే అంశం వుందనిపించింది. ఈ రోజు కూడా రాచ్చియమ్మ వేసిన ప్రశ్న విన్నాక అదే మోస్తరు బాధ కల్గింది. "ఇప్పుడు డబ్బులు సంపాదించి సుఖంగా వున్నారు. అవునా?" నా కళ్ళు కిందికి వాలిపోవడం చూసి రాచ్చియమ్మే అంది.

"మీరు సుఖంగా వుంటే మాకు సంతోషం"

ఆమెకు ఎందుకు సంతోషమో నేను అడగలేదు.

తర్వాత నిశ్శబ్దం! కాని మిసెస్ నాయర్ తన గురించి ఏకరువు పెడుతోంది. కొత్తగా కొన్న షవర్లే కారు గురించి గొప్పగా చెబుతోంది.

"ఊటీకో, బెంగుళూరుకో, దేవుని దర్శనార్థం గురువాయూరుకో వెళ్ళాల్సి వచ్చినప్పుడల్లా ఓ మంచి కారు లేకుండా సాధ్యం కాదు. కారులో కూచుని కళ్ళు మూసుకుంటూ దేవుని నామజపం ఎత్తుకునే సరికి హాయిగా చేరాల్సిన చోటుకి చేరిపోతాం. ఎలాంటి ఆటంకాలు, కుదుపులూ వుండవు."

ఆమే మళ్ళీ "మరో చిన్నకారు కూడా కొనాలన్న ఏర్పాటు చేశాను. పర్షియన్ గల్ఫులో వున్న కూతురూ, భర్తా కలిసి రేపు వస్తున్నారు. వాళ్ళు హాయిగా అలా చుట్టి రావడానికి ఓ చిన్న కారు కావాలి. ఫియట్ కారు లాంటిది సరిపోతుంది" అంది.

రాచ్చియమ్మ మధ్యలో కలుగజేసుకుంటూ "మీరు మళ్ళీ ఎప్పుడు తిరిగి వెళుతున్నారు?" అడిగింది.

"రేపు ఉదయాన"

"మళ్ళీ కలుస్తాను. వెళుతున్నాను. గేదెకు నీళ్ళు పెట్టాలి."

మిసెస్ నాయర్ అప్పటికి తన కారులు, ఫ్రిడ్జి, చిన్న కూతురి పెద్ద మనస్సు, బదరినాథ్ ప్రయాణంలోని అనుభూతులు.. అన్నీ పూసగుచ్చినట్టు చెబుతోంది.

నా మనస్సు గేదెలకు నీళ్ళు పెట్టడానికి వెళ్ళిన రాచ్చియమ్మతో పాటు వెళ్ళిపోయింది.

మశూచి తగ్గేదాకా రాచ్చియ్యమ్మ నాకు ఎలా సేవ చేసిందో గుర్తుకొచ్చింది.

ఓ రోజు రాచ్చియమ్మతో "ఇంక నేను మా ఊరికి వెళతాను. లీవు అయిపోయాక మళ్ళీ వస్తాను" అన్నాను.

"ఇప్పుడు ప్రయాణం చేయడానికి మేం వదలం" అంది. వదలం అంటే వదలంగాక వదలం అనే! రాచ్చియ్యమ్మ రోజూ పొద్దుటే వస్తోంది. ఇల్లు శుభ్రంగా ఊడుస్తోంది. కాఫీ, ఫలహారాలు సిద్ధం చేస్తోంది. పగటి కోసం తిండి వండి మూతలు సర్ది ఎలా వస్తోందో అలాగే వెళుతోంది.

"గేదెలకు నీళ్ళు పెట్టాలి."

"పోతుకి మేత వేశావు కదూ!"

రాచ్చియమ్మ పగలబడి నవ్వింది. ఆమె తల పొదల మాటున అదృశ్యమైనా, నవ్వు మాత్రం చాలాసేపు విన్పించేది!

ఆరోగ్యం కుదుటపడి ఆఫీసుకు వెళ్ళడం మొదలెట్టాను. ఓ రోజు ఆమె "వంటబ్బాయి ఇంక రాడా?" అంది.

"రాకపోవచ్చు."

"కృతజ్ఞత లేని వెధవ" అంటూ కాసేపు ఏదో ఆలోచించి ఆమె "మీకు అక్కా చెల్లెళ్ళు లేరా?" అంది.

"లేరు"

"ఎవ్వరూ లేరా?"

"ఒకర్తె వుండేది! చనిపోయింది"

నేను అలా అనగానే ఆమె కాసేపు నా ముఖం కేసి చూసింది. ఆ కళ్ళలో విచిత్రమైన భావం మిలమిలలాడింది. నాకు చెవులూపక నించున్న ఏనుగు కళ్ళు గుర్తుకొచ్చాయి. కొంతసేపు గడిచాక ఆమే.

"మాకు ఓ అన్నయ్య వుండేవాడు. కాని చనిపోయాడు" అంది.

నిశ్శబ్దం! ఆమె వెళ్ళిపోతుంటే "నీకు కావలసిన వాళ్ళు ఎవరైనా వున్నారా?" అన్నాను.

"దేవుడొక్కడే!"

అప్పుడు ఆమె వెళ్ళిపోయాక ఏదో చెప్పలేని వెలితి. ఇప్పుడు కూడా ఆమె వెళుతోంటే, అలాంటి వెలితే అలముకొంది.

ఇవేవీ మిసెస్ నాయర్ వాగుడుకు ఇబ్బంది కల్గించలేదు. ఎక్స్‌పోర్టు లైసెన్సు కోసం తన భర్త పడే పాట్లు అదేపనిగా చెబుతోంది. నెలకి ఒకటి, రెండుసార్లు ఢిల్లీకి వెళ్ళాలట! అతనికేమో ప్లెయిన్ పయనం పడదు. బ్లడ్‌ప్రెషర్ మనిషి. ఈ మధ్య గొప్ప గొప్ప వాళ్ళందరికి ఈ బ్లడ్ ప్రెషర్ వస్తోంది.

"మీకు బ్లడ్ ప్రెషరుందా?" ఆమే నన్ను అడిగింది.

"లేదు"

"షుగర్ వుందా?"

"లేదు"

అలా మాట్లాడుతున్నంత సేపూ మనసులో రాచ్చియమ్మే నిండిపోయింది. ఆమెను నేను ఓసారి నిస్సందేహంగా బాధపెట్టాను. ఆ దృశ్యం మెల్లమెల్లగా నా మనోనేత్రం ముందు కదలాడుతోంది.

అప్పుడు... ఆఫీసు నుంచి బాగా అలసిపోయి తిరిగొచ్చాను. ఏమాత్రం ఉల్లాసంగా లేదు. కొండవాలు మీద కాస్సేపు అలా తిరిగి వద్దామనుకున్నాను. అక్కడ విశాలంగా పరచుకుని వున్న సాంబ్రాణి చెట్టు కింది వెన్నెల దూకుతున్న చుక్కల జింకలా వుంది.

నేను చెట్టు కింద కూచున్నాను. నిశ్శబ్దంగా వున్న కొండ చరియలు. దిగంతాల దాకా పాకిపోయిన టీ తోటలు. చిన్న మబ్బు ముక్క కూడా లేని నిర్మలమైన ఆకాశం... ఎంత వెలితి!

రాచ్చియ్యమ్మ అనుకోకుండా అక్కడికొచ్చింది. ఆమె ఏమీ సంకోచించకుండా నా చెంతకు వచ్చి "ఇబ్బందిగా వుందా?" అంది.

"ఎందుకు?"

"మీ వాళ్ళు గుర్తుకొచ్చి ఇబ్బందిగా వుందా?"

"లేదు"

మా అమ్మా నాన్నల గురించి, కుటుంబ సభ్యుల గురించి ఆమె అడిగి తెలుసుకుంది. నాకూ ఎవరితోనైనా ఏదైనా చెప్పాలనే వుంది. సిగ్గుపడుతోన్న కలువ మొగ్గల్ని వెన్నెల ముద్దాడి వాటికి గిలిగింతలు పెడుతోంది.

ఎందుకో రాచ్చియమ్మ నాకు అత్యంత సన్నిహితురాలు అనిపిస్తోంది.

అంతా నిశ్శబ్దం! గుండె చప్పుళ్ళు వినిపించేంత మౌనం!! టీ మొక్కల మధ్య వున్న ఓక్ చెట్లలోంచి గాలి ఈలవేస్తూ వెళ్తోంది. అది దూరంగా వున్న పొగమంచుని తాకి అందులో లీనమైపోతోంది.

నేను రాచ్చియ్యమ్మ చెయ్యి గట్టిగా పట్టుకున్నాను. ఆమె వెండి గాజులు ప్రతిఘటించాయి. నేను చేసిన పనికి ఆమె సిగ్గుపడుతుందనో, విస్తుపోతుందనో అనుకున్నాను. ఆమెలో వున్న సహజ వ్యామోహానికీ, తనను తాను కాపాడుకోవాలనే తత్వానికి మధ్య కోరికలు పెనుగులాడుతున్నాయి.

అయినా ఏదీ స్పష్టం కాలేదు. సంధ్యా సమయం చీకటి నీడలు మొత్తంగా ఆమె కళ్ళలో గడ్డకట్టినట్టు తోచింది.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది.

నేను ఆమె చెయ్యి వదిలేసి దూరంగా నించున్నాను. అప్పుడు రాచ్చియ్యమ్మ నా చెయ్యి పుచ్చుకుని "కోపమొచ్చిందా?" అంది.

నేను ఏమీ చెప్పలేదు. అప్పుడు నా మనస్సు ఏం అనుకుందో కూడా తెలీదు. మరోమారు "నన్ను కోప్పడకండి" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

"మా అన్నయ్య చనిపోయిన తర్వాత మళ్ళీ మిమ్మల్ని చూసి ఆనందించాను." నా జవాబు ఆమెకు అవసరం లేదు.

"మా తల్లి చచ్చిపోతూ ఓ మాట చెప్పింది"

"ఏంటి?"

"మేం గుడికి వెళ్ళి కుంకుమ పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ కాలు జారమనీ, దారి తప్పమనీ ప్రమాణం చేశాం" అనేసి ఆమె వెక్కుతూనే "ఇంక మీ ఇష్టం" అంది.

ఆమె ఎత్తయిన వక్షోజాలపై కన్నీరు బొట్లు బొట్లుగా రాలి చిట్లి పోతున్నాయి. నిమిషాలు అలాగే ముక్కలు ముక్కలవుతున్నాయి.

కదలక నించున్న నా వేపు ఆమె తన తడిసిపోయిన కళ్ళని ఎత్తి చూస్తూ "మీకు ఏది అవసరమైనా, దానికి నేను లొంగిపోతున్నాను కాని ఒక్క షరతు" అంది.

"ఏంటది?"

"ఆ తర్వాత మాత్రం నేను ఈ లోకంలో వుండను. ఇంక మీ ఇష్టం."

మళ్ళీ రాచ్చియమ్మ నా చెయ్యి పట్టుకుంది. ఆ చెయ్యిని విదిలించాలన్నా, పట్టుకోవాలన్నా నాకు చేతగావడం లేదు. ఓ రకమైన బాధ మాత్రం నా మనసంతా అల్లుకుపోయింది. సిల్వర్ ఓక్ చెట్లలోంచి కూనిరాగాలు తీస్తూ సాగిపోతున్న గాలికీ నా బాధ తెలిసినట్టుంది.

"ఏమీ మాట్లాడటం లేదెందుకు?" రాచ్చియమ్మ నా భుజం పట్టుకుని ఊపింది. నేను నేల చూపులు చూస్తూ "క్షమించు రాచ్చియమ్మా! ఇబ్బంది పెట్టినందుకు విచారిస్తున్నాను" అన్నాను.

ఈ మాటలు రాచ్చియమ్మను మరింత ఏడిపించాయి.

వెన్నెల చిక్కబడుతోంది. మేం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వేరయ్యాం. నీడలూ, పొగమంచూ జమిలిగా అల్లుకుపోయిన ఆ వాతావరణంలో అదృశ్యమవుతోన్న ఆమెను చూస్తూ వుండిపోయాను. హఠాత్తుగా నా అంతరాంతరాళాల్లోంచి "నువ్వు ఎవరివి రాచ్చియమ్మా?" అనే ప్రశ్న ఉదయించింది.

ఇవాల్టికి ఆ ప్రశ్నకు బదులు లేదు.

మిసెస్ నాయర్ సోది బాధ నించి తప్పించుకోవాలనే సాయంకాలం అలా బయటికి వెళ్ళాను. కొండచరియకి చేరువులో వున్న రాచ్చియమ్మను చూడాలని కాదు నేను వెళ్ళింది.

ఓ పెద్ద సాంబ్రాణి చెట్టు వెనక నుంచి ఆమె ప్రత్యక్షమైంది. ఆమె తన తల వెంట్రుకల్ని, అప్పుడే స్నానం చేసినట్టుంది, ఆరవేసుకుంది. చందనం బొట్టు, తెల్లని పలువరస... ఈ రెంటిలో ఏది ఎక్కువ వెలిగిపోతుందో చెప్పడం కష్టం.

"మీ భార్యని ఎందుకు తీసుకురాలేదు?"

"నాకు భార్య ఉందని ఎవరన్నారు?"

"మీరు చెప్పకపోయినా, నాకు తెలుసు. బిడ్డ విజయలక్ష్మి బడికి వెళుతోందా?"

"అవును"

ఆమె నా గురించి అన్నీ తెలుసుకొని వుంది.

"విజయలక్ష్మిని ఎందుకు తీసుకురాలేదు? నాకు ఆమెను ఎత్తుకొని ముద్దు పెట్టుకోవాలనిపిస్తోంది."

నేను నవ్వాను.

"మీరు ఇప్పటికీ మునుపటిలాగే డబ్బును మంచినీళ్ళప్రాయంలా ఖర్చు చేస్తున్నారు. అవునా?" రాచ్చియమ్మ ప్రశ్నించింది.

"నా దగ్గర అంత డబ్బు లేదులే" అంటూ మళ్ళీ నవ్వాను.

"ఉంది. విజయలక్ష్మికి ఓ మంచి అబ్బాయిని చూసి కట్టబెట్టాలి. కట్నాలూ, కానుకలూ, లాంఛనాలూ ఇవ్వొద్దూ? ఇంతకీ ఎందుకు నవ్వుతున్నట్టు?"

"మరి నువ్వు డబ్బులు పొదుపు చేస్తున్నావా?"

"చేస్తున్నాను"

"ఎంతుంది నీ దగ్గర?"

"నా దగ్గర లేదు. అంతా బ్యాంకులోనే! ఇప్పుడు ఇక్కడికి బ్యాంకులు వచ్చాయి. దగ్గర ఉంచుకుంటే అప్పులు అడుగుతారు. ఇస్తే మళ్ళీ తిరిగివ్వరు. అంతేగాక బ్యాంకులో వడ్డీ కూడా దొరుకుతుంది. మా ఊరు ఇప్పుడు పెద్ద ఊరుగా మారిపోయింది. బళ్ళు తెరిచారు. కోర్టులున్నాయి. పోలీస్ స్టేషన్ వుంది. ఇంకా టూరిస్ట్ ఆఫీసు వచ్చింది. నేనిప్పుడు ఆ ఆఫీసుకు పాలు పోస్తున్నాను" ఈ మాత్రం చెప్పి రాచ్చియమ్మ బిగ్గరగా నవ్వింది.

"అయినా నీకు పెళ్ళి కాలేదు కదా?" అన్నాను.

జవాబు లేదు.

"ఇలా ఎన్నాళ్ళు ఒంటరిగా గడుపుతావు?"

"చచ్చేదాకా?"

"సాయం కోసం ఓ మనిషి కావాలి కదా?"

"దేవుడున్నాడు కదా!"

"ఎందుకైనా ఓ తోడు వుండటం మంచిది"

రాచ్చియమ్మ వద్దు అనే అర్థంలో తాపీగా తల ఊపింది.

"మరి ఎవరికోసం డబ్బులు జమ చేస్తున్నావు?"

"మన వారసురాలు కోసం"

"ఎవరది?"

"విజయలక్ష్మి మన బిడ్డ బ్యాంకులో వారసురాలిగా నేను ఆమె పేరునే రాసిచ్చాను."

"ఏంటి?"

"మనం ఛస్తే డబ్బు మొత్తం విజయలక్ష్మికే! చావడానికి ముందూ తీసుకోవచ్చు. కాని ఆ డబ్బు మీకు ఇస్తే లాభం లేదు...హూ! అంతా హారతి కర్పూరంలా హరించుకుపోతుంది."

నేను రాచ్చియమ్మ చెయ్యి పట్టుకుని "చెల్లీ!" అన్నాను. రాచ్చియ్యమ్మలో ఎలాంటి భావ వ్యత్యాసమూ లేదు.

"మా ఇంటికి వస్తారా?"

"తప్పకుండా!"

అంత పాత ఇల్లేమీ కాదు. చక్కగా మరమ్మత్తులతో సింగారించి వుంది. తలవంచి లోనికి వెళ్ళాను. బెంచీ మీద కూర్చున్నాను.

రాచ్చియ్యమ్మ పోసిన గోర్వెచ్చని గేదె పాలు ఊదుకొని తాగుతుంటే, ఆమె నన్ను చూస్తూ గతించిన ముచ్చట్లు చెబుతోంది.

"ముగ్గురు జనాలు నన్ను పెళ్ళి చేసుకోవాలని వచ్చారు. ముగ్గుర్నీ వద్దు అని వెళ్ళగొట్టాను."

"కారణం?"

"ఇద్దరేమో నన్ను చూసే కాదు, నా డబ్బు మీద ఆశతో వచ్చారు."

"మరి మూడో మనిషి?"

"నేను వద్దన్నాను."

"ఎందుకు?"

"కారణం ఏమీ లేదు."

నేను అలా అడగటం ఆమెకు ఇష్టం లేనట్టుంది. అందుకే విషయం మార్చింది. ఆ తర్వాత ఆమె ఎర్రమట్టీ, బొగ్గూ కలిపి పూసిన గోడకేసి చూపిస్తూ "అటు చూశారా?" అంది.

దగ్గరికి వెళ్ళి చూశాను. అక్కడ నా పాత ఫొటో ఒకటి వుంది. రాచ్చియమ్మ మెరుపు తీగలా మిలమిలా నవ్వింది. చుట్టూ దట్టంగా అల్లుకుపోయిన చీకట్లలో ఆ నవ్వు మరింత స్పష్టంగా కనిపించింది.

రాచ్చియమ్మ నా చెయ్యి దొరకబుచ్చుకుని మెల్లిగా అడిగింది.

"నన్ను మరిచిపొయ్యారా?"

"లేదు"

"మరి ఇంతకాలం మీ యోగక్షేమాలు తెలుపనే లేదు. మీరు ఇప్పుడో, అప్పుడో వస్తారని అహర్నిశలూ ఎదురు చూశాను."

నా శరీరానికి ఒరుసుకుంటూ నిలుచున్న రాచ్చియ్యమ్మ కళ్ళల్లోకి చూశాను. వెన్నెలా, చీకటి కలిసిపోయినట్లున్న ఆమె కళ్ళల్లో రెండు తెల్లని బుల్లి చేపలు ఈదులాడుతున్నాయి.

"రాచ్చియమ్మా!"

"నన్ను మరిచారు కదూ!"

"నువ్వు పసుపూ, కుంకుమా పెట్టుకొని దేవుని ఎదుట ప్రమాణం చేశావు. అవునా?"

"అవును"

"మరి ఇదేంటి ఇప్పుడిలా..."

"నేను ఆ బొట్టు చెరిపేసుకున్నాను. చూడండి! ఇప్పుడు నా నుదుట చందనం బొట్టు వుంది."ఆమె మాటలు నన్ను మంత్రముగ్ధుణ్ణి చేశాయి.

"నేను రక్తమాంసాలున్న మనిషినే కదా! నేనూ ఈ మట్టిలో పుట్టినదాన్నే!!"

ఈ తాత్వికత ఆమె ఎక్కడ నేర్చుకుందో నేను ప్రశ్నించలేదు. దున్నిన మట్టి వాసనా, యూకలిప్టస్ వృక్షాల సువాసనా కలిసిపోయిన గాలి బలంగా వీచింది. అది గడ్డి వాములతోనూ, లతా నికుంజాలతోనూ సయ్యాటలాడింది.

రాచ్చియమ్మ నా కళ్ళల్లోకి లోతుగా చూస్తూ ఇలా అంది.

"మా అమ్మమ్మను తీసుకొచ్చింది కూడా మలయాళం మనిషే!" ఆమె తలలో వున్న ఒకటి, రెండు వెండి తీగలు నన్ను చూసి ముసిముసిగా నవ్వాయి. నేనూ నవ్వకుండా వుండలేకపోయాను.

ఇంటికి వెళ్ళిపోయాను. మిసెస్ నాయర్ నా కోసం ఎదురుచూస్తోంది. "రేపొద్దుటే వెళ్తున్నారా?" అని ప్రశ్నించింది ఆవిడ.

"ఊ"

"మా షవర్లీ కారులో వెళదాం"

"థాంక్స్! నేను బస్సులో వెళతాను."

ఆమె మళ్ళీ మాట్లాడలేదు. నేను తొందరగానే నిద్రలోకి జారుకున్నాను. మర్నాడు పొద్దుట బస్సు కొండ దిగుతోంది. తెలీని బాధతో మూలుగుతోన్న నా హృదయంలో ఆ పాత పాట ప్రవేశించింది.


"ఈమెను భీతిల్లీ ఎవ్వరూ,

నేరుగా దారిలో ........."

ఛిఛ్ఛీ! వెంటనే ఆపాను. మదిలో మరో పాట మెదిలింది.

"అందెల చప్పుడుతో ఆడుతోన్న ఓ తల్లీ!"

అలా కూనిరాగం తీస్తూ కొండలు దిగుతూ చుట్టూ కలయచూశాను. మనోహరమైన పర్వత పంక్తులు. భూమిలోకి వంగి నించున్న నీలాకాశం. అవ్యక్త సుందరమైన పొగమంచు. మత్తెక్కించే సుగంధాలు చిమ్ముతోన్న యూకలిప్టస్ వృక్షాలు. అందమైన విషరహిత సర్పాలు.....



## కారూర్ నీలకంఠ పిళ్ళై (1898-1975)

ఏడో తరగతి పాసై ఉపాధ్యాయ వృత్తిలో 44 ఏళ్ళున్నారు. పాత తరం రచయితల్లో ప్రసిద్ధుడు. మధ్యతరగతి ప్రజల బాధల్నీ, అంతర్ సంఘర్షణల్నీ అతి చక్కగా వర్ణించిన రచయిత. అతని సాహిత్యమంతా చాలీచాలని ఉపాధ్యాయు జీవితాలకు ఎత్తిన అద్దం. రచయితల యాజమాన్యంలో నడిచే 'సాహిత్య ప్రవర్తక సహకరణ సంఘు' స్థాపకుల్లో ఒకరు (1945). ఆ సంస్థకి 1945 నుండి 1965 దాకా కార్యదర్శీ, మార్గదర్శీ. ఎక్కువగా వీరు కథానికలే రాశారు. మొత్తం రచించిన పుస్తకాల సంఖ్య 37. 'అనక్కారన్' (ఏనుగు యజమాని) అనే బాల సాహిత్య పుస్తకానికీ, 1968లో 'మోతిరం' (ఉంగరం) అనే కథల సంపుటికీ కేరళ సాహిత్య అకాడమీ అవార్డులు వచ్చాయి.

# కొయ్యబొమ్మలు

**- కారూర్**

**వా**కిట్లో నించుని “312 ఆశారి పఱంబిల్” అని తనలో తనే అనుకొంటూ “ఇక్కడ ఎవ్వరూ లేరా?” అని ప్రశ్నించాడు ఎన్యూమరేటర్.

గదిలోంచి ఓ స్త్రీ అరుగు మీదకి వచ్చింది. ఆ గది గోడలు అల్లిన కొబ్బరి ఆకులతో ఉన్నాయి.

చేతిలో వున్న కాయితాలు చూస్తూ జనాభా లెక్కలు సేకరించే ఆ ఎన్యూమరేటర్ “నీ పేరు ఉమ్మిణి....” అన్నాడు.

సహజ సిద్ధంగానే ఆ స్త్రీకి విశాలమైన నేత్రాలు వున్నాయి. వాటిని మరింత పెద్దవి చేస్తూ “కేసో, పోలీసులో కావచ్చు” అనుకుంటూ భయపడింది.

“జనాభా లెక్కలు సేకరిస్తున్నాం. ఇంట్లో ఎవరెవరు వున్నారు?“

“ప్రస్తుతానికి నేను మాత్రమే వున్నాను. అమ్మ ఇందాకే తోటలోకి వెళ్ళింది. మా అన్నయ్య పని మీద వెళ్ళాడు.”

“మరి ఉమ్మిణి ఎవరు?”

“మా అమ్మ పేరు”

“సరి. ఉమ్మిణి పురుషుడా ? స్త్రీయా?”

ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో వెక్కిరింపు కూడా వుంది. అయినా అందమైన నవ్వు.

"అమ్మా, నేనూ ఆడాళ్ళం. మా అన్నయ్య మగాడు.

"నాన్న లేరా?"

"చనిపోయాడు"

"అయితే ఉమ్మిణి విధవరాలు కదూ?"

"ఇప్పుడు విధవరాలే!"

మళ్ళీ ఆమే ఇలా అంది. "మీరు ఇంత ఎండలో వచ్చి వుండాల్సింది కాదు. అయినా గొడుగుంటే బావుండేది! మధ్యాహ్నం ఇళ్ళ వద్ద ఎవరుంటారు? జనాభా తగ్గిపోదూ ఇలాగవుతే? అన్నట్టు. ఇలా బెంచీ మీద కూచోవచ్చు కదా!"

పేడతో అలికి నున్నగ శుభ్రం చేసిన వసారాలో ఓ బెంచీ వుంది. దాని మీద అతను కూలబడ్డాడు.

అతను ఉమ్మిణి వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు.

"మీ పేరు?"

ఆమె సిగ్గుపడుతూనే "నా పేరు నళిని" అంది.

"వయస్సు?"

"నన్ను చూస్తుంటే ఎంత అనిపిస్తోంది?"

"ఏమో... నాకేమీ తోచడం లేదు."

ఆమె చిన్నగా నవ్వింది.

"ఇరవై మూడు"

"పెళ్ళి అయ్యిందా?"

"ఊం"

"ఇప్పుడు భర్త ఉన్నాడా?"

ఆ ప్రశ్నతో ఆమె ఒకింత తికమకపడింది.

"ఇప్పుడిక్కడ లేడు. పదమూడో మైలులో వున్నాడు. అన్నట్టు జనాభా లెక్కలు రాస్తున్నారా?"

"దానికి వేరే మనిషి వున్నారు. నీకు భర్త వున్నాడు కదూ?"

"ఉన్నాడనో. లేడనో రాసుకోండి!"

ఆమె ఖాతరు చేయని రీతిలో చెప్పింది.

"ఉన్నాడని రాసుకున్నా, లేడని రాసుకున్నా అర్థం ఒకటి కాదు కదా?"

"అయితే ఎలాగోలా వున్నాడని రాసుకోండి.

"అంటే... పెళ్ళి తాంబూలాలు మాత్రమే ఇచ్చుకొని వుంటారు. ఇంకా మీకు పెళ్ళి కాలేదు. అందుకని వివాహిత అని రాయకూడదు. అవివాహిత అని రాసుకోవాలి. అవునా?"

"అది కాదూ... మా పెళ్ళి అయిపోయింది" అంటూ ఆమె తన తల వెనక భాగం గోక్కోవడం, దాంతో తైల సంస్కారం లేని పొడవాటి చిక్కులు పడ్డ కురులు విచ్చుకోవడం... ఇదంతా ఆమె సుందర రూపానికి ఓ చక్కని నేపథ్యంగా మారిపోవడం.... అన్నీ ఒక్క క్షణంలో జరిగాయి.

"మరి మీ భర్త?"

"ఉన్నాడు. ఏమో.... లేడనీ చెప్పొచ్చు."

"అంటే నీ భర్త వదిలేశాడు. అంతేనా? అవుతే మగడు లేని స్త్రీ అని రాసుకోవాలి. అవునా?"

"ఆ మాట నన్ను అడిగి రాసుకోవడం మంచిది. మరోసారి అడుగుతున్నాను. మీరు నన్ను మగడు లేని స్త్రీ అని అన్నారు కదూ? నాది అలాంటి కేసు కాదండోయ్! వదిలేసినట్లవుతే అతను వారం వారం నా దగ్గరకి మధ్యవర్తిని ఎందుకు పంపుతున్నట్టు?"

"అయితే మీరే ఉపేక్షించి వుంటారు."

"నేను ముందు అపేక్షించిందీ లేదు. తర్వాత ఉపేక్షించనూ లేదు. మీకు ఎలా రాసుకోవాలని తోస్తే అలా రాసుకోండి. మీకు అన్నీ తెలుసు కదా!"

"అయినా నాకు నీ భర్త విషయం తెలుసుకోవలసిన అవసరం అసలు లేదు. మీరు చెప్పేది రాస్తాను. భర్త ఉన్నాడని రాసుకుంటాను."

"అదే మంచిది."

"ఇది మంచిదో, చెడ్డదో రాసుకునే పుస్తకం కాదు. వాస్తవాలు రాయడానికే వుంది."

"నేను చెబుతున్నది వాస్తవమే!" అనేసి తన తల వెంట్రుకల్ని వెనక్కి ముడివేసుకుంది. అవసరం లేకున్నా అతను ఆమె చేష్టల్ని శ్రద్ధగా గమనించసాగాడు.

"మీకు పిల్లలు కలిగారా?"

"మగపిల్లలూ లేరు. ఆడపిల్లలు సైతం కాలేదు."

"మరి ఛిద్రం (గర్భస్రావం అనే అర్థంలో) జరిగిందా?"

"అవును. జరిగిందనే చెప్పాలి. అత్తారింటికి వెళ్ళి ఆరు నెలలు కాకముందే ఛిద్రం మొదలైంది. ఓనాడు కాకుంటే మరోనాడు ఛిద్రం లేకుండా గడవనే లేదు."

"వామ్మో! రోజూ ఛిద్రమా?"

"మీరేం మాట్లాడుతున్నారు?

గర్భ ఛిద్రం అంటే మాటలా ?"

"ఛీ! ఛీ!! ఏం మాటలు మీవి? మా అన్నయ్య ఇప్పుడు ఇంట్లో లేకపోవడమే మంచిదైంది.

ఎన్యూమరేటర్ కొంచెం కోపానికి వచ్చాడు.

"మీ అన్నయ్య ఉంటే ఏం? ఇది ప్రభుత్వం పని. మీ అన్నయ్యే కాదు" అబ్బ వున్నా మేం అడగాల్సింది అడిగే తీరుతాం. మీరు నిజమే చెప్పాలి. చెప్పనట్లయితే అది నేరమవుతుంది. మీరు చెప్పిందంతా అతి రహస్యంగా భద్రపరుస్తాం మేం."

"ఉక్కపోతగా వుంటే దీంతో విసురుకోండి" అనేసి నళిని ఓ విసనకర్ర బెంచీకి ఓ చివర వుంచింది.

"మా అన్నయ్య వుండగా ఇవన్నీ అడిగితే నాకు సిగ్గేసేది బాబూ!"

"ఇక.... చెప్పు"

"లేదు"

"ఏం లేదు? చెప్పేది లేదు అనా?"

"కాదు, కాదు – ఇందాకా మీరు ఛిద్రం గురించి అడగలేదూ... అది లేదని"

"నీకు నెల నెలా ఎంత ఆదాయం వుంది?"

"అన్నయ్య చేసే వడ్రంగి పనికి మూడు రూపాయలు కూలి."

మీ అన్నయ్య వడ్రంగి పని గురించి కాదు, మీ ఆదాయం.

"నేను పనికి వెళ్ళను."

"అయితే ఆదాయం ఏమీ లేదన్న మాట. అశ్రితురాలిగా ఒకరి మీద ఆధారపడి బతుకుతున్నారు. అవునా?"

"ఎవరు? నేనా? అలా అని ఎవరన్నారు? మీకు ఆ పళ్ళక్కడవిల్ కాత్త చెప్పి వుంటుంది. ఆగండి మీరు. దాని విషయం నేను చెబుతాను."

అతను ఆసక్తిగా నవ్వాడు.

"ఎవరూ? కాత్తా? ఏం చెప్పిందని? అసలు మీరు నా మాట వినసే లేదు. ఒక వ్యక్తికి ఆదాయం లేనట్లయితే మరొకరి ఆదాయంతో జీవించాలి. మీకు కూడా ఆదాయం లేదు. మరి మీ తిండికి, గుడ్డలకి, ఇతర పనులకి డబ్బులు అవసరం. ఆ డబ్బులు సమకూర్చే మనిషిని... అంటే... మీ అమ్మే కావొచ్చు, అన్నయ్యే కావొచ్చు. ఒకరిని ఆశ్రయించి మీరు బతుకుతున్నారు. నేనన్నది నిజమే కదా?"

"ఇదేంటి? మీరు అచ్చం పోలీస్ స్టేషన్లో ప్రశ్నించినట్టే అడుగుతున్నారు?"

"ఎప్పుడైనా స్టేషన్లో నిన్ను ఏమైనా అడిగారా?"

"అందుకూ ఆ నమ్మక ద్రోహి అవకాశం కల్పించాడు."

"మీ భర్త. అవునా?"

"వాడా భర్త? అసలు నాకు భర్త లేడనే రాసుకోండి! కావాలంటే మీకు ఏదైనా ఇస్తాను."

“ఆ విషయం అలా వుంచండి. మీకు ఆదాయం ఏమీ లేదు కదా?”

“ఆదాయముంది. నేనే ఎవ్వరినీ ఆశ్రయించి వుండటం లేదు. నెలకు పదిహేను రూపాయలైనా ఆదాయముంటుంది.”

“సరి... ఏం పని చేస్తారు?”

“మీ ప్రభుత్వానికి ఇవన్నీ కావాలా? నేను ఒక్క పని కాదు, ఎన్నో పనులు చేస్తాను.”

“అన్నీ చెప్పేసెయ్! రాయడానికి కాయితంలో బోల్డు స్థలముంది.”

“ఈ ఇంట్లో నేను గంజి వార్చుతున్నది. ఈ అరుగు అలికిందీ నేనే!”

“అలకడం బానే వుంది. అద్దంలాగా మెరుస్తోంది.”

“నా చెంపలు అద్దంలా మెరుస్తాయని మా ఆయన... హాఁ... వాడు నాకేమీ కాడు లెండి... ఎప్పుడూ అంటుండేవాడు. అయితే ఈ అరుగులు నా చెంపల్లా ఉన్నాయన్నమాట” అంటూ చమత్కరించింది.

అతను నవ్వాడు.

ఈలోగా పొరుగింటి అమ్మాయి వాకిట్లో నించుని ఎన్యూమరేటర్ మీద కన్ను వేసింది.

“పిల్ల వయస్సు పదేళ్ళే! దాని వాలకం చూశారు కదా! మరో రెండేళ్ళు పోతే, ఈ దారంట ఎవరినీ నడవనీయదు” అంది నళిని.

ఆ అమ్మాయికి కోపం వచ్చింది.

“నేను చూస్తే నీకేం నష్టం వెళ్తున్నాను” అనేసి వచ్చిన దారంటే వెళ్ళిపోయింది. దారి పొడుగూతా ఆ పిల్ల ఏదో గొణుగుతూనే వుంది.

“దానికి వాదులాడ్డం మహా ఇష్టం. ఎవరు కనిపించినా చాలు. ఎక్కణ్ణించో ఊడిపడుతుంది. వాకిట్లో హాజరు.”

ఎన్యూమరేటర్‌కు అక్కడ వుండాలంటే భయం వేయసాగింది.

“ఇంతకీ... మీరు చేసే వృత్తి చెప్పనే లేదు.”

"చెప్పలేదా? ఇంట్లో ఎన్ని పనులుంటాయో, అన్ని పనులూ చేస్తాను."

"ఆదాయం వున్న పని గురించే నాకు కావాల్సింది."

"ఆదాయం వున్న పని లేకుంటే మీరు ఏదైనా కల్పిస్తారా?"

"అలా అడిగితే...." అతను ఆ వాక్యం పూర్తి చేయడానికి నసుగుతూ సందేహించాడు.

"ఆ! అలా అడిగితే ఇస్తారు కదూ?"

అతను చుట్టూ కలయచూశాడు.

మళ్ళీ ఆమే "ఇంటికి ఎవరొచ్చినా కనీస మర్యాద చేయాలి కదా!" అంది.

అతను హఠాత్తుగా "నేనేమైనా అమర్యాదగా మాట్లాడానా?" అన్నాడు.

"లేదు నేనే మర్యాద చూపలేదు. ఆకు వేసుకోవాలనిపిస్తోంది కదూ?" అనేసి ఆమె గదిలోకి వెళ్ళిపోయింది. ఆకు మీద సుతారంగా సున్నం రాసే శబ్దం లోపల్నించి సన్నగా విన్పిస్తోంది.

కాసేపయ్యాక తమలపాకుతో తిరిగొచ్చింది. అతను దవడకు దట్టించాడు. ఆమె మళ్ళీ గదిలోకి వెళ్ళింది. ఈసారి మూడు కొయ్య బొమ్మల్ని తీసుకొచ్చింది.

"నా పని ఇదే! ఒక్కో బొమ్మ తయారీకి ఒక్కో రోజు చాలు అంది."

అతను ఆ బొమ్మలు తీసుకొని చూశాడు. అవి జానెడు పొడవుతో వున్న స్త్రీ రూపాలు. అన్నీ బాగున్నాయి. చక్కగా రంగులతో మెరుస్తున్నాయి. అవయవాలు అందంగా తీర్చి వున్నాయి. ఎత్తయిన వక్షస్థలం. లావుపాటి పిరుదులు. సన్నని నడుము. సమృద్ధిగా వున్న కేశ సంపద. ఆకట్టుకునే దరహాసం. మొత్తమ్మీద ఆకర్షణీయమైన సుందర శిల్పాలు. అతను వాటికేసి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. తర్వాత ఆమె వైపు తిరిగి "నాలుగూ ఒకే తీరు అద్భుతం!" అన్నాడు.

"మూడు బొమ్మల్ని చూసి మీరు నాలుగు అనడమే అద్భుతం" అంది. అతను జవాబు చెప్పలేదు.

"ఇది అచ్చు పోసి చేసిన పనా?"

"మేం అచ్చుపోత పనివాళ్ళం కాదు."

"పాల సముద్రం చిలికి తయారు చేసినవి కావొచ్చు. అచ్చం లక్ష్మీదేవి రూపాల్లా వున్నాయి."

"పాల సముద్రం చిలికేందుకయితే నే వెళ్ళలేదు. లక్ష్మీదేవి కూడా ఎలా వుంటుందో తెలీదు. నా వృత్తి ఏమిటో మీకు చూపిస్తున్నాను. ఇంతకీ నేను మూడు చూపిస్తే, మీరు నాలుగని ఎలా చెప్పారు?"

"ప్రాణం లేని ఈ మూడూ, వీటిని తయారుచేసిన ప్రాణమున్న ఒకరూ... అలా మొత్తం నాలుగు. అవన్నీ ఒకేలా వుండటమే అద్భుతంగా వుంది."

"అంటే ప్రాణం లేని వాటికి మల్లే ప్రాణమున్నది వున్నదనా? అందులో అద్భుతాలూ, గిద్భుతాలూ లేవు. అంతా నా తలరాత."

ఆమె కళ్ళు మిల మిల మెరిశాయి. మళ్ళీ గదిలోకి వెళ్ళి తిరిగొచ్చేసరికి ఆమె ముఖం ఎర్రబారింది. చేతిలో మరో బొమ్మ వుంది. దాన్ని ఆమె అతని దగ్గర వుంచింది. అతను దాన్ని కూడా తీసుకొని చూశాడు.

"కంస వధ చేస్తోన్న కృష్ణుని బొమ్మా? లేక ముంతియఅప్పన్‌కు శ్రీ కృష్ణుని వేషం వేశారా? ఇది కాస్త పెద్దగా వున్నట్లయితే... దృష్టి దోషం తగలకుండా వుండేందుకు దోస చెట్ల కంచెలో వుంచాల్సి వచ్చేది! అలా కాదంటే పూర్తి చిన్నదైనా..."

ఆమె మధ్యలో కలుగజేసుకొని ఇలా అంది.

"నేను నలభై యాభై బొమ్మలు తయారు చేసిన తర్వాత ఆఖరుకు ఈ బొమ్మ ఇలా తయారైంది. కృష్ణుని రూపం తయారు చేశాను. చూసిన ప్రతి మనిషీ తీసుకొని వెళ్ళాడు. మూణ్ణాలుగు అణాల వెలకి అమ్మేదాన్ని! రాను రానూ వేషం శ్రీ కృష్ణుడిలాగా, రూపం మరో కృష్ణుడిలాగా తయారైంది. మరో కృష్ణుడంటే ఎవరో కాదు – ఒకప్పుడు నేను శ్రీకృష్ణుడిలాగా భావించుకున్న ఓ మనిషి. అతని విషయం గుర్తుకొస్తే మైమరచిపోతాను. తీరా బొమ్మ తయారు చేసి చూసేసరికి అతని రూపమే వచ్చింది. నా కోపమంతా బొమ్మ రూపంలోకి వచ్చేసింది. క్రమేపీ ఎవ్వరూ నా బొమ్మలు కొంటానికి రాలేదు. మగాళ్ళ బొమ్మలు చేయరాదని తర్వాత నిశ్చయించుకున్నాను. శ్రీ పార్వతి రూపం తయారు చేసి చూశాను. అంటే... ఓ ఆడబొమ్మ తయారు చేసి దానికి శ్రీ పార్వతి అని పేరు పెట్టానంతే! లేకపోతే నేను పార్వతిని చూశానా? పార్వతి తపస్సు చేసిందనీ, శివునితో పాటు నాట్యం చేస్తుందనీ విన్నాను. సినిమాల్లోనూ చూశాను.

అంతేగాకుండా పార్వతీ పరమేశ్వరులు అప్పుడప్పుడు అల్ప విషయాల మీద పోట్లాడతారనీ విన్నాను. అవన్నీ తలచుకుంటూ బొమ్మ తయారు చేశాను. కొన్నిసార్లు నన్ను నేను అద్దంలో చూసుకుంటూ, పార్వతికి మల్లే ఒక్కో భావం ప్రదర్శిస్తూ బొమ్మలు తయారు చేశాను. నేనే పార్వతిని అనుకొని చేసిన పని ఇది. చివరికి పార్వతిలాగా....."

ఆమె మళ్ళీ మొదలెట్టడానికి ముందు అతనన్నాడు.

"మీరూ, పార్వతీ సమానమే లెండి."

"నేనూ, పార్వతి ఎలా సమానం? నా రూపమే పార్వతికి ఆపాదించాను. ఆ తర్వాత నాకు సిగ్గనిపించింది. నా రూపం చెక్కి అమ్మితే కొంటానికి...."

అతను వెంటనే అందుకొని "బోలెడు మంది వుంటారు" అన్నాడు.

"ఆ మాత్రం నాకు తెలీదా ఏం? కాని కొనేవాళ్ళు నన్ను తిట్టిపోస్తారు. 'బొమ్మ బ్రహ్మాండంగా వుంది. కాని తన రూపం చూపించి మగాళ్ళని ఆకట్టుకోవడానికే బొమ్మలు అమ్ముతోంది" అని, నేను ముందే చెప్పాను కదా, కాత్త అని – అది నా ముఖమ్మీదే అనేసింది. దాన్ని ఓ ఆట ఆడించాలని వుంది. ఏమో! వేరే వాళ్ళు నాలాంటి పనిచేస్తే, నేనూ అలా అని వుండేదాన్ని కావచ్చు. మానవ మనస్తత్వం అంతే అవొచ్చు."

"నిజమే కావొచ్చు! ఏమైనా మీ రూపాన్ని ఇంత చక్కగా చెక్కగల్గిన మీ సామర్థ్యం అద్భుతం."

"మీరు ఉత్త ముఖస్తుతి చేస్తున్నారు. ఓ బొమ్మ చేసిన తర్వాత... దాన్ని చూసి ఎన్ని కావాలన్నా చేసుకోరాదూ? ముందు అద్దంలో చూసి చేస్తున్నట్టు ఓ బొమ్మ తయారు చేయాలి. అది ఏమంత గొప్ప పనేమీ కాదు."

"మీరనేది నిజమా?"

"నేనేం చెప్పినా వెంటనే నిజమేనా అంటారు ఈ ఇరుగుపొరుగువాళ్ళు. వాళ్ళంటే నాకు భయం. మీరూ అలాగే...."

"ఇప్పుడు నేనంటే భయం లేదనుకుంటాను."

"నాకు ఎవరన్నా ఇప్పుడు భయం లేదు. నేను తప్ప... వేరే వాళ్ళు ఎవరున్నా నాకు విచారం లేదు...."

"కళాకారుల్లో చాలామంది ఈ బాపతే లెండి."

ఆమె గదిలోకి వెళ్ళి తిరిగొచ్చేలోపు "అబ్బా! ఎంత పొగరు!" అని అతను స్వరం తగ్గించి అనకుండా వుండలేకపోయాడు.

ఆమె మరో నాలుగు బొమ్మల్ని అతని ముందు వుంచింది. కరుణ, రౌద్రం, అద్భుతం, శృంగార రసాలకు పరాకాష్టగా వున్న ఆమె ప్రతిరూపాలే అవి.

"ఈ పని మీ ప్రత్యేకత అంటే.... మళ్ళీ మీరు నన్ను ముఖస్తుతి అంటూ ఆక్షేపిస్తారా?"

"అలా అనకండి. ప్రత్యేకత అని ఎందుకనాలి సార్? ఈ బొమ్మల్లో దేన్నీ ఇప్పుడు అమ్మడం లేదు. ఏదో పగటి నిద్ర మంచిది కాదని ఈ పని చేస్తున్నాను. ఎప్పుడైనా ఓసారి వీటితో అవసరం వుండొచ్చు. కానీ... జనాలు ఏమనుకుంటారో అని అమ్మడం లేదు."

"మీరెందుకు ఈ అపనిందలకు భయపడుతున్నారు? ఏమైనా అనుకోనివ్వండి. ఆ బొమ్మకు ఎలాంటి గుడ్డి వెధవైనా ఓ రూపాయి వెచ్చిస్తాడు. మీ అవసరాలు సైతం ఇతరుల మీద ఆధారపడకుండానే తీరిపోతాయి. మీ వృత్తి శిల్పవృత్తి అని రాస్తున్నాను" అంటూ రాసుకున్నాడు. తర్వాత... ఏమిటేమిటో నోటు చేసుకున్నాడు. అతను ఆమె అన్నయ్య వివరాలు అడిగి రాసుకున్నాడు. ఆలోగా ఆమె ఓ బొమ్మ మినహా అన్నింటినీ గదిలోకి తీసుకెళ్ళింది. ఒకటి ఇంకా ఆమె చేతిలోనే వుంది.

అతను మరోమారు తమలం వేసుకున్నాడు.

"బొమ్మ అసలే అమ్మను అంటున్నారు కదూ?"

"ఊహూఁ...."

"మీ దగ్గర ఇంకా వున్నాయా?"

"ఈ ప్రశ్న కూడా జనాభా లెక్కలకు సంబంధించినదేనా?"

"మరి వెళతాను. అన్నట్టు మీ భర్త కోపించి...."

ఆమె ఆ మాటకు అడ్డు వస్తూ ఇలా అంది.

"ఆ విషయం చెప్పనే లేదు కదూ? అయినా దారినపోయే ప్రతి దానయ్యతోనూ నా భర్త విషయం ఇంతకన్నా ఎక్కువ ఎలా చెప్పగలను? వాడో మృగం. అస్తమానం

తాగుతాడు. తర్వాత పిచ్చికుక్క అవుతాడు. దారిలో వెళ్ళే ప్రతి మనిషితో పేచీలు పెట్టుకుని తన్నులు తింటాడు. కల్లు నిషా దిగేవరకు... అంటే తెల్లవారేదాకా పోలీస్ స్టేషన్‌లోనే మకాం. ఓ రోజు సందెవేళ హేడంగు అనే ఓ పోలీసుని పంపించాడు. అతగాడిని జామీను మీద విడిపించాలట!" తెల్లారేక వస్తే చాలు" అన్నాన్నేను. 'మగడు లేనప్పుడు ఎవడైనా ఇంట్లో జొరబడి అత్యాచారం జరిపితే ఎలా?' అన్నాడు పోలీసు. 'అలా ఎవడైనా వస్తే, నా తలగడ కింద ఉలి దాచి వుంచాను" అని బదులిచ్చాను.

ఆ తర్వాత నా భర్త తూలుకుంటూ వచ్చాడు. నేనేమీ అడగలేదు. తెల్లవారేక "నేను మా పుట్టింటికి వెళ్తున్నాను" అన్నాను. అతను "ఎందుకు?" అన్నాడు. "ఇక్కడుంటే కొన్నాళ్ళకి నేను ఎవడినైనా ఉలితో చంపాల్సి వస్తుంది" అందుకే వెళ్తున్నాను" అన్నాను. "చింతబరిగెలు సైతం విరపడం రాని నువ్వు ఉలితో ఎలా చంపుతావు?" అనడిగాడు ఆ పశువు. "ఈ పశువుతో కాపురం చేయడం నా వల్ల కాదు" అనేసి నేను వీధిలోకొచ్చి బస్సు ఎక్కి ఇక్కడికొచ్చాను. అంతే! ఆ తర్వాతే ఈ కథలన్నీ!"

ఆమె చెప్పడం ఆపాక అతను లేచాడు.

"కావాలంటే ఇది వుంచండి" అంటూ ఆమె ఓ ప్రతిమ ఇచ్చింది. అతను ఆనందంగా అందుకొని పరిశీలించాడు. రౌద్రరూపంలో వున్న ఆమె ప్రతిమే ఇది. దాన్ని చూశాక అతని ముఖంలోని ప్రసన్నత చిటికెలో మటుమాయమైంది. అయినా కృతజ్ఞతలు చెప్పి అతను ఓ కాగితమ్ముక్క అక్కడ వుంచుతూ "ఇది చూడండి" అన్నాడు.

ఆమె చూసింది. అతను ఆమె రూపాన్ని కాయితమ్మీద గీశాడు. ఆమె శ్రద్ధగా గమనిస్తూ "ఇలా మనం మాట్లాడుకునేలోపు దించడం అద్భుతం! ఆ బొమ్మ ఇటు ఇచ్చి వెళ్ళండి" అంది. ఇందాక ఇచ్చిన కొయ్యబొమ్మని తీసుకొని లోపలికి వెళ్ళింది. ఈసారి పార్వతి తపస్సు చేస్తోన్న కాస్త పెద్ద బొమ్మను పట్టుకొచ్చి ఆ చిత్రకారునికి బహూకరించింది. అతను దాన్ని సంతోషమూ, కృతజ్ఞతా కలగలిసిన భావంతో అందుకున్నాడు.

"మరి వెళ్ళిరండి" అని లోపలికి వెళ్ళిపోయింది.

అతను పక్క ఇంటి వేపు నడిచాడు. తీగల్ని మీటితే వచ్చే వీణానాదం ప్రతిధ్వనిస్తోంది అతని హృదయంలో.



# ఎం.టి. వాసుదేవన్ నాయర్

**కూ**డల్లూరులో 15-7-1934లో జననం. ఆధునిక మానవుడి జీవితానికి సంబంధించిన కాల్పనిక విషయాలే ఎం.టి.గారి ముడిసరుకు. సమకాలీన సమాజంలోని వ్యక్తుల వ్యాకులత్వం ఇతని కథా సాహిత్యం. గుండెలోతుల్లోని ఆర్తిని తవ్వి పోస్తాడు.

కథానిక, నవల, సినీరంగం, పత్రికలు... ఇలా అనేక రంగాల్లో సహృదయ పాఠక ప్రేక్షకుల దృష్టిని ఆకట్టుకొన్న రచయిత. ఎన్నో కథలు సినిమాలుగా మారాయి. వీరి 'నిర్మాల్యం' సినిమాకు జాతీయ బహుమతి. 'మజ్ఞ' (మంచు) నవలకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు. 'నాలుకెట్టు'కు కేరళ సాహిత్య అకాడమీ పురస్కారాలు లభించాయి. ఇప్పుడు 'మాతృభూమి'కి ఎడిటర్. ఎం.టి. గారు నూతన రచయితలకు ప్రతీక.

# చీకటి ఆత్మ

## - ఎం.టి. వాసుదేవన్ నాయర్

**భ**యపడుతూ భయపడుతూనే అతను బయటికొచ్చాడు. వాకిట్లో నించుని ముందుగా వరండా వైపు చూశాడు. అచ్చుతన్ నాయర్ మాంఛి నిద్రలో వున్నాడు. ఓ నిమిషం సంశయిస్తూ నించున్నాడు. అచ్చుతన్ నాయర్ గురక పెడుతున్నప్పుడల్లా అతని గొంతుకోలు ఎగిసిపడే దృశ్యం చూడ్డానికి తమాషాగా వుంటుంది. అతని నడుముకి వున్న పోక వక్క జారిపోవడానికి సిద్ధంగా వుంది. వెంట్రుకలు దట్టంగా వున్న అతని చేతులూ, అసహ్యంగా కనిపించే లావైన చేతి వేళ్ళూ చూశాక కోపమే కల్గింది.

"ఆ చేతులతోనే కదా నన్ను నిన్న సాయంకాలం కొట్టింది! నిన్నేనా? లేక కొన్ని రోజుల ముందా?" అనుకున్నాడు వేలాయుధన్. అతను గొంతు తడిమి చూసుకున్నాడు. నొప్పి ఇప్పటికీ వుంది.

"ఎప్పుడో ఓ రోజు.... ఎవ్వరికీ తెలియనివ్వకుండా అచ్చుతన్ నాయర్ చేయి నరికేయాలి... ముందే పెద్ద గండ్ర గొడ్డలిని ఎక్కణ్ణించైనా పట్టుకొచ్చి భద్రపరచాలి. ఆ తర్వాత... అచ్చుతన్ నాయర్ వెంట్రుకలున్న తన బలిష్టమైన చేయిని నేలమీదపరచి హాయిగా నిద్రపోతున్నప్పుడు... మెల్లగా వెళ్ళి ఒక్క వ్రేటుతో అతని చెయ్యి నరికి పారెయ్యాలి. వాడికి అలాగే కావాలి. కాకుంటే నాకు ఇలా ద్రోహం చేస్తాడా? నిన్న? .... నిన్నేనా? లేక కొన్ని రోజులకు ముందా?" అని ఆలోచించసాగాడు.

ఆ దృశ్యం అతని కళ్ళ ముందు కదలాడింది.

ఆ రోజు.... పడమటి బావిగట్టున స్నానం చేయించడానికి తనను అచ్చుతన్ నాయకర్ తీసుకెళ్ళాడు. కొంతకాలంగా అతనే స్నానం చేయిస్తున్నది. అది తనకు ఏ మాత్రం ఇష్టంగా లేదు. తనేమైనా చిన్నపిల్లాడా? పెద్దయ్యాడు. బాగా పెద్దవాడయ్యాడు. గోపి అంత వున్నప్పుడు వాగు కయ్యల్లో స్నానం చేసేవాడు. లేదా అమ్మ స్నానం చేయించేది.

ఇప్పుడు అతను పెద్దవాడయ్యాడు.

"ఇరవై ఒక్క ఏళ్ళు వచ్చాయి. ఏ జన్మలో చేసుకున్న పాపమో! సుకృత క్షయం! సుకృత క్షయం!!" అమ్మమ్మ ఎప్పుడూ ఇలాగే అంటుంది. అలా అనడం తన గురించే అని తెలుసు.

అయినా అచ్చుతన్ నాయర్ తనను స్నానం కోసం లాక్కుపోతున్నాడు. మూడు పెద్ద బొక్కెన్ల నిండా నీళ్ళున్నాయి. పగిలిపోయిన చిన్న ఇత్తడి చెంబుతో నీళ్ళు పోయడం.

నీళ్ళు నింపిన బొక్కెన వద్ద తనను కూచోబెట్టాడు. అచ్చుతన్ నాయర్ పాత్ర కోసం వెళ్ళగానే ఓ దివ్యమైన ఉపాయం తట్టింది. ఉన్న పళంగా ఆ పడమటి గట్టు మీంచి ఓ నది పారితే ఎలా వుంటుంది? తెరచాపల పెద్ద పెద్ద పడవలూ, చేపలు పట్టే చిన్న చిన్న దోణిలూ ఆ నదిలో పయనించడం ప్రారంభిస్తాయి. తను రోజూ పడుకునే గది తలుపు సందుల్లోంచి ఇవన్నీ కనిపిస్తాయి. నైరుతి రుతుపవనాలు రాగానే ఓ రకం చేపలు తుళ్ళి పడటమూ, అవసరమైతే వాటిని తలుపు సందుల్లోంచే గాలంతో పట్టుకోవడమూ.... ఎంచక్కా జరిగిపోతాయి.

ఇంకేం? మూడు బొక్కెన్లలోని నీటిని పారబోశాడు. ఎర్రని మట్టితో కొట్టుకుపోతున్న ఆ నీటి ప్రవాహాన్ని చూసి అచ్చుతన్ నాయర్ కోపంగా "వేలాయుధా!" అంటూ పిలిచాడు.

అది పిలుపు కాదు. గద్దింపు.

తను భయంతో నాయర్ కేసి చూశాడు.

"పొగరు చూపిస్తున్నావా?"

ఏమీ మాట్లాడలేదు. కళ్ళు చింతనిప్పుల్లా మండుతున్నాయి. అచ్చుతన్ నాయర్ తలమీద ఖాళీ బొక్కెన బోర్లించాలనుకున్నాడు తను. ఇంతలోనే ఓ దెబ్బ పడింది.

"నన్ను కొట్టకు... నన్ను కొట్టకండి!"

తను బిగ్గరగా ఏడ్చాడు. అమ్మమ్మ అటుకేసి వచ్చింది. ఆమె వెనకాలే పెద్దమ్మా, గోపి వచ్చారు.

అమ్మమ్మ తాను కప్పుకున్న గుడ్డ చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ "అతనికి దైవ దోషం వుంది అచ్చుతా! సొంత తెలివి లేదు కదా! అంది.

"చూశారమ్మా వీడి పని?"

"తంతేనే దారికొస్తాడు. ఇదంతా పొగరుతోనే!" అని గొణిగింది పెద్దమ్మ, అమ్మమ్మ. మరోమారు కళ్ళు తుడుచుకొని ఎప్పటిలా "ఏ జన్మలో చేసుకున్న పాపమో! సుకృత క్షయం! సుకృత క్షయం!!" అని గొణుక్కుంది.

అదీ అప్పుడు జరిగిన సంఘటన.

వేలాయుధన్ గొంతు తడిమి చూసుకున్నాడు. నొప్పి ఇంకా వుంది.

బాగా మారిన ఓ గండ్ర గొడ్డలి అయ్యప్పన్ దగ్గర వుంది. అతను పొద్దంతా పనిచేసి సాయంత్రం తన కూలి గింజల కోసం రాగానే, ఎలాగైనా అతని గొడ్డలి కాజేయాలి.

గొంతు కోలు ఎగిరిపడుతూ అచ్చుతన్ నాయర్ హాయిగా నిద్రపోతున్నప్పుడు...

ఒకే ఒక్క దెబ్బతో చెయ్యి నరకాలి.

మర్నాటి పొద్దున జరిగే తమాషా కళ్ళారా చూడాలి.

"ఇదంతా పిచ్చి కాదు. తల పొగరు" అని కేకలేస్తూ తనను కొట్టడానికి అచ్చుతన్ నాయర్ సమీపిస్తున్నప్పుడు అతనికి చెయ్యి వుండదు. భలేగా వుంటుంది.

తన చెయ్యి కోసం అతను ఇల్లూ, వాకిలీ... అంతా పరుగులు పెడుతోంటే తను నవ్వుకొని నవ్వుకొని చస్తాడు.

వేలాయుధన్ ఇలా ఆలోచిస్తూ వరండాలోంచి ఉత్తరపు గదివైపు వెళ్ళాడు. తెరచివున్న కిటికీ దగ్గర గడ్డి చాప మీద అమ్మమ్మ పడుకొని వుంది. ఆమె దేహమంతా చేప పొలుసుల్లా చూడ్డానికి అసహ్యంగా వుంటుంది.

అమ్మమ్మ అంటే అతనికి ఏమాత్రం కోపంగా లేదు. ఆమె అతణ్ణి ఇంతవరకు ఎప్పుడూ తిట్టలేదు. కొట్టనూ లేదు. మిగిలిన వాళ్ళంతా అతణ్ణి కొట్టినవాళ్ళే! చివరికి గోపి, కుట్టి శంకరన్‌లు కూడాను. వాళ్ళిద్దరూ పిల్లలు. సాధారణంగా పిల్లలు పెద్దవాళ్ళని కొట్టరు కదా! అయినా ఈ పిల్లల వాలకమే వేరు.

పెద్దమ్మ కింది వాటాలో లేకపోవడమే మంచిదైంది. ఆమె గది మేడ మీదే! పెద్దమ్మా, పెదనాన్నా, గోపి పగలు పైకి వెళ్ళారంటే, సాయంత్రం అయితే గానీ కిందికి దిగిరారు.

ఇంటికి దక్షిణ భాగంలో చిమ్మ చీకటిగా వుంటుంది. పగలు కూడా చీకటిగానే వుంటుంది. లోగిలిలోంచి మాత్రం కొంత వెలుతురు ప్రవేశించే వీలుంది. దక్షిణ భాగం మూలల్లో వరి ధాన్యం గాదెలూ, గంపలూ వున్నాయి. కొంపదీసి ఆ చీకట్లో దయ్యాలు గాని దాక్కోలేదు కదా? ఒకవేళ మామయ్యే దాక్కుని వుంటే? ఉంటే అతని వెంట తప్పక ఓ కొబ్బరి మట్ట కూడా వుంటుంది. దాంతో చితకబాదడం అంటే మామయ్యకు మహా ఇష్టం. అయినా దయ్యాలున్న గదిలో మామయ్య ఎలా వుంటాడు?

ఓ మంచి రోజు చూసి మామయ్యనూ చంపి పారెయ్యాలి.

నేను కాస్త అలా బయటికి వెళ్ళి గుమ్మంలో కనిపిస్తే చాలు... ఇల్లంతా అదిరిపోయేలా అతను "అచ్చుతా...." అంటూ గర్జిస్తాడు.

ఆ తర్వాత అచ్చుతన్ నాయర్ ఒక్కదుటున నా మీదకి లంఘిస్తాడు. నేను బయటికి వెళ్ళరాదని వాళ్ళ షరతు. అచ్చుతన్ నాయర్ తన లావైన చేతివేళ్ళతో నా మణికట్టుని పట్టుకుంటే రోతగా వుంటుంది. కప్పను తొక్కినప్పుడు కలిగే అసహ్యం అది. గుమ్మం దగ్గర నన్ను అసలే కొట్టరు. అమ్మమ్మ ముందు కూడా కొట్టరు. ఉత్తరం భాగంలోకి వచ్చీ రాగానే అతను తన పరాక్రమం చూపిస్తాడు. ఇవన్నీ వేలాయుధన్ ఆలోచనలు.

అతను తలుపు పక్కన దాక్కుని సందుల్లోంచి చూశాడు. ఎవ్వరూ లేరు. మామయ్యకు తను కన్పించకూడదు. శంకరన్ కుట్టీకి కన్పించవద్దు. కనిపిస్తే వెంటనే ఇలా పిలుస్తాడు.

"నాన్నా! వేలాయుధన్ అన్నయ్య అదిగో వెళ్ళిపోతున్నాడు" అని. అత్తమ్మ చూసినా ఫలితం ఇదే! కాకుంటే మామయ్యను పిలవకుండా, అచ్చుతన్ నాయర్‌ను కేకేస్తుంది.

"ఓ అచ్చున్నాయర్?" ఎవరు బయటికి వచ్చింది? చూశావా?"

ఒక్కోసారి ఆమే "ఎక్కడికండీ తమరి సంచారం?" అని ప్రశ్నిస్తుంది. ఆమె పెదాలు తెల్లగా పాలిపోయి వుంటాయి. చూడ్డానికి రోతగా వుంటాయి. డోకు వస్తుంది. నేను వెంటనే కొండ మీదకి వెళ్ళాలి. మాంఛి సైజులో వున్న తెల్లని రాళ్ళు కొన్ని ఏరుకోవాలి. ఆమె అచ్చున్నాయర్‌ను పిలుస్తున్నప్పుడు, గురి చూసి మూతికేసి బలంగా విసిరికొట్టాలి.

మరి కుట్టి శంకర్‌ను ఏం చెయ్యడం? వాడి బట్టతల మీద రుబ్బురాయితో గట్టిగా కొట్టాలి – ఇవీ అతని ఆలోచనలు.

వేలాయుధన్ వాకిట్లోకి రాక చాన్నాళ్ళైంది. బయటకు సరిగా చూళ్ళేకపోయాడు. ఎండ చంద్రనిప్పులు చెరుగుతోంది. వేడి తగ్గితే చాలు మామయ్య వాకిట్లోకి వచ్చి సాయంకాలం దాకా అటూ ఇటూ పచార్లు చేస్తాడు.

వాకిట పేడతో అలికిన చోట ఓణం పండగ నాడు బియ్యం పిండితో వేసిన ముగ్గు కర్రలు ఇప్పటికీ చెరిగిపోకుండా అలాగే వున్నాయి. బలిచక్రవర్తి తల మీద వామనుడు పాదం మోపుతోన్న ముగ్గు దృశ్యమూ వుంది. లోగడ ఓసారి ఆ ముగ్గు చూడ్డానికి గుమ్మంలోకి రాగానే అచ్చుతన్ నాయర్ మెడలు పట్టి తన్నాడు. వాళ్ళెవ్వరూ తనను గమనించనే లేదు.

వాకిట్లో పడి వున్న ఏదో కాయితాన్ని తీసుకొని వేలాయుధన్ వడ్ల గాదెల గదికి పడమటి వైపు నడిచాడు. పేడలో గోడకి చేరగిలవేసి వున్న టేకు గంప మీద కాసేపు తబలా వాయించాడు. మామిడి చెట్టు నీడలో పెద్దమ్మ వాళ్ళ లేగదూడ పడుకొని ఏదో నెమరు వేస్తున్నట్టుంది.

ఆహ్లాదం గొల్పుతోన్న ఆ చల్లటి నీడలో అలా నిలుచోగానే వేలాయుధన్‌కు ఓ అనుమానం కలిగింది.

ఊరికినే కొంత నడుద్దాం అనుకున్నాడు. అచ్చుతన్ నాయర్ నిద్రలో వున్నాడు. మామయ్య గాదెలు వున్న ఇంటి మీద వున్నాడు. ఇదే తను బయటపడేందుకు చక్కని అవకాశం.

ఈ దక్షిణం మెట్లు దిగిపోతే ఓ భవనం వస్తుంది. అమ్మో! అక్కడికి వెళ్ళాలంటేనే భయం. ఆ భవనంలోనే ఓ చోట వున్న విషసర్పాల పొదల్లో కరినీలి అనే దయ్యం తల వెంట్రుకలు విప్పి పేలు చూడ్డానికి కూచుని వుంటుంది.

"మాతా ! భగవతీ!! కరినీలి కన్పించకుండా కాపాడు తల్లీ!" అని ప్రార్థించాడు.

చిన్నపిల్లల రక్తం జుర్రుకొని తాగి వాళ్ళని చంపి బావిలో పడెయ్యడం కరినీలి ప్రవృత్తి. పెద్దవాళ్ళకూ అది ఉపద్రవం కల్గిస్తుందా? తను పెద్దయ్యాడు. బాగా పెద్దవాడయ్యాడు. గడపదాటి లోనికి వస్తున్నప్పుడు తలవంచకపోతే దెబ్బ ఠపీమని తగలడం ఖాయం. అంత పెద్దయ్యాడు. పైగా ముఖమంతా కురుపులై రోమాలున్నాయి. అతను వెంటనే ముఖం తడిమి చూసుకున్నాడు. మహా దురదగా వుంది.

ఎంత పెద్దవాడైనా కరినీలి నేరుగా వస్తే ఏం చెయ్యగలడు? ఓ రొమ్ము తీసి భుజాల మీద వేసుకొని అది గుండెలు బాదుకుంటూ సుడిగాలిలా దూసుకొస్తుందట! అమ్మో! దాన్ని చూసే అవకాశం అసలే కల్పించకు తల్లీ!

ఒకవేళ తను ఒంటరిగా వున్నప్పుడు వస్తేనో? ఆ గుర్తుకొచ్చింది. ఓ అరటిపండు దగ్గరుంటే చాలు. అరటిపండుతో విసిరేస్తే కరినీలి బెదిరి పారిపోతుంది. ఇంతకీ ఈ విషయం ఎవరు చెప్పారు?

నాన్నగారి ఇంటిలో అక్కయ్య చెప్పింది. అది చాన్నాళ్ళ కిందటి ముచ్చట. అయినా జ్ఞాపకం వుంది. పట్టు కౌపీనం ధరించి ఏటి గట్టున ఇసుక గూళ్ళు కట్టుకుంటోన్నప్పుడు కావొచ్చు.

ఇంతకీ అలా చెప్పింది దేవకి అక్కయ్యా లేక అమ్మా? అమ్మ ప్రస్తుతం లేదు కదా! ఇప్పుడు... తాటితోపుకు ఆవల వున్న అడవిలోని మట్టిలో అమ్మ. పూర్వం మీనాక్షి అక్కయ్యో లేక అమ్మో కరినీలి విషయం పందిట్లో కూచుని వున్నప్పుడు చెప్పి వుండాలి.

అథవా అమ్ముక్కుట్టి చెప్పిందా?

మామిడి చెట్టు నీడలో వున్న లేగదూడ వీపు మీదకి ఓ కాకి పరుగున వచ్చి వాలింది. అది దొంగ కాకిలా వుంది. దానికి ఒకే ఒక కన్నుంది. ఇవన్నీ వేలాయుధన్‌కు తెలుసు. చిన్నతనంలో నేర్చుకున్న "కాకిపిల్లా! కర్రెపిల్లా!!" అనే పాఠమూ తెలుసు. అతనికి ఇంకా చాలా విషయాలు తెలుసు. అయినా అతను ఏం మాట్లాడినా, ఏం చేసినా జనాలు "స్థిరమైన బుద్ధి లేదు. ఏ జన్మలో చేసుకున్న పాపమో...." అంటున్నారు.

పాపం.... ఆ తల్లి తొందరగా కళ్ళు మూసుకొని వెళ్ళిపోవడమే నయమైంది. బతికి ఇవన్నీ చూడ్డం తప్పిపోయింది కదా!

ఈ జనాలందరికీ తనమీద కోపమని వేలాయుధన్ చక్కగా అర్థం చేసుకోగలిగాడు. లేగదూడ వీపు మీద బైఠాయించిన కాకి ముక్కుతో అదే పనిగా పొడుస్తోంది. సరిగ్గా అప్పుడే మెల్లిగా ఎవరో "వేలాయుధన్ బావా!" అన్నారు.

అతను మొదట వణికిపోయాడు. కొంపదీసి కరినీలి కాదు కదా! కాని కరినీలి "వేలాయుధన్ బావా!" అని ప్రేమతో ఎందుకు పిలుస్తుంది? అయ్యో! తనెంత మూర్ఖుడు!

గిర్రున వెనుదిరిగి చూశాడు. వడ్ల గాదెల గదికి కింది కిటికీ తెరిచి వుంది. కటకటాలు పట్టుకొని అమ్ముక్కుట్టి నిలుచుని వుంది.

“కరినీలి కాదు, ‘నేను అమ్మొక్కుట్టిని’. అయినా ముందు భయపడ్డావ్! అవునా?” అంది. వేలాయుధన్ ఊరికే బిగ్గరగా నవ్వాడు. తను ఎంత మూర్ఖుడు!

గోరింటాకు పెట్టుకున్న ఆమె బలమైన వేలికొసల్ని అతను చూడసాగాడు. పసుపు పచ్చని పట్టుగుడ్డల్లో ఆమె తల వెంట్రుకలు చెల్లాచెదురై వున్నాయి. అలా అతను అమ్మొకుట్టిని చూస్తూ వుండగానే ఆమె మరోమారు “బావా” అంది.

ఏం మాట్లాడాలో వేలాయుధన్‌కు బోధపళ్ళేదు. మామిడి పళ్ళలాంటి ఆమె చెక్కిళ్ళ మీంచి దృష్టి మరల్చాలంటే అతనికి మహా కష్టంగా వుంది.

“ఏం చూస్తున్నావు బావా”

“ఉం... ఉం”

“ఎందుకు బావా వాకిట్లోకి వచ్చి నించున్నావు?”

“ఉం... ఉం”

“నువ్వు బయటికి రావొద్దు”

అప్పుడతను మళ్ళీ మెల్లగా కళ్ళు ఎత్తి అమ్మొక్కుట్టి కళ్ళలోకి చూశాడు. పచ్చని పట్టుగుడ్డల కింద అమ్మొక్కుట్టి పొట్ట కన్పిస్తోంది. అతనికి కొంత సిగ్గేసింది.

“అచ్చున్నాయర్ చూడకముందే వెళ్ళిపో” అంది.

అమ్మొక్కుట్టి ఇంకా ఏదో చెప్పాలనుకుంది. అప్పుడు అతనికి అచ్చుతన్ నాయర్ బలమైన చెయ్యి గురించి గుర్తుకే రాలేదు. తన ముందర కిటికీ ఊచలు వున్నాయన్న ఊహే లేదు. కిటికీ వూచల్ని పట్టుకొన్న ఆమె వేలికొసల్ని ఓమారు తాకితే ఎలా వుంటుంది? ఎలా?

అతను మౌనముద్ర దాల్చాడు. ఆమె వేలికొసల్ని... ఎర్రని ఆ వేలి కొసలు..

“ఎందుకని దెబ్బలు తింటున్నావు?”

దానికి అతణ్ణించి జవాబు లేదు.

“ఏమిటి ఆలోచిస్తున్నావు?”

తల తిప్పుతూ అమ్మొక్కుట్టి చెవులొగ్గింది. అమ్మ వస్తోందా?

వేలాయుధన్ అప్పటికి ఆలోచిస్తూనే వున్నాడు. ఆమె వేలికొసల్ని తాకితే, ఎలా వుంటుంది? కాసింత తాకితే...

"నీ ఆరోగ్యం తప్పక నయమవుతుంది."

"ఉం"

"లేకుంటే ఉత్తగా దెబ్బలు తింటావు కదా?"

"ఉం"

"మొన్న రాత్రి ఎందుకంతగా ఏడ్చావు?"

"ఉం... ఉం"

అమ్ముక్కుట్టి కిటికీలోంచి తన చేతులు వెనక్కి తీసుకోవడంతో ఇబ్బంది పడ్డాడు. ఆమె వెనుదిరిగి చీర కాస్త సర్దుకుని మళ్ళీ కిటికీలో చేతులు పెట్టగానే ఊరట చెందాడు.

జంకుతూ జంకుతూనే "నీ వేళ్ళు కాస్త తాకనా?" అని అడిగాడు.

ఆమె ముఖమ్మీద నవ్వు వెల్లివిరిసింది. వేలాయుధన్ అది గమనించకపోలేదు. అతను ఏం మాట్లాడినా గోపి, శంకరన్ కుట్టి నవ్వుతారు. అయితే అమ్ముక్కుట్టి నవ్వు అలాంటి అపహాస్యం కాదు. అమ్ముక్కుట్టి నవ్వడం చూసి ఎందుకో అతనికి ఏడుపొచ్చేసింది.

అతను మెల్లిగా వేళ్ళని తాకాడు.

అలసిపోయిన కళ్ళతో ఆమె అతణ్ణి చూస్తూ నిలుచుంది.

"వెళ్ళు బావా! అచ్చున్నాయర్ వచ్చేస్తాడు మరి."

అతను అక్కణ్ణించి కదల్లేదు.

"వెళ్ళు" కొంత విసుగ్గానే అంది. అప్పటికీ అతను అక్కడే వున్నాడు. వడ్ల గాదెల గదిపైకి నిచ్చెన మెట్లు ఒక్కొక్కటే ఎక్కుతూ ఆమె పైకి వెళ్ళిపోయింది. ఆ తర్వాత పడమటి మెట్లు ఎక్కి కూనిరాగాలు తీస్తూ అతని కాలిబాటంట కదిలిపోయాడు. దారిపొడుగూతా అమ్ముక్కుట్టి జ్ఞాపకాలే! పచ్చని పట్టు జాకెట్టు మీదికి భుజాల మీదుగా జారిన ఉంగరాల జుత్తు మామిడి పళ్ళలాంటి చెక్కిళ్ళు! అమ్ముక్కుట్టి ఎంత అందంగా వుంటుంది. మడిచి పెట్టుకున్న తన గోచిని కాస్త విదిలించుకొని చూస్తూ వేలాయుధన్ సిగ్గుపడ్డాడు.

తన శరీరం బురద రంగులో వుంది. ఎంత అపరిశుభ్రంగా వుంది! దేహమంతా మట్టే! ముఖం తడిమి చూసుకోగానే నిండా చిన్న చిన్న రోమాలు తగిలాయి. విళక్కత్రే గోవిందన్ వస్తే అతని ముందుకు వెళ్ళి కూచోవడానికి ఇంక సందేహించకూడదు.

అమ్మూకుట్టి శరీరం మురికిగా వుండదు. నల్లటి అంచు వున్న తెల్ల చీర కట్టుకుని ఆమె కిటికీ దగ్గర నిల్చోగానే సాంబ్రాణి వాసనా, మొగిలిరేకుల వాసనా కలిపి గుప్పున వస్తుంది. వేలాయుధన్ ఉన్న పళంగా తన చెయ్యిని ముక్కు దగ్గరికి తీసుకెళ్ళాడు. ఛీ! కోడిపియ్యి వాసన! కంపు డోకు వస్తోంది.

ఆమె చేతి వేళ్ళని అతను తాకినప్పుడు తన చేతి వేళ్ళ బురద ఆమెకు అంటలేదు కదా అమ్మూకుట్టికి వాసన వేస్తుండవచ్చు.

అమ్మూకుట్టిని తను తాకిన దృశ్యం అత్తమ్మ చూసి వుంటే ఏమయ్యేది? ఎన్ని దెబ్బలు పడేవో?

ఉన్నపళంగా అందరి తలలూ బద్దలైపోనీ! మామయ్యదీ, అచ్చుతన్ నాయర్‌దీ, అత్తమ్మదీ, పెద్దమ్మదీ ..... అందరి తలలూ పగిలి ముక్కలవనీ!! శంకరన్ కుట్టి తల కూడా పగిలిపోనీ! వాడు మాటిమాటికీ తననే వెక్కిరిస్తాడు. ఊరికినే పగలబడి నవ్వుతాడు. ఇంకా వాడు ఇతర పిల్లలతో "అరేయ్! ఈ వేలాయుదేట్టన్‌కు పిచ్చి" అని వాళ్ళతో కూడా బిగ్గరగా చెబుతాడు.

అందుకే వాడి తల కూడా పగిలి ముక్కలు కానీ!

అమ్మూకుట్టి తననెప్పుడూ వెక్కిరించదు. ఆమె అసలే బాధపెట్టదు.

"మాతా ! భగవతీ !! ఆమెకు సుఖం కలగనీ" అని ప్రార్థించాడు. కాలిబాటకు ఇరువైపులా వెదురు చెట్లు, కింది పాములతో ఉన్న పొదలు, పైగా చెట్ల చుట్టూ తీగలు గుంపులు గుంపులుగా పాముల్లా అల్లుకుపోయి వున్నాయి. పగటి పూట కాబట్టి భయపడాల్సిన అవసరం లేదు. రాత్రి మాత్రం అక్కడ దయ్యాలు నిప్పుకణికల్ని నములుతూ నాట్యం చేస్తాయట!

ఆ కాలిబాట ఓ కొండవాలు దాకా వుంది. అక్కడ... మామిడి చెట్టు కింద వున్న బావిలోంచి ఆడపిల్లలు నీళ్ళు తోడుతున్నారు. వేలాయుధన్ అటు చూళ్ళేదు.

"ఎక్కడికి చినబాబూగారూ?" ఓ అమ్మాయి అడిగింది. అతను మాట్లాడలేదు. "ఆమెకు ఆ విషయం ఎందుకంట? మామయ్యతో చెప్పడానికో లేక అచ్చుతన్ నాయర్‌తోనా?" అనుకున్నాడు.

దారిపక్కన ఎర్రమట్టిని తవ్విన చోట ఏర్పడ్డ గుంటలోకి గురిచూసి ఓ రాయి విసిరాడు. తర్వాత మెల్లమెల్లగా కొండ ఎక్కాడు.

నీళ్ళు తోడుతోన్న ఓ అమ్మాయి తన మిత్రురాలితో "అతణ్ణి ఇలా బయటికి ఎందుకు వదులుతున్నట్టు" అంది. ఆ మిత్రురాలు తన బిడ్డ తలకి నూనె అంటుతోంది.

"బహుశా వాళ్ళ మామయ్య పడుకొని వుండొచ్చు."

వేలాయుధన్ ఇవేవీ గమనించలేదు. వెనక్కి తిరిగి చూడకుండా కొండ ఎక్కాడు. పిచ్చి మొక్కలన్నీ కొండవాలులో ఎండిపోయి వున్నాయి. కొండ కడుపున ఓ పరుపు బండ వుంది. అక్కడ చెల్లాచెదురుగా పడిపోయి వున్న తాటికాయల్ని ఏరుకోవడానికి బండ మీదికి ఎక్కాడు.

బండల మధ్యన వున్న ఇరుకైన సందుల్లోంచి కిందకి చూస్తుంటే ఎంత అద్భుతమైన ప్రకృతి! బండకు దిగువన విష సర్పాలతో వున్న తోటా, దానికి అవతల పోక చెట్లతోపూ, వాటి మధ్య ఎర్రని పెంకులున్న ఇంటి కప్పూ అన్నీ ఎంతో మనోహరంగా వున్నాయి.

దూరంగా తూర్పున వరి పొలాలు. ఆ పొలాలకు అవతల వైపు ఎర్రని మట్టి రోడ్డు, దానికి ఆవల నది, ఇసుక తిన్నెల మధ్యలోంచి ఆ నది ప్రవహిస్తోంది. ఇసుక తిన్నెల్ని చూడగానే వేలాయుధన్ మనస్సులో మసకమసగ్గా కొన్ని జ్ఞాపకాలు. దోస తీగలు విశాలంగా పరచుకుని వున్న ఇసుక తిన్నెలు... పశువుల మందల్ని కడగడానికి తీసుకువెళ్ళే పాలుగారే పశువుల కాపరులైన పిల్లలు... తాడుతో కొబ్బరి తేగల్ని కట్టి నీళ్ళలోంచి లాక్కుపోతున్న చేపలు పట్టే జనాలు...

అమ్మ ఎప్పుడూ "నీళ్ళలో దిగొద్దు బిడ్డా! నీటి పిశాచి వుంటుంది" అనేది! నీటి పిశాచికి వెయ్యి చేతులుంటాయని చెప్పింది కూడా అమ్మే కదూ!

ఆ ఇసుక తిన్నెల్లో కాస్త తలపెట్టి వెల్లకిలా ఆడుకోవాలనిపించింది. కాని అచ్చుతన్ నాయర్ సమ్మతించడు. మామయ్య సమ్మతించడు. ఏ ఒక్కరూ అంగీకరించరు.

నాకు అమ్మమ్మ చెబితే మాత్రం వింటాను. ఆమె ఇలా అంటుంది.

"నీ ఇష్టమున్నట్టు ఇసుకలో ఆడుకోవచ్చు వేలాయుధా! ముందు నీ వ్యాధి నయం కానీ....."

వీళ్ళందరినీ చంపి పారెయ్యాలి. ఆ విశాలమైన ఇంటిని తగలబెట్టాలి. అయితే అందరూ చచ్చిపోతారు కదా! అందరూ వద్దు. అమ్ముకుట్టి మాత్రం బతకాలి. అంతా

తగలడ్డాక తామిద్దరే మిగులుతారు. కాని... ఇద్దరే ఎలా నివసించడం? కాలిపోయిన ఇంటిలో ప్రేతాలే వుంటాయి. గడపలో, గాదెల అరలో, అంతటా... ప్రేతాలే! అమ్మమ్మకు ప్రేతాల గురించి కొంత తెలుసు.

పూర్వం మేనమామలే ప్రేతాలట! గడప దగ్గరి గదిలో చాత్తమ్మాన్ ప్రేతంగా మారిపోయి వున్నాట్ట! అతనికి తన కోడలు కోడిమాంసంలో రాళ్ళు పెట్టి చంపిందట! తర్వాత అతను దాహం! దాహం అని ఎంత అరిచినా ఎవ్వరూ వెళ్ళలేదట!

ఇప్పటికి అతను గుమ్మం దగ్గర అర్ధరాత్రి పూట దాహం! దాహం!! అని పిలవడం వినొస్తుంది. వేలాయుధన్ రాత్రంతా చెవులొగ్గి వింటాడు.

అంతా తగలడ్డాక గాదెల గదిలో లంకెబిందెల నిధి దొరికిపోతుంది. దాన్నిండా బంగారు నాణేలూ, రూపాయలూ వుంటాయి. బంగారం దండిగా వుంటే ఇప్పుడు చాత్తప్పన్ పూరిపాక వేసుకొని నివసిస్తున్న స్థలంలో ఓ పెద్ద ఇల్లు కట్టించుకోవచ్చు. రాజభవనం లాంటి విశాలమైన ఇల్లు నిర్మించుకోవచ్చు! పూల పూల డిజైన్లతో కిటికీలూ, గోడల నిండా చిత్రాలూ, బంగారు పాత్రలూ, ఆకాశాన్ని తాకే మేడా... అన్నీ అమర్చుకోవచ్చు.

ఏదో ఓ రాత్రి ఆ ఇల్లంతా బూడిదై పోతుంది. ఎర్రని అగ్ని జ్వాలలు నాలుకలు చాస్తూ ఇంటిని నాకడం ఖాయం. బంగారు నాణేలూ, రూపాయలతో నిండి వున్న నిధిని తీసుకొని కొండ మీద చాత్తప్పన్ నివసిస్తోన్న పూరిపాక వైపు ఒకే నడకలో వెళ్ళిపోవాలి.

జరీ వున్న పట్టు గుడ్డలతో రాజకుమారుడిలా నడవాలి. అమ్ముక్కుట్టి కళ్ళు మిల మిలా మెరిసిపోవాలి.

ఈ రోజే తగలబెడితే?

ముందు గాదెల గదికే నిప్పు పెట్టాలి. మొదట మామయ్యే మంటల్లో మలమల మాడి చావాలి. అచ్చుతన్ నాయర్‌ని తీసుకొచ్చి కాపలా పెట్టింది మామయ్యే! బయటికి వెళితే కాళ్ళు విరగ్గొట్టమని చెప్పిందీ మామయ్య!! శంకరన్ కుట్టి వీపు మీద తను ఓసారి చెయ్యి వేసినందుకే కొబ్బరి మట్టతో కొట్టాడు. అది నాయర్ చెయ్యి కన్న లావైన కొబ్బరి మట్ట.

రాత్రంతా మామయ్య నిధి కోసం అన్వేషిస్తూ వుంటాడు. కాని అది ఇంతవరకూ ఎవరికీ దొరకలేదు. తాళ్ళమ్మాన్ నిధిని ఎక్కడ పాతిపెట్టాడో ఎవరికీ తెలీదు. ఆఖరుకు

ఆ తాశ్శమ్మాన్‌కు కూడాను. అమ్మమ్మ అది చాలారోజుల క్రితం జరిగిన విషయం అని చెప్పింది. ఆమె క్కూడా సరిగ్గా జ్ఞాపకం లేదు. అవి అమ్మమ్మ వాళ్ళ అమ్మమ్మ పట్టుచీర ధరించి నడిచే రోజులట! తాశ్శమ్మాన్ వద్ద వ్యాపారం చేసి కాసులు సంపాదించాడనీ, అప్పుడంతా బంగారం కాసులనీ, బంగారు నాణేల్నీ, రూపాయల్ని బిందెల్లో పెట్టి పాతిపెట్టాడనీ, ఆ తర్వాత తాశ్శమ్మాన్‌కు పిచ్చి పట్టిందనీ... అమ్మమ్మ పూసగుచ్చినట్టు చెప్పింది. తాశ్శమ్మాన్‌కు నిధి ఎక్కడ దాచిందీ గుర్తులేదట! పార భుజాన వేసుకొని నేలంతా తవ్వి చివరికి చనిపోయాట్ట!!"

ఇప్పటికీ పారతో తవ్వుతోన్న శబ్దం విన్పిస్తుంది. వేలాయుధన్ రాత్రంగా చెవులొగ్గి వింటాడు. అందుకే సాయంత్రం తర్వాత గాదెల గది అంటేనే చచ్చేంత భయం. తాశ్శమ్మాన్ పార పట్టుకుని బయలుదేరొచ్చు అని భయం.

పాపం తాశ్శమ్మాన్‌కు పిచ్చి. పిచ్చి పడితే అంతా మరచిపోతారుట! మరి తను ఏదీ మరిచిపోలేదు. అన్నీ చక్కగా గుర్తున్నాయి. అమ్మ జ్ఞప్తికొస్తోంది. తాటి వనానికి అవతల ఆమెను పూడ్చటం కూడా గుర్తుంది. వాకిట్లో ఓసారి ముసల్మాన్ వ్యాపారులు పిచ్చి కుక్కని రాళ్ళతో కొట్టి చంపింది కూడా గుర్తుంది. బయటికి వచ్చి చూస్తే వాకిలంతా నెత్తురే! ఆ కుక్క మీద తనకు జాలి వేసింది. అది పిచ్చిదట! పిచ్చిదైనంత మాత్రాన కొట్టి చంపుతారా? ఇంకో విషయం కూడా గుర్తుంది. ఓమారు కందిరీగల తుట్టె కదిలి ఈగలన్నీ పొలమంతా వ్యాపించాయి. వెంటనే బెదిరిపోయి తను ఏపుగా పెరిగిన చేల మధ్య దాక్కున్నాడు. ఆ రోజు తన వెంట అమ్ముక్కుట్టి వుంది. అప్పుడు ఆమె చిన్నపిల్ల. ఇప్పుడున్నంత అందంగా లేదు. ఇలా ఎన్ని సంఘటనలు! అతనికి అవన్నీ గుర్తున్నాయి. జ్ఞప్తి పెట్టుకునే పాటి తెలివితేటలూ వున్నాయి. అందుకని అతనికి పిచ్చి లేదు.

అయినా శంకరన్ కుట్టి, గోపి, పక్కింటిమాళు... అంతా అతనికి పిచ్చి అంటున్నారు. వాళ్ళకే పిచ్చి. వాళ్ళ అబ్బలకూ, అవ్వలకే పిచ్చి చంపెయ్యాలి. అబద్ధాలాడుతూ మనుషులకు ద్రోహం చేస్తోన్న వీళ్ళందరినీ చంపి పారెయ్యాలి.

మాంఛి వాదర వున్న ఓ గండ్ర గొడ్డలి కావాలి.

పిచ్చి పొదల మాటున ఏదో మేస్తూ తిరుగుతోన్న ఓ నల్లని మేకపిల్ల తన తల బయటికి పెట్టి మెల్లగా ఏడ్చింది.

వేలాయుధన్ వణికిపోతూ బండ మీంచి కిందికి దిగాడు. అది మేకపిల్లేనా? మళ్ళీ చూశాడు. మేకపిల్ల కన్పించలేదు. కరినీలి మేకపిల్ల రూపంలో వచ్చి మాటు వేసిందా? భయంతో చుట్టూ చూశాడు. మెరసిపోతున్న ఎండలో అక్కడక్కడ నల్లని

రూపాలు కలిసి గుంపులుగా చేరుతున్నాయా? సమీపంలో వున్న నల్లని రాళ్ళ గుంపు తల వూపుతూ నిద్రలేస్తున్నట్టు అనిపించింది. ఎండ క్రమంగా తగ్గిపోవడమే కాకుండా కొండవాలులోకి చీకట్లు దిగుతున్నాయి. చీకట్లో నిప్పు కణికలు నమిలే పిశాచాలున్నాయి. అలిసిపోయి కళ్ళు మూసుకున్నాడు. వగరుస్తూ నించున్నాడు. చీకట్లోంచి ఓమాట విన్పించింది.

"వేలాయుధా!"

ఓ లావైన చెయ్యి అతని భుజాల మీద పడింది.

"నన్ను చంపకు! నన్ను చంపకండి!"

"వేలాయుధా!"

"నన్ను చంపకండి! నన్ను చంపొద్దు! "

కళ్ళు చిన్నగా మూసుకుంటూ అతను చీకట్లో ఈదుతున్నట్టు నడిచాడు. అతనికి ఏడుపొచ్చింది.

"నన్ను చంపొద్దు, నన్ను చంపొద్దు!"

కళ్ళల్లోంచి చీకట్లు తొలగిపోయాయి. బయట అరటి తోటలో, వెన్నెల దోబూచులాడుతోంది. తర్వాత మెల్లగా మళ్ళీ ఇల్లు చేరుకున్నాడు.

గదిలో చీకటిగా వుంది. చాప మీద వెల్లకిలా పడిపోయాడు. నొసలు కాలిపోతోంది. గోడకి ఒరిగి కూచున్నాడు. ఎలాంటి శబ్దమూ, అలికిడీ లేదు. బయటి నీడల్లో ఏవో కదలికలు. అక్కడక్కడ నల్లని రూపాలు పొంచి వున్నాయి. అయితే గది లోపల వుండటం చేత భయపడాల్సింది లేదు. చిన్న చిన్న తలుపు సందుల్లోంచి పిశాచులు లోనికెలా వస్తాయి?

బొప్పాయి చెట్ల ఆకుల మధ్య నుండి ఆకాశం కొంచెంగా కనిపిస్తోంది. చుక్కలు కొబ్బరి ముక్కల్లా మనోహరంగా వున్నాయి. కానీ.... ఆ చుక్కలన్నీ ఉన్న పళంగా చీకటిగా మారి నల్లని చుక్కల్లా మారిపోతాయా?

మోకాళ్ళ మధ్య శిరస్సు వంచి కూచున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. నల్లని చిన్న చిన్న వడికట్టు రాళ్ళు కళ్ళ లోపల్నించి పగిలి బద్దలై విడివడుతూన్నంత నొప్పి.

వెలుతురు గదిలోకి వచ్చేవరకూ ఎదురుచూశాడు. పగలు అరటి తోపుల్లోంచి నల్లని ఆకారాలు పరుగులు తీస్తాయి.

అచ్చుతన్ నాయర్ నిద్రలోంచి లేచాడా అని చూసేసరికి వేలాయుధన్‌కు పట్టరాని కోపమొచ్చింది. తలుపులు బయటినుంచి వేసి వున్నాయి. ఎప్పుడూ అలా వెయ్యరు.

"తలుపులు తెరవండి!" అతను లోపల్నించి అరిచాడు.

జవాబు లేదు.

"వాకిలి తెరవండి!" మరింత గట్టిగా పిలిచాడు.

లేదు. ఎలాంటి అలికిడీ లేదు.

వెంటనే కోపంతో తలుపుల్ని తన్నాడు. మళ్ళీ మళ్ళీ తన్నాడు. తలుపులు విరిగిపోనీ! విరిగిబద్దలై పోనీ!!

తలుపులు తెరిచారు.

అచ్చుతన్ నాయర్ వెనకాల మామయ్య వున్నాడు. ఇద్దరినీ కలిసికట్టుగా చూసేసరికి భయం వేసింది. ఒకడు పట్టుకుంటాడు. మరొకడు తంతాడు. అసలు తన గురించి వీళ్ళకున్న అభిప్రాయం ఏంటి? ఇప్పుడో గండ్ర గొడ్డలి ఉన్నట్లయితే... ఒకే ఒక్క విసురు. తలలు రెండూ నేల మీద పడిపోతాయి. వాటిని దాచి పెట్టాలి. అవసరమైన వాళ్ళు వచ్చినా ఇవ్వొద్దు.

వాళ్ళ ముఖాల వేపు చూడక అతను నేల చూపులు చూడసాగాడు.

"ఏరా? అనవసరంగా నా చెయ్యి తగలనివ్వకు" మామయ్య అన్నాడు. అచ్చుతన్ నాయర్ తన మీద వున్న వెంట్రుకల వనంలో పరపర గోక్కుంటూ "తలబిరుసు చూపిస్తే బొక్క బొక్కకీ నీళ్ళు పోస్తాను. మరోమారు బయటికైతే వెళ్ళు" అన్నాడు.

"అల్లరి చెయ్యకు. ఏడ్చావంటే పోలీసులకు అప్పగిస్తాను."

అప్పుడు వేలాయుధన్ మనసులో ఇలా అనుకున్నాడు.

"అయితే పోలీసుల తలలూ నరికెయ్యాలి"

గండ్రగొడ్డలి దొరికితే తల నేను నరుకుతాను... అని చిన్నగా గొణిగాడు. మామయ్య కాస్త దూరం జరిగి నిల్చున్నాడు. తర్వాత అచ్చుతన్ నాయర్‌ను "వీడి పరిస్థితి విషమించిందా?" అనడిగాడు.

"ఇదంతా ఉత్త నటన!" వేలాయుధన్ వేపు చూస్తూ అచ్చుతన్ నాయర్ మళ్ళీ "అల్లరి చిల్లరి పనులు చేస్తే గూబ గుయ్యిమంటుంది జాగ్రత్త!" అన్నాడు.

"తంతేనే బాగుపడతాడు" మామయ్య అభిప్రాయపడ్డాడు.

అచ్చుతన్ నాయర్ తలుపులువేసి వెళ్ళిపోయాడు.

ఆ తలుపులు అలాగే మూసివున్నాయి. పొద్దుటా, సాయంకాలం అచ్చుతన్ నాయర్ వచ్చి అతణ్ణి బయటకు తీసుకువెళతాడు. అలా కొంతసేపు మాత్రమే! అందులోనూ అచ్చుతన్ నాయర్ తన వెంటే వుండటం వేలాయుధన్‌కు అసలే నచ్చదు. ఒక్క నాయర్ మాత్రమే ఆ గదిలోకి అడుగుపెడతాడు. అప్పుడప్పుడూ తలుపులకు అవతల నించున్న అమ్మమ్మ మాటలు విన్పిస్తాయి.

"ఏ జన్మలో చేసుకున్న పాపమో! సుకృతక్షయం... సుకృతక్షయం..." పగలంతా గోడకు ఆనుకొని కూచోవడం వేలాయుధన్‌కు ఇష్టం. అక్కడ కూచుంటే అరటితోటా, వాకిట్లో వున్న బొప్పాయి చెట్టూ, మేకల గూడూ కన్పిస్తాయి.

బొప్పాయి చెట్టు కింద గోపి, శంకరన్ కుట్టి, మిగిలిన పిల్లలూ ఆడుకుంటూ వున్నారు.

వాళ్ళు అప్పుడప్పుడు తన గది వద్దకు రావడం కద్దు. వచ్చి వెక్కిరించి వెళ్ళిపోతుంటారు.

ఓసారి శంకరన్ కుట్టి ఓ రాయి తీసుకుని విసిరాడు. అది వీపు మీద పడింది.

మర్నాడు వేలాయుధన్ ప్రతీకారం తీర్చుకున్నాడు.

అది మట్టి గ్లాసు. అది రాయికి తాకి పడిపోయే చప్పుడు వినిపించి ఎంతో సంతోషం కల్గింది. బయటి నుంచి అరుపులు విన్పించాయి. కాసేపయ్యాక అచ్చుతన్ నాయర్ తలుపులు తోసుకుంటూ వచ్చాడు.

"పిల్లల్ని కొడుతున్నావు కదూ!" నీ ఎముకల్ని పచ్చడి చేస్తాను. ఆగు" అన్నాడు.

"ఓ గండ్ర గొడ్డలి దొరికి వుంటే... " వేలాయుధన్ అనుకున్నాడు.

"పొగరుమోత్తనం మానుకుంటావా, లేదా? పోలీసులకు చెప్పవా?"

"నీ తల నరికి పారేస్తాను" మనసులోనే అనుకున్నాడు.

"ఏంట్రా అంటున్నావు.

అప్పటికి అతను సన్నగా గొణుగుతూనే "తల నేను నరికి పారేస్తాను" అన్నాడు.

"నీ పిచ్చి నాశనం గానూ!" అచ్చుతన్ నాయర్ వెంట్రుకలున్న తల బలిష్టమైన చెయ్యి లేపుతూ అన్నాడు.

"నన్ను కొట్టొద్దు -- నన్ను కొట్టొద్దు"

గది మూలకు నక్కుతూ బుగ్గల మీంచి కారుతున్న కన్నీటిని నాకుతున్నాడు. శోకాలు పోయాడు. "నన్ను కొట్టకండి! నన్ను కొట్టకండి!! అన్నాడు.

"చప్పుడు చెయ్యకుండా ఊరుకోమని చెప్పలేదూ?"

"నన్ను కొట్టకండి... నన్ను కొట్టకండి..."

బయటి నుంచి అమ్మమ్మ తనలో తనే "ఏ జన్మలో చేసిన పాపమో! సుకృతక్షయం... సుకృతక్షయం!!..." అంది.

అచ్చుతన్ నాయర్ వెళ్ళాక వెక్కి వెక్కి ఏడుస్తూ మళ్ళీ తలుపుల దగ్గరికి వచ్చి నించున్నాడు.

బయటి ఎండలు చూస్తున్న కొద్దీ అరటి తోపుల్లో నీడలు ముసురుకుంటున్నట్టు తోచింది. నిజానికి అది మధ్యాహ్న సమయం.

పగటి ఎండా, నీడా ఒకదాని తర్వాత మరొకటి మారుతున్నాయి.

నీడలు వ్యాపిస్తున్న కొద్దీ భయంగా వుంది. చీకట్లోంచి బూచి లోపలికి వస్తే ఎలా? నిప్పు కణికలు నములుతోన్న పిశాచులు. వామ్మో! వెంట్రుకలు విప్పదీసి దూకుతోన్న కరినీలి... ఇవన్నీ ప్రవేశిస్తే?

రాత్రి అన్నా, చీకటన్నా అతనికి భయం. రాత్రంతా గోడకి చేరగిలబడి బయటకు చూడ్డం రివాజు. తాళ్ళమ్మాన్ పారతో నేలంతా తవ్వుతోన్న శబ్దం విన్పిస్తోందా? మెట్ల మీంచి దప్పితో మరణించిన ఎవరైనా తనను పిలుస్తున్నారా?

మట్టి అంటి వున్న ఛాతీ మీద కన్నీళ్ళు జారిపడుతున్నాయి. ఎంత వేదన! బయటకు చూడలేకపోయాడు. పగటి ఎండ తగ్గిపోయింది. క్రమంగా చీకటి కమ్ముకుంటోంది.

నిప్పు కణికలు నములుతోన్న పిశాచుల్ని పోషిస్తోన్న చీకటి అది. అతను గోడకేసి ముఖం పెట్టి కూచున్నాడు. అతను భయంతో ఇటు తిరిగి చూడలేకపోతున్నాడు. తలుపు సంచులకు ఆవల ఏదో కరలాడుతోంది. మెల్లగా గమనించసాగాడు. అదిరిపోయాడు. తల వెంట్రుకలు విరబోసుకుని వుంది. నోట్లో నిప్పుందా? ఏదో చప్పుడు విన్పిస్తోంది. కాలి అందెల సవ్వడా?

"బావా" అది సన్నని గొంతు.

భయంతో నేలకేసి ముఖం పెట్టుకొని బోర్లా పడుకున్నాడు.

"బావా! నేను"

దయా, బాధా కలగలిసిన స్వరంతో అతను నిట్టూర్చాడు.

"నన్ను కొట్టకండి... నన్ను కొట్టకండి"

ఆ తలుపు సందుల్ని కొబ్బరి ఆకులతో మూశాడు.

ఇప్పుడు.... కొబ్బరి ఆకుల సందులోంచి పొడవుగా పడుతోన్న సన్నటి కాంతి గీతలా మాత్రమే కన్పిస్తోంది.

రోజులు గడుస్తున్న కొద్దీ గదిలోని చీకటి అతణ్ణి భయానికి దూరం చేసింది. చుట్టూ మూలల్లో నక్కి వున్న తెల్లని ఆకారాలు అతణ్ణి చూడ్డం లేదు. అవి అతనితో స్నేహం చేస్తున్నాయి. అతని చెవిలో సవాలక్ష విషయాలు చెబుతున్నాయి. అతనికీ వాటితో చెప్పేందుకు అనేక విషయాలు వున్నాయి. అతను తాశ్శమ్మాన్ పూడ్చి పెట్టిన నిధి తీసుకురావడానికి వెళ్తాడట! కొండ మీద మేడ కట్టే విషయమూ, దాని ఏడో అంతస్తులో వుండి ఇసుక తిన్నెలూ, తెరచాపల పడవలూ గమనించే అంశమూ... ఇలా ఒక్కటేమిటి అతనికి ఆ పిశాచులతో చెప్పేందుకు బోల్డు విషయాలున్నాయి.

కొబ్బరి ఆకుల మధ్యలోంచి కొన్ని కొన్నిసార్లు ఎవరివో కళ్ళు కన్పిస్తాయి. బయటి నించి ఎవరో చూస్తున్నారు.

ఎన్నో శబ్దాలు వినవస్తాయి.

"దొరగారి అబ్బాయి...."

"ఆ అమ్మగారు ఇదంతా చూడకుండా కళ్ళు మూయడమే మంచిదైంది"

"హూ... ఎంత కష్టమో!"

ఇలా రకరకాలుగా మాటలు విన్పిస్తాయి. అతనికి అవన్నీ వినాలనిపించదు.

గోడకి రూపాయి బిళ్ళల్లా గుండ్రంగా పడుతోన్న కాంతి వలయాలు చూస్తూ కూచుంటాడు. మూలల్లో నక్కి వున్న నల్లని ఆకారాలున్న మిత్రులతో ఎన్నో ముచ్చట్లు చెబుతాడు.

ఓమారు అచ్చుతన్ నాయర్ ఇనుప పాత్రలో అన్నం తీసుకుని గది తలుపులు లోనికి రాగానే వేలాయుధన్ వాంతులు చేసుకున్నాడు.

అచ్చుతన్ నాయర్ పాత్ర బయటిపెట్టి తిరిగొచ్చేటప్పుడు అతని చేతిలో చింతబరిగె ఉంది.

"మళ్ళీ చేస్తావా?" అని అడుగుతూ దగ్గరికి వచ్చినప్పుడే ఆ బరిగె కన్పించింది.

"నన్ను పిలవాలని ఎన్నిసార్లు చెప్పాను?"

భుజమ్మీద మొదటి దెబ్బ పడింది. ఎప్పటిలాగే వేలాయుధన్ ఏడవలేదు. కోపంతో కళ్ళు ఎర్రబారుతున్నాయి.

"ఏంట్రా? అలా చూస్తున్నావు?"

మళ్ళీ దెబ్బపడింది.

"మళ్ళీ చేస్తావా? నీ పిచ్చి నేను కుదుర్చుతాను" చింతబరిగె రంయ్యిమని గాల్లోకి లేచింది.

"ఇంక చేస్తావా?"

ఈ అల్లరి విని అమ్మమ్మ వచ్చేసింది. వెనకాలే పెద్దమ్మ కూడాను. ఆమె రుద్ధమైన కంఠంతో "అచ్చుతా! వద్దు. దైవదోషం వుంది" అంది.

"ఇదంతా ఉత్త దుర్బుద్ధి లెండి అమ్మా!" అంది. పెద్దమ్మ ఎప్పటిలానే! అప్పటికి మామయ్య కూడా వచ్చాడు. గుమ్మం దగ్గరికి వచ్చి నిల్చుని ముక్కు మూసుకున్నాడు. అచ్చుతన్ నాయర్ విషయం మరింత విశదం చేశాడు. పొద్దున, సాయంకాలం వేలాయుధన్‌ను రెండుసార్లూ మలమూత్రాదుల కోసం బయటికి తీసుకొని వెళ్తారు. అయినా గది అపరిశుభ్రంగా మారిపోయింది.

"గదిలో బంధించడం కూడా కష్టమైపోయింది. అవునా?"

"ఇదంతా ఎందుకు చెబుతున్నారు?

"ఇలా అయితే ఇంట్లో ఎలా వుండగలం? ముద్ద నోటికి పోతుందా?

"ఉత్తరం దిక్కు. గదిలో వేస్తే ఎలా వుంటుంది? మామయ్య ఆలోచించాడు.

"దానికి తలుపులు లేవు కదా! దాన్నీ కక్కూసుగా మారిస్తే ఎలా? పైగా అది వంటింటికి దగ్గర్లో వుందాయె!"

అచ్చుతన్ నాయరూ ఆలోచించాడు. మామయ్య చెవిలో ఏదో ఊదాడు. ఊసుకళ్ళని వేగంగా తెరుస్తూ, మూస్తూ గుమ్మంలో నించున్న అమ్మమ్మ ఆ మాటలు వింది. ఆమె తన కళ్ళు తుడుచుకుంటూ "ఏ జన్మలో చేసిన పాపమో! సుకృత క్షయం... సుకృత క్షయం. ఇదంతా ఈ కళ్ళతో చూడాల్సి వస్తోంది" అంది.

అమ్మమ్మ మాటల్ని ఎవ్వరూ ఖాతరు చెయ్యలేదు. ఆమె ఆ తర్వాత అలా వంగిన నడుముతో మెల్లిగా వెళ్ళిపోయింది.

వేలాయుధన్ ఆ రోజు ఎంగిలి పళ్ళేదు. మామయ్యా, అచ్చుతన్ నాయర్ బయట తన గురించి మాట్లాడుకున్నది విన్నాడు. వాళ్ళు విషం పెట్టి చంపాలని నిశ్చయించుకున్నారు. అమ్మో! చాత్తుమ్మాన్ కోడి మాంసంలో రాళ్ళు కలిపి పెట్టిన వంశం కదా!

శరీరమంతా కాలిపోతోంది.

ఇనుప పాత్రలోని అన్నమూ, కూరా నేలమీద పారబోశాడు. అయ్యో! అపరిశుభ్రంగా వుంది. ఎప్పుడిది జరిగింది? అతను మళ్ళీ వాంతులు చేసుకున్నాడు.

తలుపుల్ని మరుగుచేస్తోన్న కొబ్బరి ఆకుల వద్ద ఏదో చప్పుడైంది. ఓ గండ్ర గొడ్డలి వున్నట్లయితే.... అచ్చుతన్ నాయర్ గదికి బయట ఎదురు చూస్తున్నాడు. చంపడానికి ఎదురు చూస్తున్నాడు.

అబ్బో! కొబ్బరి ఆకుల సందుల్లో రెండు కళ్ళు.

గోడకు ఒరిగి భయంతో "ఇంక చెయ్యను... ఇంక ఇలా చెయ్యను. నన్ను చంపొద్దు" అన్నాడు.

"బావా!"

బయటి నుంచి సన్నని స్వరంతో ఓ పిలుపు.

"ఎవరది?"

"నేను కదా బావా! అమ్ముక్కుట్టిని"

"అమ్ముక్కుట్టి ఆట! ఖి....ఖి...ఖి...." అంటూ నవ్వాడు. వెక్కిరించాడు.

"బావా!"

వెంటనే వెక్కి వెక్కి ఏడ్వడం విన్పించింది. అతను ఆ ఏడుపునీ అందంగా అనుకరించాడు.

పైగా గది గోడలు అదిరిపోయేలా పగలబడి నవ్వాడు.

బయటి నుంచి ఆ పిలుపు మళ్ళీ బలహీనంగా విన్పించింది.

ఛెంగున లేచి నిల్చుని "వాని తల తప్పక నరుకుతాను" అని గర్జించాడు.

తర్వాత అంతా నిశ్శబ్దం! ఊరటగా వుంది. ఈ జనాలంతా అనవసరంగా తనకు ద్రోహం చేస్తున్నారు. అలా కాసేపు నిలుచున్నాక కొబ్బరి ఆకుల సందులోంచి ఓ పిల్లగాలి లోనికొచ్చింది. కాలిపోతున్న ఒంటికి ఆ గాలి తగిలి ఆహ్లాదం కల్గింది. శరీరం అలసిపోతున్నట్టు తోచింది. ఇంతకీ ఇందాక సన్నగా పిలిచిందెవరు? తను ఏం విన్నాడు? ఏదీ స్పష్టంగా లేదు. గుర్తు చేసుకోలేకపోతున్నాడు. చేజారిపోయిన ఏదో వస్తువుని వెతుకుతున్నట్టుంది.... అతని పరిస్థితి.

ఆ శబ్దం మళ్ళీ చెవుల్లో గింగురుమన్నట్టు విన్పించింది.

"బావా?"

నిజమేనా? అతను వణికిపోయాడు. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

వెంటనే ఓ బొగ్గు ముక్క తీసుకొని నిచ్చెన మెట్లు ఎక్కుతూ పైకి వెళ్తోన్న అమ్ముకుట్టి బొమ్మను గీశాడు.

చీకట్లు క్రమంగా కళ్ళలోంచి దూరమవుతున్నాయి.

ఇప్పుడు అతను ఎక్కడున్నాడు?

చుట్టుపక్కలా కళ్ళు తిప్పాడు. ఇంటికి ఉత్తరాన వున్న పాకలో పడుకొని వున్నాడు. లేచి నిలుచున్నాడు. తలంతా దిమ్మెక్కి వుంది. కాళ్ళు నొప్పి పెడుతున్నాయి. కాస్త వాటిని కదపగానే ఏదో ఖణేల్మంటూ చప్పుడైంది. తీరా చూస్తే కాళ్ళకి సంకెళ్ళు వంగి పరికించాడు. కఱ్ఱ గోడకున్న రంధ్రంలో గొలుసు మరో కొసను వుంచారు. చీలమండల మీద తోలులేచిపోయి ఎర్రబారింది. కాళ్ళకు ఎవరు సంకెళ్ళు వేశారు?

పాకలోకి ఎప్పుడొచ్చింది గుర్తు చేసుకున్నాడు వేలాయుధన్. ఎవరిలా చేసింది? ఊరకే తమాషా చేస్తున్నారా, మోసం చేస్తున్నారా?

నేలమీదంతా మట్టి, బురదా. చుట్టూ ఎంత అసహ్యం! అపరిశుభ్రత! వేలాయుధన్ ఆలోచించసాగాడు. ఏదీ స్పష్టంగా గుర్తుకు రావడం లేదు. గత సంఘటనలు

పొగమంచులా అస్పష్టంగా వున్నాయి. ఆ ఆశ్చర్యంలోంచి తేరుకోక ముందే “మనుషుల్ని కుక్కల్లా సంకెళ్ళతో బంధిస్తారా?” అన్న ప్రశ్న మళ్ళీ మళ్ళీ ఉదయించింది.

బయట ఎండ తగ్గినట్టుంది. అది సాయంత్రం వాకిట్లోని అరటి చెట్టు మీద ఉడుత పూల తేనె తాగుతోంది. అది అరటిపువ్వు మీద ఒరని తొలగిస్తోంది. ఓ ఆకు మీంచి మరో ఆకు మీదకి దూకుతోంది.

వంటింట్లోంచి మాటలు విన్పిస్తున్నాయి. ఎవరైనా వచ్చి సంకెళ్ళు విప్పదీస్తే! ఆరోగ్యం బాగోలేదనే వాళ్ళు అతణ్ణి పాకలో వేసింది. ఎవరైనా వంటింట్లోంచి బయటికి వస్తే “నాకేమీ కాలేదు.... ఏం లేదు... ఈ సంకెళ్ళు విప్పండి” అనవచ్చు.

“మనుషుల్ని సంకెళ్ళతో బంధిస్తారా?...” – “ఎంత ఘోరం?” వంటింట్లో బావి మీది మూత తీసి ఎవరో నీళ్ళు చేదుతున్నారు. బొక్కెన శబ్దం దీనంగా వినిపిస్తోంది. పెద్దమ్మ కావచ్చు.

వేలాయుధన్ “పెద్దమ్మా! పెద్దమ్మా!!” అని పిలిచి చూశాడు.

జవాబు లేదు.

ఎవరిని పిలవాలి? వీళ్ళంతా ఎలాంటి బంధువులు? నాకిప్పుడు ఎలాంటి జబ్బూ లేదు... ఏమీ లేదు... అనుకున్నాడు.

మట్టి అంటుకొని వున్న తన శరీరం చూసుకొన్నాక అతనికి అసహ్యం కలిగింది. మరోమారు నిలువెల్లా చూసుకునేసరికి సిగ్గువేసింది. మొలకు గుడ్డ లేదు. ఒంటి మీద నూలు పోగే లేదు. ఎవరైనా వచ్చి చూస్తే ఏమనుకుంటారు? ఎవ్వరూ రావద్దు... గుడ్డల్లేకుండా వుంటానికి తన చిన్న పిల్లాడు కాదు. పెద్దయ్యాడు. బాగా పెద్దవాడయ్యాడు. బిరుసుగా గడ్డం పెరిగింది. అయినా మొలకు గుడ్డ లేకుండా...

వేలాయుధన్ వంగి చూసుకున్నాడు. తనకు ఓ గుడ్డ కావాలి. ఎవరిని పిలవడం? పెద్దమ్మని పిలవొద్దు. అతను గోపిని గట్టిగా పిలిచాడు. మళ్ళీ మళ్ళీ పిలిచాడు.

తను గుడ్డలు ధరించే వరకూ ఎవరూ రావద్దు అనుకున్నాడు. ఎవరో పాకముందరికొచ్చి “ఏంటి?” అని అడిగారు.

“ఇటు రావొద్దు... ఇటు రాకు.... గోపి ఎక్కడ?”

“నేను గోపిని”

గీతలున్న ఎ(్రని నిక్కరూ, షర్టూ వేసుకుని వున్నాడు. "చూశారా? గోపి సమర్ధుడయ్యాడా" – ఇదీ వేలాయుధన్ ఆలోచన.

"ఉత్తగా ఎందుకు పిలుస్తున్నావ్?"

"నాకు ఓ గుడ్డ పట్టుకురా!"

"చించడానిక్కదూ! ఊహూం...."

"చించను గోపీ! తొందరగా తీసుకురా?! ఎవరన్నా వచ్చి చూస్తే...?"

గోపి సంశయిస్తూ నిలుచున్నాడు.

"మంచి పిల్లాడు కదూ! కాస్త వెళ్ళు"

గోపి వెళ్ళి మంచి తెలుపు వున్న ఓ గుడ్డతో తిరిగొచ్చాడు. వేలాయుధన్‌కు సంతోషమైంది. చక్కగా ఉతికిన శుభ్రమైన గుడ్డ అది.

"చించుతావా?"

"ఎందుకు?"

"చించడానికైతే ఇవ్వను."

"ఇటివ్వు గోపీ! ఎవరైనా చూస్తే...."

గోపి దూరం నుంచే గుడ్డ విసిరేశాడు.

వేలాయుధన్ గుడ్డ చుట్టుకొని ప్రశాంతంగా వున్నాడు. ఇంక ఎవరొచ్చినా ఫర్వాలేదు.

"నా కాళ్ళకు సంకెళ్ళు వేసింది ఎవరు?"

గోపి బదులు చెప్పలేదు.

"ఇవి కాస్త తియ్యమని చెప్పు"

గోపి చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

"తియ్యరా ఇవి... నేను కుక్కనా ఏంటిరా?"

గోపి వెళ్ళిపోయాడు.

ఈ సంకెళ్ళు విప్పడానికి ఎవ్వరూ లేరా?

అతను అమ్మమ్మను పిలిచి చూశాడు. పెద్దమ్మని పిలిచాడు. ఏ ఒక్కరూ రాలేదు. ఎవ్వరూ విన్పించుకోలేదు.

వాకిట్లోంచి మెల్లగా అడుగుల చప్పుడు విన్పిస్తోంది. కాసేపటికి మామయ్య పాక ముందుకొచ్చి నించున్నాడు. వేలాయుధన్ గౌరవభావంతో లేచి నించున్నాడు. మామయ్య ముందు కూచోవడం బావుండదు.

"ఏంట్రా?"

అతనేమీ చెప్పలేదు.

"ఉం? ఇది కాస్త విప్పమని చెప్పండి."

"మళ్ళీ పిచ్చి పనులు చెయ్యడానికా?"

"నాకు సంకెళ్ళు ఎందుకని వేశారు?"

"నీ తల బిరుసుతనం వల్ల, నీకు పిచ్చి కుదరాలని"

మామయ్య మెత్తని అడుగుల సవ్వడి క్రమంగా మాయమైంది.

వేలాయుధన్ మళ్ళీ ఆలోచించసాగాడు.

ఏ తలబిరుసుతనం తను చూపించింది? ఆరోగ్యం బాగులేదు. అంతే! ఇప్పుడైతే అదీ నయమైంది. ఏమీ లేదు... ఏమీ కాలేదు.

"నాకేమీ కాలేదు. నాకు పిచ్చి లేదు" అని అరిచి చెప్పాలన్పించింది. అతనికి అశాంతిగా వుంది. ఎవరూ వీటిని తొలగించేందుకు రారా? ఏడుపు గొంతులోంచి తన్నుకు వస్తోంది. ఎవరూ రారా? రాలేరా ఏం?

అసహాయంగా అతను మళ్ళీ బయటికి చూస్తుండిపోయాడు. చేను గట్టు మీది చింతచెట్టు కొమ్మల్లోంచి ఆకాశం కన్పిస్తోంది. అక్కడ ఎరుపూ, నలుపూ కలిసిపోయిన ఓ మబ్బు తునక వుంది. నొసటి చెమటని తుడుచుకున్నాడు.

కాళ్ళు తడిమి చూసుకున్నాడు. సంకెళ్ళు ఘుల్లుమన్నాయి - కాదు ఘొల్లుమన్నాయి.

దుఃఖాన్ని దిగమింగుకుంటూ అతను మళ్ళీ గత స్మృతుల్ని గుర్తు చేసుకోసాగాడు. ఎన్నెన్ని సంఘటనలు?

అందరూ అతనికి అనారోగ్యం అంటున్నారు.

"నాకిప్పుడు ఏమీ కాలేదు. ఏదీ లేదు. నన్ను వదలండి" అన్నాడు. చెద పట్టిన మొగురానికి చేరగిలబడి కూచున్నాడు. ఇందాకైతే ఒంటి మీద గుడ్డల్లేవు. అప్పుడెవరైనా చూసి వుంటారా? అటువేపు అమ్ముక్కుట్టి వచ్చి ఉంటుందా?

అమ్ముక్కుట్టి –

అమ్ముక్కుట్టిని ఓమారు చూసి వస్తే...

నన్ను చూస్తే ఆమెకు రోత పుడుతుందో ఏమో ? ఒళ్ళంతా మట్టే! ఒక్కసారి ఆమె ముఖం చూడగల్గితే బావుణ్ణు! గడ్డం విపరీతంగా పెరిగిపోయింది. జడలు కట్టిన తలను గోకగానే దుమ్మూ, మట్టి చుట్టూ వ్యాపించాయి.

అమ్ముక్కుట్టి శరీరంమ్మీద మురికి వుండదు. ఆమె దగ్గర నించుంటే కాచిన నూనె వాసనా, మొగలిపూల వాసనా వస్తాయి.

ఆమె ఇప్పుడు కనిపిస్తేనో? –

అమ్ముక్కుట్టి గురించి ఆలోచిస్తున్న కొద్దీ ఎంతో నిగూఢమైన ఓ రహస్యం గుర్తుకొస్తోంది. అది ఎవరికీ తెలీదు. ఎవరితోనూ చెప్పలేదు. అది... పుల్లని మామిడి చెట్టు కింద కాయలు రాలడం కోసం ఎదురు చూస్తున్నపుడు అనుకుంటాను. ఆమె చెక్కిళ్ళని అమాంతం పెదాలతో కరిచాను. ఆమె గిల్లుతూ విదిలించుకుంది.

అప్పుడు మేం పిల్లలం. అది చాన్నాళ్ళ కిందటి ముచ్చట ఇప్పుడెంత పెద్దాళ్ళమైపోయాం!

ఆ తర్వాత ఎన్ని సంఘటనలు జరిగాయి! వాటిల్లో చాలా భాగం బాగా గుర్తులేవు. అవి మూసిన తలుపులు కొబ్బరి ఆకులతో వున్న చిన్న తలుపులు. చీకటి నిండిపోయిన శూన్యమైన ఆ గదిలో ఎన్ని ఘటనలో? ఈ సంకెళ్ళు కాళ్ళకు ఎప్పుడు తగిలించారు?

'బావా! నీ ఆరోగ్యం తప్పక నయమవుతుంది" – ఆ పల్చని స్వరం స్థిరంగా వుంది.

"అతనికి అనారోగ్యమట!" ఆమె కూడా అంది. అంతా అంటున్నారు.

"మాతా! భగవతీ!! వాస్తవమేనా?"

మోకాళ్ళ మధ్యన చెక్కిళ్ళు ఆనించి శోకించాడు. సంకెళ్ళతో ఒరుసుకొనిపోయి చర్మం లేచిపోయిన ఎర్రని భాగల మీద కన్నీళ్ళు రాలుతోంటే మంట పుడుతోంది. అయినా మనశ్శాంతిగా వుంది.

ఇప్పుడు పరిస్థితులన్నీ మారిపోయాయి. ఆరోగ్యం నయమైంది.

"నాకు ఏమీ లేదు. ఏ జబ్బూ కాదు" అన్నాడు.

"నన్ను వదలండి! నన్ను వదలండంటే...."

ఎవ్వరూ రాలేదు. ఎవ్వరూ వినడం లేదా?" మనుషుల్ని సంకెళ్ళతో బంధించరు. అతను ఓ కుక్క కాదు కదా!

"నన్ను వదలండి....నన్ను వదిలెయ్యండి"

బావిగట్టు వేపు ఆశగా చూశాడు.

గోడ అవతలినించి ఎవరో తలెత్తి చూస్తున్నారు. శంకరన్ కుట్టి కదూ! అవును ముమ్మాటికి శంకరన్ కుట్టే!

"శంకరన్ కుట్టే!" కుట్టి గోడచాటు నుండి బయటికొచ్చాడు.

"శంకరన్ కుట్టి! కాస్త దగ్గరికి రా"

"దగ్గరకు రమ్మంటే... ఒక్కటి అడుగుతాను."

"అమ్మో! తన్నడానిక్కదూ!"

"కాదు శంకరన్ కుట్టీ! నేను కొట్టను." అలా అంటున్నప్పుడు వేలాయుధన్ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

అయినా శంకరన్‌కుట్టి సంశయించాడు.

"నేనేం చెయ్యను."

జంకుతూనే శంకరన్ కుట్టి కాస్త ముందుకొచ్చాడు.

"నీ దగ్గరికి రావద్దు అన్నారు."

"ఎవరు?"

"నాన్న"

"శంకరన్ కుట్టీ! నా కాళ్ళకు ఎవరు సంకెళ్ళు వేశారు?"

భయంతో ముడుచుకుపోయిన శంకరన్ కుట్టి వేలాయుధన్‌ను ఎగాదిగా చూశాడు.

"ఎవరు?"

"నాన్న చెప్పడంతో కమ్మరి తీసుకొచ్చాడు"

"కాస్త విప్పరాదూ?"

"నేను విప్పను"

"నాకు ఏమీ కాలేదు శంకరన్ కుట్టీ! కాస్త విప్పరాదూ?"

"ఉం.....ఉం... నీకు పిచ్చి"

వచ్చే దుఃఖాన్ని దిగమింగుకుంటూ వేలాయుధన్ "లేదు.. నాకు పిచ్చి లేదు..." అన్నాడు.

మరి ఎవరు విప్పదీస్తారు? అమ్మమ్మ వస్తే తప్పక విప్పేస్తుంది. ఆమెకైనా నా పరిస్థితి అర్ధమవుతుంది. అధవా అమ్ముక్కుట్టి అయినా చాలు... అనుకున్నాడు.

"శంకరన్ కుట్టీ! కొంచెం అమ్మమ్మను పిలువు"

శంకరన్ కుట్టి గట్టిగా చప్పట్లు చరుస్తూ నవ్వాడు.

"కాస్త పిలువ్?"

"నీకు పిచ్చి పట్టింది. అమ్మమ్మ ఎప్పుడో చచ్చిపోయింది కదా!" ఆ మాటలు విని వేలాయుధన్ హతాశుడయ్యాడు. ఈలోగా చీకట్లోంచి ఏదో అతని మీంచి పారిపోయింది. ఈ విషయం అమ్మమ్మ చనిపోయిందన్న విషయం కన్నా ఎక్కువగా అతణ్ణి బాధపెట్టింది.

ఎన్ని రోజులు? ఎన్ని మాసాలు?

ఆ సంకెళ్ళు మళ్ళీ చప్పుడు చేశాయి.

ఎవరు వీటిని కాస్త విప్పేది? ఎవ్వరూ విన్పించుకోవడం లేదా? అతని గొంతుని తగ్గిస్తూ "శంకరన్ కుట్టి! కాస్త మీ చెల్లితో మాట్లాడాలి. పిలువ్!" అన్నాడు.

అమ్ముక్కుట్టితో చెబితే ఆమె అంతా అర్ధం చేసుకోగలదు. తనకిప్పుడు ఎలాంటి రోగమూ లేదు.... అని చెప్పేయాలి.

"మా చెల్లీ, అమ్మా వాళ్ళింటికి వెళ్ళిపోయారు కదా!"

శంకరన్ కుట్టి మొహంలో అందాకటి పరిహాసం మాయమై వేలాయుధన్ మీద జాలి కలిగింది.

"ఎప్పుడు వెళ్ళారు?"

"కొన్నాళ్ళైంది. నేనూ వెళ్ళి నిన్ననే నాన్నతో వచ్చాను."

"వాళ్ళు ఎప్పుడొస్తారు?"

"ఇంక ఇప్పట్లో రారు."

"ఎందుకు?"

"వచ్చే నెలలో చెల్లి పెళ్ళి కదా!"

వేలాయుధన్ ఆ తర్వాత ఏమీ తెలుసుకోలేదు. తనకు రోగమట! మూసిన తలుపులు. కొబ్బరి ఆకులతో వున్న చిన్న చిన్న తలుపులు. వెంట్రుకలున్న బలిష్టమైన చెయ్యి...

"బావా! నీ జబ్బు నయమవుతుంది." అమ్ముక్కుట్టి మాటలు గుర్తుకొచ్చాయి. ఆమెను వెంటనే చూసి రావాలి.

అన్నట్టు "అమ్ముకుట్టీ! నాకిప్పుడు రోగం లేదు" అని చెప్పాలి. ఆమెకు ఈ విషయం తెలీదు. ఆమె ఇంక ఇప్పట్లో ఇక్కడికి రాదా ఏం?

అన్నమూ, కూరా ఇనుప పాత్రలో పెట్టుకొని పాకలోకి ఒకావిడ వచ్చింది. ఆమె కాస్త పక్కకి తప్పుకుంటూ ఆ పాత్రను అతని ముందుకు జరిపింది. ఆమెకు గొగ్గి పళ్ళున్నాయి. గుండెల మీద ఎలాంటి అచ్ఛాదనా లేదు. ముసలావిడ. అతనికి ఆమె అంటే ఎవరో తెలీదు. అయినా "ఈ సంకెళ్ళు కాస్త విప్పు" అన్నాడు.

ఆమె భయంతో "నీకు మంచి తెలివి తేటలు రానీ...." అంది.

"నాకు జబ్బేమీ లేదు. నన్ను వదులు."

ఆమె ఎత్తుగా వున్న తన పళ్ళ మధ్య నుంచి చప్పుడు వచ్చేలా ఖాండ్రించి ఉమ్మి హుందాగా వెళ్ళిపోయింది.

లోపల్నించి చిన్న అల్లరి విన్పించింది. ఆ శబ్దాల్ని శ్రద్ధగా గమనించాడు. అవి పెద్దమ్మ మాటలు. ఆమె గోపిని నానా చీవాట్లు పెడుతోంది.

‘‘చించి పోగులు పెట్టడానికేనారా ఆ గుడ్డ? అంత మంచి గుడ్డ ఎందుకిచ్చావురా?”

“అదే కన్పించిందమ్మా!”

“వేలాయుధన్‌కు పిచ్చి. నీకూ పిచ్చి పట్టిందా ఏం?”

వెంటనే వేలాయుధన్ పెద్దమ్మా! నాకు పిచ్చి లేదు’’ అని అరిచి గీ పెట్టాలనుకున్నాడు.

ఆకలవుతోంది. పాత్రలోని అన్నం కాస్త తిన్నాడు. అరటి తోటల్లోకి చీకట్లు జొరబడుతున్నాయి. పొడవైన కర్ర పట్టుకుని అరటి చెట్ల మధ్య ఎవరో నడుస్తున్నారు. ఆ కర్ర కొసకి ఓ కత్తి వుంది. చూస్తుండగానే ఆ కత్తితో ఓ గెలను కోశారు. అరటి గెల మీది పువ్వు ఒరలో తేనె వుంటుంది. అమ్ముక్కుట్టికి ఆ తేనె ఇష్టం కాదు. ఆమెకు అరటిపండు సరిపోతుంది. జానుకు సైతం పండే కావాలి. ఆ ఇద్దరూ దాని గురించి తమలో తాము ఘర్షణకు దిగేవాళ్ళు.

“నాణెం ఎగరెయ్యి చూద్దాం” అమ్ముక్కుట్టి అనేది.

“నేను వేస్తాను” – జాను మాటలు.

“వద్దు... మా బావే వెయ్యాలి.”

“బొమ్మా? బొరుసా?”

కిందపడేదాకా అమ్ముక్కుట్టి కళ్ళు మూసుకొని నిలుచుంటుంది. ఆమె తను అనుకున్నది పడాలని భగవతిని ప్రార్థిస్తూ వుంటుంది.

హు.... ఇప్పుడు అమ్ముక్కుట్టి వాళ్ళ అమ్మ ఇంటిలో వుండొచ్చు. ఆమె ఎందుకని వెళ్ళినట్లు? ఆమె చిన్నప్పటి నించీ ఇక్కడే వుండేది కదా!

గురివింద గింజలు చెల్లాచెదురై పంట వున్న కాలిబాట ఇప్పటికీ చక్కగా గుర్తుంది. ఓ మారు అమ్మతో పాటు అత్తమ్మ వాళ్ళింటికి విందు భోజనానికి వెళ్ళడం జరిగింది. కాలిబాటకు ఇరువేపులా గురివింద చెట్లు. ఆ బాటలోని దువ్వలో రక్తం గింజల్లా గురివిందలు. తోట పక్కన ఆ ఇల్లు. ఆలోచిస్తుంటే కొబ్బరి కుడకలతో నిండిన ఓ గదీ, గోడకి తగిలించిన జింక కొమ్ములూ స్మృతి పథంలో మెదులుతున్నాయి. అమ్ముక్కుట్టి ఇప్పుడు ఏం చేస్తూంటుంది? చక్కగా స్నానం చేసి తను విరబోసుకున్న కురుల్లోకి వేళ్ళు జొనుపుతూ నిలుచోవచ్చు.

ఇంక ఆమె ఇక్కడికి రాదా ఏం?

అమ్ముక్కుట్టిని ఓమారు చూసి రావాలి. పెళ్ళవుతే ఆమె ఇక్కడికి రాదు. అందుకని ఓసారి చూసి వస్తే....

వేలాయుధన్ గోడకి వీపు వేసి రుద్దుకున్నాడు. కాళ్ళకు వున్న సంకెళ్ళు చప్పుడు చేశాయి. వాటిని వదిలించుకోగల్గితే పాకలోంచి బయట పడొచ్చు. సంకెళ్ళను లాగి చూశాడు. వేళ్ళు నొప్పి పెడుతున్నాయి గానీ అవి ఊడిరావడం లేదు.

"వీటిని విప్పరూ? ఎవరైనా వచ్చి విప్పండి."

పెద్దమ్మ మేకపిల్లతో పాక ముందరి నించి కదిలిపోయింది. సంశయస్తూనే పిలిచాడు. ఆమె కనీసం వెనుదిరిగి చూళ్ళేదు.

గడప మీద గోపి, శంకరన్ కుట్టి నమశ్శివాయ చదువుతున్నారు. ఎత్తు పళ్ళూ, గుండెల మీద అచ్ఛాదనా లేని ఇందాకటి స్త్రీ పాత్రను తీసుకొని పోవడానికి రాగానే "వీటిని కాస్త విప్పరాదూ?" అని ప్రాధేయపడ్డాడు.

"మళ్ళీ మంది నెత్తిమీదకి ఎక్కడానికా?" అంది ఆవిడ.

అతను కన్నీటితో తడిసిపోయిన తన కళ్ళను తుడుచుకున్నాడు. ఆకాశం కేసి చూశాడు. నల్లగా వుంది. మెరుస్తోన్న తడి తల వెంట్రుకల్లాంటి రంగు కనుచూపు మేరలో అంతగా కాంతిలేని ఓ నక్షత్రం మినుకు మినుకుమంటోంది.

నమశ్శివాయ పూర్తి కాగానే రామాయణ పఠనం ప్రారంభమైంది. అది మామయ్య గొంతు. ఉత్తరపు కిటికీలోంచి పాక ముందరి భాగంలోకి వాకిట్లోకి వెలుతురు ప్రవేశిస్తోంది.

ఇంట్లో దీపాలు తిరుగుతున్నాయి. వంటింట్లో పాత్రలు మాట్లాడుతున్నాయి. ఇంక ఎవ్వరూ ఇటువైపు రారు.

"నన్ను వదలండి... నన్ను వదలండి!" మెల్లగా అన్నాడు. చుట్టుప్రక్కల మనుషులు లేరా? ఏ ఒక్కరూ ఈ సంకెళ్ళు విప్పలేరా?

"అయ్యో! అమ్మా...." అంటూ అతను గట్టిగా అరిచాడు. ఓ దీపం బావి గట్టు వైపు వస్తోంది. వెంటనే "వేలాయుధా" అంటూ ఓ పిలుపు.

"నన్ను వదలండి... నన్ను వదలండీ"

"అల్లరి చెయ్యకు ఎముకలు విరగతంతాను."

ఆ దీపం వెళ్ళిపోయింది. ఇంటి లోపలి చప్పుడూ, అలికిడి క్రమంగా తగ్గిపోయాయి. వాకిట్లో చీకట్లు దట్టంగా ముసురుకుంటున్నాయి.

కాళ్ళకు వున్న సంకెళ్ళు ఓ మారు లాగి చూశాడు.

అవి విరిగిపోతే విజయం. ఆ తర్వాత మళ్ళీ బంధించడానికి ఎవడొచ్చినా వాడికి చావు తప్పదు. కరిచే కుక్కల్ని సంకెళ్ళతో బంధిస్తారు. కాని మనుషుల్ని...

సంకెళ్ళు తెగిపోతే... ఒక్క గొలుసు తెగినా చాలు... ఒకే ఒక్కటి. తనకు పిచ్చి అట! వాళ్ళందరికే పిచ్చి. కాకుంటే ఉత్తగా నాలాంటి వాణ్ణి ఇబ్బంది పెడతారా?

నాకు ఏమీ కాలేదు... నాకు పిచ్చే లేదు.

అతను మళ్ళీ మళ్ళీ సంకెళ్ళు లాగి చూశాడు. చేతులు నొప్పెడుతున్నా ఆపలేదు. సంకెళ్ళు ఊడి రాలేదు. రొప్పుతూంటే శ్వాస కష్టమవుతోంది. కళ్ళు బైర్లు కమ్మాయి. బోర్లా పడిపోయాడు.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి అతను కలగంటున్నాడు. అది మాణిక్యం దొరికిపోయిన రాజకుమారి కథ చిన్నతనంలో అమ్మ ఒళ్ళో కూచోబెట్టుకుని చెప్పింది. అది నేలమాళిగ. అందులో రాక్షసుడు రాజకుమారిని సంకెళ్ళతో బంధించి వుంచాడు. అవి నిప్పుకు కరిగిపోని, నరికితే విరిగిపోని సంకెళ్ళు. కట్టెలు కొట్టే ఓ తల్లి ఇచ్చిన కతారి చూపించగానే అవి పుటుక్కున తెగిపోయాయి. రాజకుమారుడూ, రాజకుమారీ తెల్లని గుర్రమ్మీద ఎక్కి కొండదారంట ఏడంతస్తుల మేడ చేరారు.

సరిగ్గా అప్పుడే మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచాడు. మేడలేదు. మాణిక్యం శూన్యం. తెల్ల గుర్రాలు పూజ్యం. కాని పల్చని వెన్నెల పాకలోకి పాకుతోంది. వాకిట్లో నీడలు బొమ్మలు గీస్తున్నాయి.

ఓ నిమిషం పాటు ఆలోచించాడు. తను ఎక్కడున్నాడు? కొంచెం కదిలాడు. సంకెళ్ళ చప్పుడైంది.

పట్టరాని కోపంతో వాటిని పట్టుకుని గోడకు కాళ్ళు బలంగా తన్ని లాగాడు. ఒక్క గొలుసు తెగినా చాలు, కనీసం ఒక్క గొలుసు.

మరోసారి కూడా అలాగే చేశాడు. "హమ్మే!" బాధగా మూలిగాడు. చేతకావడం లేదు. అతను వెల్లకిల పడిపోయాడు. అయితే సంకెళ్ళు తెగిపోయాయి.

లేచి నించున్నాడు. శరీరమంతా వాచిపోయి తీపులుగా వుంది. కుంటుతూనే వాకిట్లోకి వచ్చాడు. ఒక్కో అడుగు వేస్తున్న కొద్దీ కాళ్ళకు ఇంకా మిగిలి వున్న సంకెళ్ళు చప్పుడు చేస్తున్నాయి.

మెట్లు దిగి ప్రధాన ద్వారం తెరుచుకుంటూ బయటపడ్డాడు. ఎదుట అన్నీ పొలాలు. వాటి వెన్నెముక లాంటి పొడవాటి గట్టు మీంచి నడుస్తూ ఆలోచించసాగాడు. ఈ పయనం ఎక్కడికి? ఏమైనా ముందు ఇక్కణ్ణించి వెళ్ళిపోవాలి. ఒకవేళ వాళ్ళ కంటబడితే మళ్ళీ సంకెళ్ళు వేస్తారు. ఎక్కడికి వెళ్ళిపోయినా ఫరవాలేదు. ముందు ఇక్కణ్ణించి వెళ్ళిపోవాలి. అంతే!

వరి మొక్కలు గాలికి కదులుతోన్న శబ్దానికి అనుగుణంగా సంకెళ్ళు తాళం వేస్తున్నాయి. దక్షిణం వేపున ఓ కుక్క దీనంగా మొరుగుతోంది. బహుశా దాన్నీ సంకెళ్ళతో బంధించి వుండొచ్చు... వేలాయుధన్ విచారించాడు.

వెన్నెల మసగ్గా వుంది. అయినప్పటికీ దారి బాగానే కన్పిస్తోంది. పైన ఆకాశం తెల్లగా వుంది. అది నిశ్శబ్దమైన రాత్రి. చల్లగా వుంది. సంకెళ్ళు ఒంటికి ఒరుసుకు పోతున్నాయి. పొలాలు రోడ్డు దాకా వ్యాపించి వున్నాయి. మొగిలితోపుల్లోంచి రోడ్డు ఎక్కాడు.

తెల్లవారేక మామయ్య వాళ్ళు చూస్తే పాకలో వేలాయుధన్ అనే కుక్క సంకెళ్ళతో వుండదు. అది గుర్తుకొచ్చి అతను గట్టిగా, మరింత గట్టిగా నవ్వాలనుకున్నాడు. కాని వాళ్ళు అతణ్ణి వెతకడానికి బయలుదేరతారు. అంతకన్న ముందే తప్పించుకోవాలి. ఎక్కడికి వెళ్ళడం? ఎవరూ నమ్మడం లేదు. చెప్పేది వినడం లేదు.

అతను తనలో తనే గొణుక్కున్నాడు.

"నాకు పిచ్చి లేదు. నాకు ఏ జబ్బూ లేదు."

"బావా! నీ ఆరోగ్యం బాగవుతుంది" అని చెప్పింది ఆవిడే. అమ్ముక్కుట్టి.

''నా ప్రియమైన అమ్ముక్కుట్టి! నాకిప్పుడు ఏమీ కాలేదు.'' అంటే ఆమె నమ్ముతుంది. ఆమెకు మాత్రము అతని పట్ల విశ్వాసముంది.

రోడ్డు మీద మన్ను మంచుతో నానిపోయి వుంది. ఆ దారి పూర్వం పరిచయమైందే! చాలా ఏళ్ళకు ముందు కొలను పక్క చర్చినీ, ఎప్పుడూ మూసి వుండే ఓ కొట్టునీ దాటి వెళ్ళినట్టు గుర్తు.

స్మశాన వాటికా, పిశాచాల రావిచెట్టూ దాటాడు. ఏమాత్రం భయమనిపించలేదు.

తలమీద ఆకాశం తెల్లబడుతోంది. చీకటి నీడల్లోకి వెలుతురు కొంత కొంతే పాకుతోంది. రోడ్డు పక్కన వున్న ఓ పొడవాటి రాయి పట్టుకొని వేలాయుధన్ నిలుచున్నాడు. తూరుపు ఎర్రబారుతోంది.

తనిప్పుడు ఎక్కడ నించున్నాడు? పొలం మధ్యన వున్న చిన్న లంక కనిపించేసరికి అతను వున్న చోటు గుర్తుకొచ్చింది. ఆ లంకలో మాప్పిళ స్కూలు వుంది. ఆ తర్వాత పొలాల పక్క ఓ పెద్ద కొలనూ, చిన్న గుడి వున్నాయి. అక్కడికి నెల నెలా అమ్మతో పాటు దేవుడికి మొక్కేందుకు వెళ్ళేవాడు. స్కూలు ముందు భాగంలో ఓ మారు తెక్కత్తి నాటకం వేశారు.

పొలాల్ని మొత్తంగా నీలి పొగమంచు కప్పేసింది. అతను పొలాల్లోకి దిగాడు. సంకెళ్ళు శబ్దం చేస్తున్నాయి. ఎదురుగా ఎవరో నాగలి భుజాన వేసుకొని రావడం కన్పించింది.

"ఎవరది?"

వేలాయుధన్ జవాబు చెప్పలేదు. ఓ నిముషం సంశయస్తూ నిలుచున్నాడు. ఓ అడుగు ముందుకు వెయ్యగానే ఆ మనిషి గట్టు మీద నాగలి పెట్టి పొలంలోకి దూకాడు.

అతణ్ణి ఖాతరు చేయకుండా వేలాయుధన్ ముందుకు సాగిపోయాడు. లేయెండ తగులుతోంటే అతనికి హాయిగా వుంది. కనుచూపు మేర వరకూ వ్యాపించిన పొలాల మధ్య కాసేపు నించుని నలువేపులా దృష్టి సారించాడు.

తలల మీద మట్టి కుండలున్న ఆడపిల్లలు అతణ్ణి చూసి పంట చేల లోకి దిగి పరుగులు తీశారు.

"పిచ్చివాడు... పిచ్చివాడు" అన్నారు.

వెనకాల నుండి అరుపులూ, పిలుపులూ వినవస్తున్నాయి. వేలాయుధన్ నడక వేగం పెంచాడు. జనాలు తనను పట్టుకోవడానికి వస్తున్నారా! ఎత్తయిన నారుమడిలోకి వెళ్ళాడు. మొగలి చెట్ల ఆకులు తాకి కాళ్ళు గీరుకుపోయాయి. నారుమడిలోంచి పిల్ల తోవలోకి మళ్ళాడు.

వెనకాల అల్లరి ఎక్కువవుతోంది. అయితే.. ఎదురుగా వచ్చే వాళ్ళు ఎవ్వరూ అతణ్ణి ఆపలేదు. అది అతనికి కొంత ఊరటగానే వుంది. కన్పించిన వాళ్ళంతా భయంతో పరుగులు తీస్తున్నారు. అతనికి భయం కన్న బాధే ఎక్కువైంది.

"నాకు పిచ్చి లేదు... నాకు పిచ్చి లేదు" అన్నాడు.

వెనక నుండి జనాలు 'పిచ్చివాడు' అంటున్నారు. ఆ ఇరుకైన రాయి అంతమయ్యే చోట ఓ రాయి వుంది. దాన్ని పట్టుకొని నించున్నాడు. మళ్ళీ నడిచాడు. ఎవరో 'ఆగరా' అన్నారు. అతను అచ్చం అచ్చుతన్ నాయరే.

అతను వీపు వెనక దాచి వుంచిన వెదురు కర్రను ఊపుతూ కొట్టడం ప్రారంభించేసరికి వేలాయుధన్ మనస్సు కోపంతో కుతకుతలాడింది. మరి కాసేపట్లో ఆ కర్ర అతని మీద వాలబోతోంది.

కిందకి వంగి ఓ గుండ్రాయి తీసుకొని ఎత్తి చూపుతూ నిల్చున్నాడు. ఆ వ్యక్తి కాస్త వెనక్కి తగ్గాడు.

వేలాయుధన్ ముందుకు కదిలాడు.

ఆ ఇరుకైన బాట ఓ కొండవాలుతో అంతమవుతోంది. దారి నిటారుగా వుంది. అయినా వేగంగా ఎక్కాడు. కొండమీద పాలచెట్టు కనిపించింది. దాని దగ్గరే ఎర్రని రాళ్ళతో కట్టిన చిన్న గుడి, ఆ స్థలం వేలాయుధన్‌కు బాగా గుర్తుంది. కాస్త కిందకి దిగితే జీడిమామిడి తోట. అవతల కాలిబాటా... కాలువా.....

ఆ కాలువ పక్కనే వున్న ఇంటి గుమ్మం మెట్ట మీద గురివింద గింజలు చెల్లాచెదురుగా పడివున్నాయి.

"నా ప్రియమైన అమ్ముకుట్టి! నాకు పిచ్చి లేదు" అని చెప్పాలి. కొండమీద నిర్మానుష్యంగా వుంది. ఓ నల్లని గేదెల మంద మాత్రం అటూ ఇటూ తిరుగుతోంది.

కాళ్ళ కింద గడ్డిలో మంచు బిందువులు తప్పా తప్పా చిట్లుతున్నాయి. జనాలు ఎవ్వరూ లేరు. ఇక్కడ ప్రశాంతంగా వుండొచ్చు. పాలచెట్టు కిందికి వచ్చాడు. మోకాళ్ళు నొప్పి పెడుతున్నాయి. నేల మీద కొంతసేపు వెనక్కి వాలి కూచున్నాడు. చల్లని గాలి తగిలి కళ్ళు మూతలు పడుతున్నట్టు తోచింది. వీపు అంతా నొప్పిగా వుంది. చల్లగా తడిసి వున్న పచ్చిక బయలు మీద కాసేపు విశ్రమించాడు.

మగతలోంచి దిగ్గున లేచాడు. వీపు మీద ఏదో వచ్చి పడింది. లేచి చూశాడు. అల్లంతదూరంలో ఐదారుగురు పశువుల్ని కాసే పిల్లలున్నారు. వాళ్ళ చేతుల్లో కర్రలున్నాయి. నెత్తుల మీద గొడుగులున్నాయి. వాళ్ళు శ్రద్ధగా చూస్తున్నారు. ఓ రాయి కూడా వచ్చి పడింది. అది తలకు కొద్దిగా పక్క నుండి వెళ్ళిపోయింది.

వేలాయుధన్ వేగంగా లేచి నించున్నాడు. కాళ్ళకున్న సంకెళ్ళు చప్పుడు చేశాయి. నడవసాగాడు. వాళ్ళు అతణ్ణి వెంబడిస్తున్నారు. రాళ్ళు మళ్ళీ ఎగిరి వస్తున్నాయి. కొండ రాళ్ళ మీంచి సంకెళ్ళ కాళ్ళను ఈడ్చుకుంటూ పరుగు లంకించుకున్నాడు. కొండ దిగారు. ఇరుకైన బాటలోకి వచ్చి వెనక్కి తిరిగి చూశాడు.

"హమ్మే!" బిగ్గరగా రోదించాడు. నొసలు తుడుచుకొని చూశాడు. రక్తం!

"పట్టుకోండిరా! పట్టుకోండి!!"

పొలాల్లోకి దిగాడు. జనాలు అటూ ఇటూ అడ్డదిడ్డంగా పరుగెత్తారు. దారి పక్కన నిల్చున్న ఓ పిల్లాడు "పిచ్చివాడు... పిచ్చివాడు.... తప్పుకోండి!" అంటూ గట్టిగా అరిచాడు.

వెనకాల మళ్ళీ అల్లర్లు. వేలాయుధన్ పొలాల్లోంచి నడిచాడు. చివరికి చేరింది తోటలోకి. అక్కణ్ణించి కాలిబాట పట్టాడు. ఇరువేపులా చెట్లు దట్టంగా వున్నాయి. బాట పొడుగూతా దువ్వలాంటి మట్టిలో గురివిందలున్నాయి.

ఆ దారిలో చిన్నతనంలో ఎంత ఆడుకున్నామో ! అనుకున్నాడు. ఎదుట ఎర్రని రాళ్ళతో కట్టిన గోడా, వెనక్కి వాలి నిల్చున్న ఆంజనేయుని కొయ్య ప్రతిమా కనిపించి అతని గుండె వేగంగా కొట్టుకొంది. అక్కడే.... సరిగ్గా అక్కడే అమ్ముక్కుట్టి. ఆమెను ఓమారు చూస్తే చాలు... అనుకున్నాడు. అమ్ముకుట్టి! నా రోగం నయమైంది. నాకిప్పుడేమీ లేదు. నాకు ఏమీ కాలేదు... అని చెప్పాలి.

అతను మెట్లు ఎక్కాడు. వాకిట్లో కూచుని వున్న ఓ పిల్లాడు ఆకులతో బంతి తయారు చేస్తున్నాడు. పేడతో అలికిన విశాలమైన వాకిట లేయెండ పరుచుకుంటోంది. ఆ పెద్దింటి ముందర నుంచుని వేలాయుధన్ చుట్టూ పరికించాడు. ఆకులతో తయారు చేసుకొన్న బంతితో ఆ పిల్లాడు వేగంగా ఇంట్లోకి దౌడు తీశాడు.

"అమ్ముకుట్టి లేదా? అమ్ముక్కుట్టి..."

అతను మెల్లగా వాకిలి సమీపంలోంచి నాలుగడుగులు నడిచాడు. అప్పుడే అతని కంటపడింది. బావి గట్టున కట్టిన తాడు మీద ఓ స్త్రీ బట్టలు ఆరవేస్తోంది.

సంకెళ్ళు మళ్ళీ శబ్దం చేశాయి. ఆమె వెనుదిరిగి అతణ్ణి చూసింది. వేలాయుధన్ ఓ నిమిషం స్థాణువై పోయాడు. మరోమారు ఆమె ముఖంకేసి పరిశీలనగా చూశాడు. ఆమె ఎవరో కాదు. అతని అమ్ముకుట్టి.

"ఆ...ఆ.... అమ్ముకుట్టి!"

ఆమె తన చేత మిగిలివున్న బట్టల్ని కింద వదులుతూ గట్టు మీద ఎక్కి, "పిచ్చివాడు... పిచ్చివాడు" అంటూ గట్టిగా కేకలేసింది.

"నేను అమ్ముకుట్టీ! నాకు పిచ్చి లేదు" అని చెప్పాలనుకున్నాడు. గొంతు పెగలడం లేదు. నాలుక రావడం లేదు. మరోమారు "అమ్ముక్కుట్టి!" అనగలిగాడు.

ఆమె లోనికి పరుగెత్తి మాయమైంది.

"పిచ్చివాడు... పిచ్చివాడు"

"కర్ర తీసుకోండి! నువ్వు లోనికి వెళ్ళు"

లోపల్నించి ఇలాంటి మాటలన్నీ గడప వైపు వస్తున్నాయి.


ఆ తర్వాత వేలాయుధన్‌కు అక్కడ వుండబుద్ధి కాలేదు. పెదాలు తడి చేసుకున్నాడు. ఉప్పగా వున్నాయి. నొసటి మీంచి నెత్తురు కారుతూనే వుంది. సంకెళ్ళ కాళ్ళని ఈడ్చుకుంటూ దిగాడు.

శరీరం బాగా అలసిపోయి తూలిపడబోతోంది. అయినా సుడిగాలిలా పరుగుతీశాడు. అతని వెనక కొరడాలు పడగవిప్పి బుసలు కొడుతున్నాయి. అరుపులూ, కేకలూ విరామం లేకుండా వెంబడిస్తున్నాయి.

ప్రధాన ద్వారం దాటి మళ్ళీ వాకిట్లోకి ఎప్పటి ఇంటికే వచ్చాడు. అక్కడ మామయ్య సిద్ధంగా వున్నాడు. వేరే ఇద్దరూ వున్నారు.

గోడ పట్టుకుని వేలాయుధన్ కాసేపు నిల్చున్నాడు. మామయ్య దూలం మీంచి బెత్తం తీసుకొని వాకిట్లోకి రావడం అతను గమనించాడు. అలసి సొలసి పోయిన కళ్ళతో తన దేహాన్ని ఆపాదమస్తకం చూసుకునే సరికి ఒంటి మీద ఒక్క నూలుపోగు కూడా లేదని అర్థమైపోయింది.

బాగా అలసిపోయి కిందికి జారుతూ వసారాలోకి వెళ్ళి పడిపోయాడు. మామయ్యా, ఇతరులూ వచ్చి చుట్టూ నిలుచోగానో అతను రొప్పుతూ, రోజుతూ "నాకు పిచ్చి పట్టింది, నన్ను సంకెళ్ళతో కట్టి పడెయ్యండి" అన్నాడు.



## టి. పద్మనాభన్

1931లో కణ్ణూరు దగ్గరి పళ్ళిక్కున్నులో పుట్టారు. ఫాక్ట్‌లో ఉద్యోగం చేశారు. డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా రిటైరయ్యారు. 1973లో సాక్షి (కథా సంపుటి) కి కేరళ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. చాలా కథలు రాశారు.

మనిషి ఏకాంతతలో అనుభవించే సంకటాలకు ఇతని కథా సంపుటాలు ప్రతీకలు. పాత తరం మనిషైనా వైయక్తిక అనుభూతులకు ఇతని కృతులు మంచి ఆవిష్కృతులు భావ కవిత్వంలోని శ్రుతిలయలు వీరి కృతుల హొయలు.

# వెలుతురు చిమ్ముతోన్న అమ్మాయి

**- టి. పద్మనాభన్**

**వ**రుసగా వున్న సాంబ్రాణి చెట్లలో నేను ఓ దానికింద కూచున్నాను. నా ముందర శిథిలావస్థలో వున్న ఓ కోట. అది సముద్రంలోకి చేతులు చాచి నించున్న రాళ్ళ మీద వుంది. ఎవరు నిర్మించారో, ఎప్పుడు నిర్మించారో... ఏదీ కచ్చితంగా నాకు తెలీదు. ఒకవేళ ఈ భూమి పుట్టుకకు ముందు నించే ఈ కోట వుండి వుండొచ్చు. చిన్నతనంలో నాకు అలాగే అనిపించేది! ఇప్పటికీ అలాగే అనిపిస్తోంది.

నాకు ఊహ తెలిసినప్పట్నుంచీ నేను గమ్యం లేకుండా తిరుగుతూనే వున్నాను. దుర్గమాలైన దారులంట ఊళ్ళూ ఊళ్ళూ తిరిగాను. ఎందరినో కలిశాను. అయినప్పటికీ అస్వస్థతగా వున్న నా మనస్సుకి ప్రశాంతత లభించిందా? లేదు.

కాని ఈ పాత నగరంలోకి తిరిగొచ్చినప్పుడల్లా ఏమిటో తెలీని ఊరట లభిస్తోంది. ఈ నగరం శతాబ్దాల క్రితం నేను విడిచిపెట్టిపోయిన మా అమ్మ , ఇక్కడి ఇరుకైన వీధులూ, విశాలమైన మైదానమూ, గుడీ, చర్చీ, అన్నింటికన్న మిన్న శిథిలావస్థలో వున్న ఈ కోటా... అన్నీ నా స్వంతమైనట్లుగానే గోచరిస్తున్నాయి.

ఇక్కడి ఒక్కో ఇసుక రేణువూ నాకోసం సృష్టించబడింది. ఓ ఏడాది క్రితం ఇక్కడే నేను ఓ కొత్త మనిషిగా మారింది కూడాను.

అదృశ్యం కాబోతున్న సూర్యకిరణాలు సాంబ్రాణి చెట్ల కొమ్మల్లోంచి దూసుకొస్తున్నాయి. జనాలు సముద్ర తీరం నుంచి తిరుగుముఖం పడుతున్నాయి. వాళ్ళు కొంతమందే వున్నారు. ఉన్నవాళ్ళలో చాలామంది వయస్సు పైబడ్డవాళ్ళే!

మంచు పడే లోపు ఇంటికి చేరిపోవాలనే ఆరాటంతో నడక సాగిస్తున్నారు. మెడలకు మఫ్లర్లు చుట్టుకొని, పెద్ద పేము బెత్తాలు ఊపుకుంటూ వాళ్ళు నన్ను దాటిపోయారు. యువకులకు ఎలాంటి తొందరా లేదు. చెట్టాపట్టాలు వేసుకొని, భుజం భుజం కలిపి నడుస్తున్నారు. వాళ్ళకు చీకట్లు త్వరగా ఎందుకు వ్యాపించడం లేదనే విచారం వున్నట్టు నాకనిపించింది.

వాళ్ళు ఎవరూ నన్ను ఖాతరు చేయలేదు. కాని... నేను మాత్రం వాళ్ళని శ్రద్ధగా గమనిస్తున్నాను.

ఇంకా కాస్త ముందు అయినట్లయితే మరింత అసూయపడే వాణ్ణి! పెద్దగా నిట్టూరుస్తూ వాళ్ళ వైపు చూశాను.

ఆనందించడానికి మాత్రమే పుట్టిన భాగ్యవంతులు!

హుఁ ! ఆనందం!!

నాకు నవ్వు ముంచుకొస్తోంది.

కారణం వుంది. వాళ్ళలో చాలామందికి ఆనందం అంటే ఏమిటో తెలీదు. కృత్రిమమైన పరిస్థితుల్ని కల్పించుకుని వాళ్ళు పరుగులు తీస్తారు. ఎక్కడికి? ఆత్మవంచనా వైతరణిలోకా? ఈ యాంత్రిక ప్రపంచంలో వాళ్ళకి దేంతోనూ ఆత్మీయమైన బంధాలు లేవు. దేంతోనూ సంబంధాలు నెలకొల్పుకోవడం చేతకావడం లేదు.

మనిషి చుట్టూ అల్లుకుపోయిన సెంటిమెంట్ల గురించి ఆలోచించసాగాను. లోగడ కూడా ఎన్నోమార్లు అలా ఆలోచించాను. అయినా అప్పుడు వాటిని విప్పేందుకు వీలున్న బంధాలని తెలుసుకోలేకపోయాను.

“మరి ఇప్పుడో? పూర్తిగా అర్థం చేసుకోగలిగానా?” నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

నా సొంత బంధాల్ని నేను అధిగమించగలిగానా? మనస్సులోని పాత గాయం మళ్ళీ పగిలి రక్తం కారసాగింది. ఎవరో పగలబడి నవ్వుతున్నారు. నేను వెనుదిరిగి చూశాను.

వెలుతురు విరజిమ్ముతోన్న ఆ అమ్మాయి. నేను ఆశ్చర్యపోలేదు. ఆమె కోసం నేను ఎప్పుడూ అంతటా ఎదురుచూసేవాణ్ణి! చీకటి నిండిన నా జీవితంలో ఓ వెలుతురు

చేపలా ప్రవేశించి, మళ్ళీ అకస్మాత్తుగా అదృశ్యమైపోయింది. చెరగని జ్ఞాపకమై మిగిలిపోయింది. నా మనోనేత్రం ముందు మాత్రం ఆమెను మళ్ళీ మళ్ళీ చూడగల్గుతున్నాను.

నా దేహంలోని ఒక్కో అణువూ ఆమె కోసం తపించిపోయింది. అప్పుడు ఆమె వెంట ఆమె చెల్లీ, తమ్ముడూ వున్నారు. ఆ ఇద్దరినీ వెంటబెట్టుకొని ధూళి ధూసరితమైన దారంటా ఆమె నడిచివస్తోంది. ఆమె తమ్ముడు విమానం బొమ్మకి దారం కట్టి దాన్ని తిప్పుతూ వస్తున్నాడు.

వాళ్ళతో ఏదో మాట్లాడుతూ ఆ అమ్మాయి గట్టిగా నవ్వింది. బహుశా జోకు అయి వుంటుంది! నిజమే!! వాళ్ళ లోకంలో జోకులకు మాత్రమే అవకాశముంది. ఆమె నా ముందు నుంచి దాటిపోతూంటే చక్కగా చూశాను. శుభ్రంగా తుడిచి పెట్టినట్టున్న అద్దంలాంటి ముఖం. ఇప్పటికీ ఆ ముఖం అలాగే వుండి వుంటుంది.

అప్పుడు సంధ్యా సమయం. అది పల్చని వెలుతురు. ఓ చెట్టు కింద శిలా ప్రతిమలా కూచుని వున్న నన్ను చూసి ఆమె భయపడి వుంటుందని నా భావన. నావైపు ఆమె తప్పక చూస్తుందని నా నమ్మకం. దానికి ప్రత్యేకించి కారణం ఏదీ లేదు. ఆమె నన్ను తప్పక చూస్తుంది. అంతే!

నేను ఎదురుచూస్తూ వుండిపోయాను.

నా అంచనా నిజమైంది. ఆమె నన్ను గమనించింది. భయంతో ముడుచుకుపోవడానికి బదులు ఆ పిల్ల చిన్నగా నవ్వింది. ఆమె భయపళ్ళేదు. అయినా ఎందుకు భయపడటం?

సహజసుందరమైన ఆమె ముఖం చూసి నాకు ఎంతో సంతోషం కల్గింది. ఎందుకో... నా కళ్ళలో అనుకోకుండా నీళ్ళు నిండాయి.

ఆమెకు నేను అర్థమైపోయానో, ఏమిటో?

కనుచూపు మేర దాటిపోయేవరకూ నేనామెను చూస్తూ వుండిపోయాను.

సాంబ్రాణి కొమ్మల్లోంచి అదో మాదిరి చప్పుడు చేస్తోన్న గాలీ, కోట గోడలకు కొట్టుకొంటోన్న అలలూ... ఆమె నవ్వుకి ప్రతిరూపాలుగా ఇప్పటికీ తోస్తున్నాయి.

సాయంకాలపు అరుణిమ అదృశ్యం కావడంతో ఆకాశంలో నక్షత్రాలు అక్కడక్కడా గోచరిస్తున్నాయి. నేను అక్కణ్ణించి లేవలేదు. మంచుతో కప్పబడ్డ కొండ

వాలుపై ధ్యానముద్రలో వున్న యోగిలా అలాగే చెట్టు కింద కూచున్నాను. చల్లని వాతావరణం చుట్టూ చీకటి, అంతటా అలుముకున్న నిశ్శబ్దం. సముద్రం సైతం కొంత శాంతించినట్టుంది.

ఆ అమ్మాయిని మొదట చూసిన రోజుని గుర్తుకు తెచ్చుకున్నాను. నిగూఢమైన ఓ ఉద్దేశ్యంతో అప్పుడు ఇక్కడ వీధుల వెంబడి పచార్లు చేస్తున్నాను. నన్ను అభిమానించే కొంతమందిని అప్పటికే కలిశాను. చెప్పా పెట్టకుండా ఊడిపడ్డంతో వాళ్ళు ఆశ్చర్యపోయారు. "ఊరికే చూసి వెళ్ళడానికొచ్చాను. ఒకవేళ.... మళ్ళీ ఈ ప్రాంతంలోకి రాలేనేమో!" అన్నాను.

అలా అంటున్నప్పుడు నా గొంతు పూడుకుపోయింది. అయినా నేను చెప్పింది అప్పుడు వాళ్ళు నమ్మారు. ఓ చోట నిలకడగా వుండేవాణ్ణి కాదని వాళ్ళకు నా గురించి బాగా తెలుసు.

నడిచిన దారులంటా మళ్ళీ నడిచాను. గుడి ముందరి నుంచీ, చర్చి ఎదుటిగుండా వెళ్ళాను. మైదానంలో కాసేపు కూచున్నాను. అక్కణ్ణించి లేచి మళ్ళీ ఓ మారు నగరం చుట్టి రావడానికి ప్రారంభించాను. అంతటా తిరిగాను. సర్వత్రా సంచరించాను.

చివరికి థియేటర్ ముందుకొచ్చాను. అక్కడ కాసేపు ఊరికే నించున్నాను. ఇంతలో సినిమా ఎందుకు చూడకూడదు అన్న ఆలోచన కల్గింది. నాకు సినిమా అంటే ఎప్పుడూ ఇష్టమే! అన్నట్టు.... ఎందుకలా కేవలం సినిమా గురించే చెబుతున్నాను..? నాకు అన్నీ ఇష్టమే!

సాయంకాలానికి షో అయిపోతుంది. తర్వాత బోల్డు సమయముంటుంది. ఎటైనా వెళ్ళి రావచ్చు. జేబులో డబ్బులున్నాయి. హోటళ్ళో గది తీసుకోవాలన్నా ఎలాంటి ఆటంకం లేదు. కావాలంటే నేను నివసించే స్థలానికే తిరిగి వెళ్ళవచ్చు. అక్కడ నా పడక మీద హాయిగా పడుకున్నాక... చనిపోవచ్చు.

అవును నేను విషం తాగి చనిపోవాలని నిర్ణయించుకున్నానప్పుడు. ఎందుకు, ఎలా అలాంటి నిర్ధారణ కొచ్చానో చెప్పలేను. నా జీవితంలోని ప్రతి నిమిషమూ విషాదమూ, నిరాశలతో నిండిపోయి వున్నాయి. నన్ను నాశనం చేసేందుకే ఈ ప్రపంచంలోని ప్రతి వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని నా నమ్మకం. అందుకే నేను ప్రతి

ఒక్కరికి భయపడేవాణ్ణి! అనుమానం పెనుభూతం కదా! అది అందుకే నా హృదయంలో అంతకంతకూ విస్తరించి భయపెడుతోంది.

అయినా కొంతమందిని అన్నీ మరిచి ప్రేమించాను.

నా బాల్యం సంతోషభరితమైన సుందర స్వప్నంలా గడవలేదు. సరిగ్గా అప్పుడే మొదలయ్యాయా నిరాశా, నిట్టూర్పులూ.

చివరికి ఇంక ఏమాత్రం భరించలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ధారణకొచ్చాను. మరణంతో అంతంకాని బాధ వుందా ఈ ప్రపంచంలో?

ఆ రోజు .... విషం సీసాతో థియేటర్‌కు వెళ్ళి నాకు నేనే ఇలా అనుకున్నాను. “నువ్వు చచ్చిపోవాల్సిందే! అలా అయితేనే నీకు స్వేచ్ఛా, విముక్తి లభిస్తాయి.”

అన్నింటికన్నా చివరి సీట్లో కూచున్నాను. మ్యాట్నీ కావడంతో మంది అంతగా లేరు. ఓ రకంగా ఆనందంగా వుంది. కాస్త ప్రశాంతంగానైనా సినిమా చూడొచ్చు కదా!

సినిమా మొదలవుతున్నప్పుడు ఓ అమ్మాయీ ఆమె వెనకాలే చిన్న పిల్లలు ఇద్దరూ ప్రవేశించారు. వాళ్ళు రావడమే అల్లరి చేస్తూ వచ్చారు. మామూలు పిల్లల్లో కన్పించే ఉత్కంఠో, ఆశ్చర్యమో వాళ్ళలో ఏమాత్రం లేవు. ఆ అమ్మాయి కూనిరాగం తీస్తూ థియేటరంతా నిర్లక్ష్యంగా పరికించి చూసింది.

భగవాన్! ఆ పిల్లల్ని నా దగ్గరికి రాకుండా చూడు. ఈ అవసాన దశలో వాళ్ళు శాంతిని లేకుండా చేస్తారు. థియేటర్లో కావలసినంత స్థలముంది. ఎక్కడికైనా వెళ్ళి కూచోనీ! ఇక్కడ మాత్రం వద్దు” నేను ఇలా ప్రార్థిస్తూ వుండగానే ఆమె నా దగ్గరికే వచ్చింది. ఆమె వెనక ఆ ఇద్దరూ.

నేను వాళ్ళవైపు అసలు కన్నెత్తి చూడలేదు.

నన్ను ఇబ్బందికి గురిచేసేందుకు కాక మరెందుకు నా దగ్గరికొచ్చి కూచున్నారు?

ఆ అమ్మాయి తన చెల్లితోనూ, తమ్మునితోనూ గలిబిలిగా తమిళమూ, మలయాళమూ కలిసిన భాషలో మాట్లాడ్డం మొదలెట్టింది. మహావేగంగా మాట్లాడుతోంది. అలా మాట్లాడుతూనే హఠాత్తుగా ఆపి ఏదో ఓ పాట ఎత్తుకొంది. కూనిరాగంతో రెండు పంక్తులు పాడినట్టుంది. చాలా చక్కగా పాడింది. మధ్య మధ్య ఓ చిన్నపాటి జలపాతం బండరాళ్ళకి తగిలి బద్దలవుతున్నట్టు పగలబడి నవ్వింది కూడా.

సినిమా మొదలైంది.

అవి టెక్సాస్‌లోని సువిశాలమైన పచ్చిక బయళ్ళు. ఇద్దరు యువకులు తాము ప్రేమిస్తోన్న ఓ స్త్రీ కోసం పరస్పరం రక్తం కళ్ళ చూసుకోవడానికి తయారుగా వున్నారు.

బాంబులు బద్దలవుతున్నాయి. మనుషులు కిందపడిపోతున్నారు. గుర్రాలు పరుగులు తీస్తున్నాయి. శత్రువులు వేలకొద్ది పశువుల్ని తోలుకు పోతున్నారు.

నాకు చేరువలో వున్న ఆ అమ్మాయి సినిమా చూస్తూ టెక్సాస్ వెళ్ళిపోయినట్టుంది. సెల్యులాయిడ్ దృశ్యాల్లో లీనమైపోయింది. ఆమెకు అశాంతిగా వున్నట్టుంది. ఓ గుర్రం వెల్లకిలా పడిపోవడం చూసి మనసులో "పాపం!" అనుకుంది.

భయంకరమైన డేవిడ్ ఫారర్ ముఖాన్ని, క్లోజప్‌లో చూసి ఆమె 'ఆయ్' అంది. అలా అన్నాక ఆమె సీట్లో వెనక్కి వాలి కూచుంది.

ఓ దురాక్రమణదారుని చేతికి బాంబు తగలగానే ఆమె నన్ను పట్టుకొని ఊపింది.

"శభాష్! అలా కావాలి కదూ!" అంది.

నేను ఎలాంటి ప్రతిస్పందనా వ్యక్తీకరించకుండా వెండి తెర వైపు చూస్తుండిపోయాను.

నాకు ఆశ్చర్యం వేసింది. ఆ అమ్మాయి అచ్చంగా చైతన్యం ఉట్టిపడుతోన్న విస్ఫులింగం.

క్రమంగా ఆ అమ్మాయి నీరసం అంతరించిపోయింది.

ఆమె నా చెయ్యి పట్టుకొని కదుపుతూ "మీరు ఈ కథ కాస్త చెప్పి పెట్టరూ?" అంది. ఆమె ముఖంలోకి శ్రద్ధగా చూశాను. ఆమె ధరించిన ముక్కుపుల్లలోని రాయి తళుక్కుంది. ఆమె ముఖం కూడా అలాగే వెలిగిపోతోంది.

"నాకు ఈ కథ చెప్పరా? అసలే అర్థం కావడం లేదు. నేనిప్పుడు ఆరో తరగతిలోనే వున్నాను" అంది.

అప్పుడు నేననుభవించిన ఆనందం లేడిపిల్లలా గెంతులేసింది. మొదటిసారిగా ఓ అమ్మాయి అంత ప్రేమగా, స్వేచ్ఛగా నన్ను ఓ విషయం అడుగుతోంది. నేను ధరించిన

గుడ్డలు నాసిరకానివీ, చిరిగిపోయినవీ కూడాను. వెంట్రుకలు దువ్వుకోలేదు. గడ్డం చేసుకోలేదు. అయినప్పటికీ ఇంగ్లీషు సినిమా అర్థం చేయించేపాటి తెలివితేటలు నాకు వున్నాయని ఆ అమ్మాయికి తోచింది కదా!

నేను ఓ మారు అమ్మతో ఆసుపత్రికి వెళ్ళినప్పుడు ఓ నర్సు ఇలా అంది.

"మీ అబ్బాయి కదూ?"

"అవును" అమ్మే చెప్పింది.

"బీడీల పని అయివుంటుంది, అవునా?"

అమ్మ ఏదో అనేలోపే నేను "అవును" అన్నాను. అయితే ఆ నర్సు వయోధికురాలు. అలా మొదటిసారి ఓ స్త్రీతో మాట్లాడ్డం జరిగింది. కాని నా చేరువలోనే వున్న ఈ పిల్ల చిన్నపిల్ల నా తెలివితేటల మీద ఆమె ప్రగాఢమైన విశ్వాసంతో వుంది. ఆమె గులాబీల తోటలో వనకన్యలా వుంది.

నేను ఆమెకు సినిమా కథ చెప్పేశాను.

సినిమా సగం అయిపోయింది. ఆ అమ్మాయి నేను వినాలన్న సంకల్పంతో అత్యంత మధురంగా ఓ పాట పాడింది. అందులో ఓ పంక్తి ఇలా వుంది.

"చందారే జారె జారె...."

పాట బావుందన్నాను. ఆమె "మా నాన్నకి నా పాటంటే చాలా ఇష్టం" అంది. తన తమ్ముడి జేబులోంచి ఓ చాక్లెట్టు తీసుకొని విప్పదీసింది. నాకూ ఇచ్చింది.

చావబోయే నాకు ఆమె చాక్లెట్టు ఇవ్వడం తలచుకొని నవ్వాను.

"వద్దు, నాకొద్దు" అన్నాను. అయినా ఆమె వదల్లేదు.

"అదేంటి?" మీరు చాక్లెట్లు తినరా ఏం? మీకిష్టం లేదా? నాకైతే ఇష్టం. మా అమ్మ నాకెప్పుడూ కొనిస్తుంది. మీ అమ్మ మీకూ కొనిస్తుందా?"

"మా అమ్మ నాకు చాక్లెట్లు కొనిస్తుందా?" అని ఆమె ప్రశ్న. ఆ అమ్మాయి నేనింకా చిన్న పిల్లాణ్ణి అనే నా గురించి ఆలోచిస్తూ వుండొచ్చు.

ఆమె బలవంతం చేయడంతో చాక్లెట్టు తీసుకున్నాను. సినిమా అయిపోగానే ఆమె "ఇప్పుడే ముగిసి వుండాల్సింది కాదు" అంది. మేం హాల్లోంచి బయటపడ్డాం. సాయంకాలమైంది.

ఆమె "మీరు మళ్ళీ సినిమాకు ఎప్పుడు వస్తున్నారు?" అని ప్రశ్నించింది.

నేనేమీ చెప్పలేదు.

"వచ్చే వారం వస్తారా, రారా?"

నాకు తమాషాగా వుంది.

"అమ్మ ఒప్పుకుంటే వస్తాను."

ఆమె పగలబడి నవ్వింది.

"మీ అమ్మతో నేనూ వస్తున్నానని చెప్పండి"

నేను నవ్వలేకపోయాను.

ఆమె చెల్లీ, తమ్ముడూ వెళ్ళిపోదామని తొందర చేస్తున్నారు. ఆ అమ్మాయిని వదిలి వెళ్ళాలంటే నాకు బాధగా వుంది.

ఆ అమ్మాయి పిల్లలతో వెళ్ళిపోయింది.

నేను ఆమెను చూస్తూ అలా వుండిపోయాను. ఆ అమ్మాయి పెరిగి పెద్ద కావడమూ, పెళ్ళి చేసుకోవడమూ... నా కళ్ళ ముందే జరిగిపోయాయి.

నా హృదయం బాధగా మూలిగింది. ఇప్పుడు నేను ఏకాకిని. దుఃఖం తప్ప ఏదీ లేని దురదృష్టవంతుణ్ణి! కాని మరునిముషమే నాకు "ఆ అమ్మాయి తాను ఆనందంగా వుండటమే కాక, ఇతరుల్ని కూడా ఆనందింప చేస్తుంది. ఎంత చలాకీ పిల్ల" అని గుర్తుకొచ్చింది.


నేను ఒంటరిగా ఇంటికెళ్ళాను. ఊపిరి సలపని చీకటి గదిలో చాలాసేపు పడుకొని దొర్లాను. అయితే... అప్పటి నించీ నాకు తెలియకుండానే నాలో చాలా మార్పు జరుగుతోంది.

ఆ రాత్రి నేను విషం తాగి చావలేదు. అదీ జరిగిన సంఘటన. ఆ తర్వాత ఓ సంవత్సరం దొర్లిపోయింది. నేను మళ్ళీ ఎప్పటిలా ఒక్కచోట స్థిరంగా కాలు నిలుపలేకపోతున్నాను. ఇప్పుడు ఇతరులు నా గురించి ఏం మాట్లాడుకున్నా ఫరవాలేదు. వాళ్ళ మాటల సారం ఏమై వుంటుందని వినే కోరికా లేదు.

జరిగిందంతా మసగ్గా పొగలా మాత్రమే చూడగల్గుతున్నాను. అందులో హేతువుకి స్థానం లేదు. కాస్త ప్రశాంతత వుంది.... మానవ జీవితంలో అందని సంఘటనలు అనేకం.

మంచు బాగా పడుతోంది. నేను వెళుతున్నాను.

వెలుతురు చిమ్ముతోన్న ఆ అమ్మాయిని మళ్ళీ చూడకుండా వుండలేను. బహుశా నాలుగైదు వందల ఏళ్ళ తర్వాతైనా చూడగలను. నాతోపాటు మనుషులంతా దారి మలుపులో సంశయాస్పదంగా నించుని వుంటారేమో! అయినా తప్పక ఆమె కనిపిస్తుంది.



## ఒ.వి. విజయన్

1930లో పాల్ఘాట్‌లో ప్రభవించారు. 'ఖసాక్కిండె ఇతిహాసం' (ఖసాక్ చరిత్ర) ద్వారా మలయాళ నవలా సాహిత్యంలో యుగస్రష్టగా మారారు. మలయాళ భాషని ఆధ్యాత్మికతలోకి మళ్ళించారు. చక్కని కథాశిల్పి. వీరిది మంచి చెడ్డలకి ఆవలి లోకం. మలబార్ క్రైస్తవ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. 1958లో శంకర్స్ వీక్లీలో కార్టూనిస్టుగా చేరారు. పేట్రియాట్, మెయిన్‌స్ట్రీం, మాతృభూమి, ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ... తోట్టు, ఫార్ ఈస్ట్ ఎకనామిక్ రివ్యూ (హాంకాంగ్) ల్లోనూ కాలమిస్టుగా, కార్టూనిస్టుగానూ పనిచేశారు. వీరి 'గురుసాగరం'కు కేరళ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులూ, వయలార్ అవార్డూ లభించాయి. అనేక కథలూ, నవలలూ రాశారు.

# సముద్ర తీరంలో...

**- ఒ.వి. విజయన్**

వెళ్ళాయి అప్పన్ ప్రయాణం ప్రారంభించేసరికి ఇంట్లోంచి పెద్ద పెట్టున ఆర్తనాదాలూ, అరుపులూ, శోకాలు విన్పించాయి. పొరుగున వున్న అమ్మిణి ఇంట్లోనూ, ఆ పక్కన వున్న ముత్తురావుత్తన్ ఇంటిలోనూ అంతా విచారగ్రస్తులై వున్నారు. ఆ ఇళ్ళకు అవతల సైతం పాళుతఅ గ్రామంలోని చిల్లరమల్లర ఏభై గుడిసెల్లోనూ ఈ విషాదం అలముకొని వుంది. ఆ సంఘటన పట్ల వాళ్ళంతా సానుభూతిని కూడా ప్రదర్శిస్తున్నారు. వెళ్ళాయి అప్పన్ కణ్ణూర్‌కు వెళుతున్నాడు. తమ దగ్గర రైలు ఎక్కేందుకు సరిపడా డబ్బులు వున్నట్లయితే, వెళ్ళాయి అప్పన్‌తో పాటు అమ్మిణి ఏడత్తి, ముత్తువణ్ణన్, నాగేలచ్చన్, కోంబిప్పుశారి... ఇంకా పాళుతఅ గ్రామంలో వున్న వాళ్ళంతా కణ్ణూరుకు వెళ్ళే వాళ్ళే! ఇవాళ కణ్ణూరు రైలు ప్రయాణం అంటే పాళుతుఅ గ్రామం కోసం అన్నట్టే వుంది. వెళ్ళాయి అప్పన్ గ్రామంలోని ఇల్లు దాటి పొడవాటి గట్టు ఎక్కాడు. తర్వాత పొలం దాటిపోయాడు. అతని వెనకాల ఏడుపులు క్రమంగా దూరమై ఆగిపోయాయి. ఇప్పుడు పొడవాటి గట్టు దాటి చేలోకి మళ్ళాడు. పచ్చని గడ్డిలో వున్న కాలిబాట ముందుకు దోవ చూపిస్తోంది. ఆ కాలిబాట ఎంత మంది దుఃఖ సంచారాలు ఫలితంగా ఏర్పడిన ఆనెకాయో!

'దేవుళ్ళారా! ప్రభువులారా!!" వెళ్ళాయి అప్పన్ కోటి దేవుళ్ళని పిలిచాడు. కాలిబాటకు ఇరువేపులా వున్న నల్లని తాటిచెట్లతో గాలి చిత్రమైన శబ్దం చేస్తోంది. తాటిమట్టల్లో గాలి రివ్వుమనడం వెళ్ళాయి అప్పన్‌కు వింతగానూ, అపరిచితంగానూ తోచింది. అవి తమలో తాము మాట్లాడుకుంటున్నట్టు అన్పించింది. తిండి దయ్యాలూ,

చనిపోయిన మేనమామలూ పరస్పరం మాట్లాడుకుంటున్నట్టుగా గోచరించింది. తుండు గుడ్డలో కట్టిన చద్దిమూటలోని గంజి చేతికి తడితడిగా తాకింది. అతని భార్య కోడచ్చి ఈ చద్దిమూట కడుతూ, అందులోని ఆమె తన అంతులేని కన్నీళ్ళను వడిపి వుండవచ్చు. కన్నీటి తేమ తుండులోంచి చల్లగా తగులుతోంది. రైల్వే స్టేషన్‌కు చేరాలంటే ఇంకా నాలుగు మైళ్ళు నడవాలి. కొంతదూరం నడిచాక వెళ్ళాయి అప్పన్‌కు కుట్యస్సన్ మాప్పిళ్ళ ఎదురయ్యాడు. అతను ఆదరంగా తప్పుకుంటూ, "వెళ్ళాయీ!" అన్నాడు.

"మరక్కారా?" (చుక్కాని నడిపే వ్యక్తి) బదులిచ్చాడు వెళ్ళాయి అప్పణ్. అంతే! వాళ్ళ మధ్య  రెండే రెండు పొడి మాటలు. రెండే రెండు పేర్లు. కాని ఆ మాటల్లో సుదీర్ఘమైన, పరిపూర్ణమైన సంభాషణా పరంపరలు ఇమిడి వున్నాయనే విషయం వెళ్ళాయి అప్పన్‌కు, కుట్యస్సన్ మాప్పిళకు మాత్రమే తెలుసు.

"మరక్యారా! నీకు నేను పదిహేను రూపాయలు రుణపడి వున్నాను. కాదు, కాదు... పదిహేను రూపాయల నాలుగణాలు."

"ఇప్పుడు దాని గురించి ఆలోచించకు వెళ్ళాయీ!"

"మరక్కారా! ఇంక ఎప్పుడూ నేను ఆ బాకీ తీర్చలేనేమో!"

"తీరని బాకీలన్నీ దేవుని బాధ్యతలే. అది అలా వుండనీ!!

"నా గుండెలు అవిసిపోతున్నాయి – ప్రాణాలు పైకి పోతున్నాయి."

"మీకు దేవుడు సాయం చేయనీ ! ముత్తునబీ సాయం చేయనీ!! మీ దేవుళ్ళూ మా దేవుళ్ళూ సాయం చేయనీ!!!"

ఇదే వాళ్ళిద్దరి మధ్య జరిగిన ఆ రెండు మాటల్లో ఇమిడి వున్న మౌన సంభాషణ. నల్లని తాటి మట్టల్లోని గాలి సాంద్రమైంది. కుట్యస్సన్ మాప్పిళ్ళను దాటి వెళ్ళాయి. అప్పన్ ప్రయాణం కొనసాగించాడు. ఇంకా నాలుగు మైలు రాళ్ళు దాటాలి. మార్గమధ్యంలో చాకలి స్త్రీ నీలి ఎదురైంది. ఉతికిన గుడ్డల మూట భుజాన వేసుకొని ఎదురైన నీలి దారి తప్పుకొని  నిలుచుతుంది.

"వెళ్ళాయి అచ్చా!" అంది. అంతే!

"నీలీ!" అతను అన్నాడు.

అంతే!

రెండు మాటలే! రెండు మాటల్లోనే పరిపూర్ణమైన సాంత్వనం, కొండంత ఊరట. వెళ్ళాయి అప్పన్ వెళ్ళిపోయాడు.

కాలిబాట క్రమేపీ మరో రోడ్డులో కలిసిపోయింది. వెళ్ళాయి అప్పన్ రోడ్డంటా నడిచాడు. ఆ దారి నదిలోకి తిరిగింది. ఏ ఏరుదాటి మిట్ట ఎక్కితే వచ్చేది స్టేషన్‌కువెళ్ళే దారే! ఇసుక దాటి వెళ్ళాయి అప్పన్ ఏటి నీటిలో దిగాడు. నీళ్ళు కాలి పిక్కల్ని తాకుతున్నాయి. పరక చేపలు కూడ తాకాయి. ఏటి మధ్యలోకి రాగానే, ఎప్పుడో స్నానాలు చేసిన అనుభవం చప్పున గుర్తుకొచ్చి కలతపడ్డాడు. తన తండ్రి శవాన్ని ఆ ఏటి నీటిలోనే కడగటం, చిన్నతనంలో తన కొడుక్కి ఆ ఏటిలో స్నానం చేయించడం... అన్నీ గుర్తుకొచ్చి బాధపడ్డాడు. గోర్వెచ్చని నీళ్ళు, అన్నీ గుర్తుకొచ్చాయి. ఏరు దాటి ఆవలి గట్టు ఎక్కేదాకా వెళ్ళాయి అప్పన్ ఏడుస్తూనే వున్నాడు.

స్టేషన్‌కు చేరిన వెళ్ళాయి టికెట్ కోసం క్యూలో నిల్చున్నాడు. పంచ చెంగున కట్టుకున్న డబ్బు బయటకు తీశాడు.

"కణ్ణూరు" అన్నాడు వెళ్ళాయి అప్పన్. క్లర్కు టిక్కెట్టు తీసుకొని అచ్చు గుద్ది కిటికీలోంచి బయటికి విసిరేయగానే, వెళ్ళాయి అప్పన్‌కు తన ప్రయాణంలో ఓ ఘట్టం ముగిసినట్టు అన్పించింది. టికెట్ పంచ చెంగుకు కట్టుకుని మెట్లు ఎక్కుతూ ప్లాట్‌ఫారమ్ మీదికొచ్చాడు. బెంచీ మీద కూచుని రైలు బండి కోసం ఎదురుచూస్తున్నాడు. దూరంగా సూర్యుడు జారిపోతున్నాడు. చీకట్లు పడుతోన్న నల్లని తాటి వనాల మీంచి పక్షులు గూళ్ళు చేరుతున్నాయి.

వరిచేల గట్టున తన చిటికెన వేలు పట్టుకొని నడుస్తూ అస్తమయపు పక్షుల్ని చూస్తూ విస్తుపోయిన కొడుకు వున్నట్టుండి వెళ్ళాయి అప్పన్‌కు గుర్తుకొచ్చాడు. అస్తమయంలోంచి చేలోకి దిగి నడుస్తోన్న తన తండ్రి జ్ఞప్తి కొచ్చాడు.

బెంచీ మీద మిగిలిన స్థలంలో ఓ నాయర్ పెద్ద మనిషి కూచుంటూ "కోయంబత్తూరుకా?" అన్నాడు.

"కణ్ణూరుకు" వెళ్ళాయి అప్పన్ అన్నాడు.

"నేను కోయంబత్తూర్‌కే!

"ఓహో!"

"కణ్ణూరులో ఏం పని?"

"ప్రత్యేకించి ఏమీ లేదు."

"ఊరికినే వెళుతున్నారా?"

ఆ అపరిచిత వ్యక్తి సంభాషణ వెళ్ళాయి అప్పన్ గొంతుకి ఉరితాడులా బిగుసుకుంది. పాళుతలు గ్రామంలోని పొడవాటి గట్టు దాటితే అతనికి లోకమంతా అపరిచితమే! అపరిచితుల ఆసక్తిలేని సంభాషణలు అసంఖ్యాకమైన ఉరితాళ్ళుగా మారాయి. కోయంబత్తూర్ బండి సకాలంలో రావడంతో ఆ పెద్ద మనిషి లేచి వెళ్ళారు. ఇప్పుడు వెళ్ళాయి అప్పన్ ఒంటరి. చద్దిమూట విప్పాలనిపించడం లేదు. తుండులోంచి బయటికి కారుతోన్న తేమలో చేతులు పెట్టి కూచున్నాడు. అలా కూచునే నిద్రలోకి జారాడు. నిద్రలో కలగన్నాడు. ఆ కలలో వెళ్ళాయి అప్పన్ "కొడుకా! కందుణ్ణీ!!" అంటూ కలవరించాడు.

రైలు కూతా, ధడ్ ధడ్‌మనే చప్పుడూ వెళ్ళాయి అప్పన్‌ను నిద్రలోంచి లేపాయి. అతను త్వరపడుతూ లేచాడు. పంచ చెంగున కట్టుకున్న టికెట్టు వుందో, లేదో చూసుకున్నాడు. నిక్షేపంగా వుంది. మెల్లగా బండిలోకి ఎక్కాడు. ఖాళీగా వున్న చోట కూచోబోయాడు.

"ఓ పెద్ద మనిషీ! ఇది ఫస్టు క్లాసు"

"అవునా?"

పక్క పెట్టెలోకి మారాడు.

"ఇది రిజర్వుడు"

"అవునా?"

"ఇంకో చోట చూడు పెద్ద మనిషీ!"

అన్నీ అపరిచితుల స్వరాలే! చివరికి ఓ పెట్టెలో జొరబడ్డాడు. కూచోవడానికి అక్కడా స్థలం లేదు.

"నిలుచున్నా ఫరవాలేదు. కాని నిద్రపోకూడదు. ఈ రాత్రి నా కొడుకు నిద్రకు కరువై వుంటాడు" అనుకున్నాడు. నేల మారుతున్న ప్రకారం రైలు బండి లయ మారుతోంది.

వీధి దీపాలు, ఏటిలోని ఇసుక తిన్నెలు, చెట్లు వేగంగా వెనక్కి వెళ్ళిపోతున్నాయి. అతను చాలాకాలం క్రితం రైలుబండిలో ఓసారి ప్రయాణం చేశాడు. అది పగటి ప్రయాణం. ఇదేమో రాత్రి బండి. మసక చిత్రాలు వున్న గోడల సొరంగంలోంచి రైలు దూసుకుపోతోంది.

కణ్ణూరు చేరేసరికి ఇంకా తెల్లవారలేదు. అప్పటికీ అతని చేతిలో కట్టు విప్పని చద్దన్నం వుంది. గేట్లో టికెట్టు ఇచ్చేసి వెళ్ళాయి అప్పన్ స్టేషన్ బయటికి నడిచాడు. ఆకాశం కింది చీకట్లో దూరంగా ఎక్కడో వికసించే వేకువ రేకుల సూచన. రైల్వే స్టేషన్ బయట గుంపులు గుంపులుగా వున్న గుర్రపు బగ్గీల వాళ్ళు "బండి కావాలా?" అని వెళ్ళాయి అప్పన్‌ను అడగలేదు. అతను మాత్రం "జైలుకు దారేది?" అని ప్రశ్నించాడు.

ఎవరో నవ్వారు. "ఇదుగో! ఓ ముసలాడు తెల్లవారకముందే జైలుకు దారి అడుగుతున్నాడర్రో!!" అనుకున్నారు. మళ్ళీ ఇంకెవరో నవ్వారు.

"ఓ పెద్దమనిషీ! దొంగతనం చేశావంటే చాలు. నేరుగా జైలుకే వెళ్ళిపోతావు."

అపరిచితుల స్వరాలు గొంతు చుట్టూ మెలికలు పడుతున్నాయి. వెళ్ళాయి అప్పన్‌కు శ్వాస ఆడటం లేదు.

చివరికి ఎవరో దారి చెప్పారు. అతను కదిలిపోయాడు. కాకుల అరుపులతో పైన క్రమంగా ఆకాశం తెల్లబడింది.

జైలు గేటు దగ్గర వున్న కాపలా మనిషి వెళ్ళాయి అప్పన్‌ను ఆపాడు.

"ఎక్కడికి ఇంత పొద్దుట?"

వెళ్ళాయి అప్పన్ ముందుకి కదిలాడు. ఓ చిన్న పిల్లాడి నిస్సహాయతతో అతను కాపలా మనిషి ముందు నించున్నాడు. తర్వాత మెల్లగా పంచకు మరో చివర కట్టి వున్న పసుపు పచ్చని కాయితం బయటికి తీశాడు. ఆ కాయితం ముడుతలు పడి అస్తవ్యస్తంగా వుంది.

"ఏంటది?" కాపలా మనిషి అడిగాడు.

వెళ్ళాయి అప్పన్ కాయితం కాపలా మనిషికి ఇచ్చాడు. కాపలా మనిషి అసలు ఆ కాయితంలోకి చూళ్ళేదు.

వెళ్ళాయి అప్పన్ "నా కొడుకు జైల్లో వున్నాడు" అన్నాడు.

"నిన్ను ఇంత పొద్దుట ఎవరు రమ్మన్నారు?" కాపలా మనిషి కర్కశంగా అన్నాడు. మళ్ళీ అతనే "ఆఫీస్ తెరవనీ!" అన్నాడు.

ఏదో యాదృచ్ఛికంగా కాపలా మనిషి కాయితంలోకి చూశాడు. అతని ముఖంలో వున్న పెళంగా జాలి గూడుకట్టుకుంది.

"రేపు కదూ?" కాపలా మనిషి అడిగాడు.

"నాకు తెలీదు. కాయితంలో ఏం రాసి వుంది?"

కాపలా మనిషి మరోసారి శ్రద్ధగా కాయితంలోని వివరాలు చదివాడు.

"అవును రేపు ఉదయం ఐదు గంటలకు" అతనన్నాడు.

వెళ్ళాయి అప్పన్ కళ్ళు విశాలమయ్యాయి. వాటిలో ఆశ్చర్యం చోటు చేసుకుంది.

"అవునా?" వెళ్ళాయి అప్పన్ అడిగాడు.

"అయ్యా! ఇక్కడ కూచో"

"ఓ!"

జైలు గుమ్మం దగ్గరి వాలుమెట్ల మీద వెళ్ళాయి అప్పన్ కూచున్నాడు. భక్తులు వైకుంఠ ద్వార దర్శనం కోసం ఎదురుచూస్తున్నట్టు ఎదురు చూశాడు.

"అయ్యా మీకు టీగాని, మరేదైనా కావాలా?"

"వద్దు"

"నా కొడుకు ఈ రాత్రి నిద్రపోయి వుండడు. నిద్ర పోకుండా మెలకువతోనూ వుండి వుండడు. వాడు నిద్ర పోకుండా, మెలకువతో వుండకుండా తనకు టీ తాగడానికి ఎలా మాత్రం మనస్కరిస్తుంది? "వెళ్ళాయి అప్పన్ ఆలోచిస్తున్నాడు. అతని అరచేయి చద్దన్నం మీద పడింది. ఇంకా ఆలోచిస్తున్నాడు.

"కొడుకా! ఈ చద్దన్నం మీ అమ్మ నాకోసం కట్టింది. ప్రయాణంలో నేను ఎంగిలి పడక ఇక్కడిదాకా వచ్చాను. ఇక ఇది తప్ప నీకివ్వడానికి నా దగ్గర ఏదీ లేదు. తుండులో కట్టు విప్పక వున్న చద్దన్నం పులిసిపోయింది.

క్రమక్రమంగా తెల్లవారింది. సమయం క్రమంగా గంభీరమైపోయింది. జైలు ఆఫీసు తీశారు. జనాలు మేజాల వెనక స్థలాలు ఆక్రమించుకున్నారు. కాపలా మనుషుల కవాతు చేశారు. కారాగారం సజీవమైంది.

అధికారులు ఫైళ్ళు పరిశీలిస్తున్నారు. వాళ్ళు ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. అవి అపరిచితుల స్వరాలు. విద్వేషమూ, నిందా, విరోధమూ లేని వలలు. అవి గొంతుకు మెలికలు పడుతూ శ్వాస ఆగిపోతోంది. పుండుకు పులుసు ఎక్కించినట్టు...ఎండకు వేడి తీవ్రత ఎక్కువవుతోంది.

"ఇక్కడ వెయిట్ చెయ్యి"

వెళ్ళాయి అప్పన్ ఎదురు చూస్తున్నాడు.

ఎన్నో పడిగాపుల తర్వాత ఓ కాపలాదారు అప్పన్‌ను కారాగారంలోనికి తీసుకొని వెళుతున్నాడు. అవి ఎండా, వెలుతురూ చొరని ఇరుకైన వసారాలు.

ఇదుగో ఇక్కడే! ఇనుప చువ్వల వెనుక కందుణ్ణి నిలుచుని వున్నాడు. అపరిచితుడిలా కందుణ్ణి వెళ్ళాయి అప్పన్‌ను చూశాడు. సాంత్వనం చెప్పడమో, ఊరట పొందడమో... ఏదీ వీలుకాని మనస్సు. కాపలాదారు కటకటాల తలుపులు తెరిచి వెళ్ళాయి అప్పన్‌ను లోపలికి ప్రవేశింపచూశాడు. తండ్రీ కొడుకులు ఎదురు బొదురుగా కాసేపు నిలుచుండిపోయారు. తర్వాత వెళ్ళాయి అప్పన్ కొడుకుని గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. కందుణ్ణి పెద్ద పెట్టున ఏడ్చాడు. వెళ్ళాయి అప్పన్ రోదిస్తూ "కొడుకా!" అన్నాడు.

కందుణ్ణి "నాన్నా!" అంటూ మళ్ళీ పిలిచాడు.

రెండు మాటలే! ఆ రెండు మాటల మధ్య వున్న దుఃఖంలో, మౌనంలో తండ్రి కొడుకులు తమ తమ హృదయ భారాలు దింపుకున్నారు.

"కొడుకా! నువ్వేం తప్పు చేశావు?"

"నాకు గుర్తు లేదు నాన్నా!"

"కొడుకా! నువ్వు హత్య చేశావా?"

"నాకు గుర్తు లేదు."

"ఫరవాలేదు కొడుకా! ఇంక ఏమీ గుర్తుంచుకోవాల్సింది లేదు."

"కాపలాదారు గుర్తు చేయగలడా?"

"లేదు కొడుకా!"

"నాన్నా! మీరు నా బాధ గుర్తించగలరా?" ఉచ్ఛ స్థాయిలో నిశ్శబ్దమైన ఏడుపు

"నాన్నా! నన్ను ఉరి తీయడానికి సమ్మతించకండి."

రెండే రెండు మాటల మధ్య పై సంభాషణ వినిమయం జరిగిపోయింది.

"ఓ పెద్ద మనిషీ! బయటికి వచ్చేసెయ్! టైమ్ అయిపోయింది."

వెళ్ళాయి అప్పన్ బయటికి వస్తున్నాడు. అతనికి వెనకాల ఇనుప కటకటాల తలుపులు మూసుకుంటున్నాయి. కదులుతోన్న రైలు బండి పెట్టెలోంచి ప్రయాణీకుడు బయటికి చూస్తున్నట్టు, ఇనుప చువ్వల్లోంచి కండుణ్ణి బయటికి చూస్తూ అపరిచితుడిలా నించున్నాడు. చివరి చూపుతో శ్రద్ధాంజలి ఘటిస్తూ, వెళ్ళాయి అప్పన్ అక్కణ్ణించి కదిలిపోయాడు.

జైలు పరిసరాల్లో వెళ్ళాయి అప్పన్ తచ్చాడుతూ వుండిపోయాడు. సూర్యుడు నడినెత్తిమీదికొచ్చాడు. పొద్దు వాలిపోయింది. ఈ రాత్రి కండుణ్ణి నిద్రపోతాడా? రాత్రిని నెట్టుకొస్తున్నాడు ఎలాగోలా. గోడల మధ్య కండుణ్ణి ఇంకా జీవిస్తూనే వున్నాడు.

తెల్లవారడానికి ముందు కొమ్ములతో ఊదడం వెళ్ళాయి అప్పన్ స్పష్టంగా విన్నాడు. అది ఉరిశిక్షలో రివాజు అని అతనికి తెలీదు. అధికారులు పొద్దుట ఐదుగంటలకని చెప్పారు. చేతి గడియారం లేకున్నా, ఓ రైతుకు వున్న సహజ జ్ఞానంతో వెళ్ళాయి అప్పన్ టైమ్ ఎంతయిందో తెలుసుకున్నాడు.

ఓ మంత్రసాని నుండి శిశువుని అందుకున్నట్టు... వెళ్ళాయి అప్పన్ తన కొడుకు శవాన్ని కాపలాదారు నుండి తీసుకున్నాడు.

"మీ ఇష్ట ప్రకారం శవ సంస్కారం చేసుకోవచ్చు."


"వద్దు. నాకు ఎలాంటి ఆసక్తీ లేదు."

"శవ బాధ్యత మీకు అవసరం లేదా?"

"దొరబాబులూ! నా దగ్గర డబ్బుల్లేవు."

తోపుడుబళ్ళ వెనక పాకివాళ్ళతో పాటు వెళ్ళాయి అప్పన్ నడిచాడు. పట్టణానికి బయట వున్న ఆరుబయళ్ళ మీద రాబందులు గిరికీలు కొడుతున్నాయి. మట్టితో కప్పడానికి ముందు కొడుకు ముఖాన్ని వెళ్ళాయి అప్పన్ ఓ మారు తేరిపార చూశాడు. కందుణ్ణి తను కన్నబిడ్డ. కొడుకు నొసట చెయ్యి వేసి అనుగ్రహించాడు.

వెళ్ళాయి అప్పన్ ఎండలో యధేచ్ఛగా సముద్ర తీరం చేరాడు. సముద్రాన్ని చూడ్డం ఇదే ప్రథమం. అరచేతుల్లో ఏదో తడిగా తగులుతోంది. అది అతని భార్య కోడచ్చి కట్టి ఇచ్చిన చద్దన్నం. వెళ్ళాయి అప్పన్ మూట విప్పాడు. అతను అన్నమంతా నేల మీద చల్లాడు. ఆకాశంలోంచి ఎక్కణ్ణించో బొంత కాకులు అన్నం ఏరుకు తినడానికి నేలకు దిగుతున్నాయి.



## పొన్‌కున్నం వర్కి

1910 జూన్‌లో ఎడత్వాలో జన్మించారు. ట్రావెంకూర్ స్టేట్ కాంగ్రెస్ ఉద్యమంలో పాల్గొని జైలు పాలయ్యారు. పి.టి. చాక్కో, డి.సి. కిళక్కెముడి అనే వాళ్ళతో కలసి నేషనల్ బుక్‌స్టాల్ ప్రారంభించారు. సాహిత్య ప్రవర్తన సంఘానికి, కేరళ సాహిత్య అకాడమీకి అధ్యక్షులుగా పనిచేశారు.

మలనాడులోని పీడిత క్రైస్తవ రైతుల, రైతు కూలీల జీవితాల్ని రచనల ద్వారా ఆవిష్కరించారు. దోపిడీకి గురవుతోన్న కర్షక వీరుల కోసం కట్టుబాట్లకి వ్యతిరేంగా ఆందోళన సాగించిన మొదటి మలయాళ కలం యోధుడు, అనేక కథా సంపుటాలు, నవలలూ రాశారు.


అనువాదం : నలిమెల భాస్కర్

# నాగలి చప్పుడు

**- పొన్‌కున్నం వర్కి**

ఎద్దులంటే చాలు ఆవుసేప్పు చేట్టన్ అన్నీ మరిచిపోతాడు. ఇతర రైతులందరూ అతనికి ఎద్దుల పిచ్చి పట్టింది అంటారు. అతని కణ్ణన్ ఎద్దు గురించి ఆశ్చర్యపోని రైతులే లేరు. ఆవుసేప్పు చేట్టన్ ఆరో ప్రాణం కణ్ణన్. బూడిదరంగు, మంచి కండలు తిరిగిన శరీరం. కుక్క గొడుగు మొగ్గల్లాంటి కొమ్ములు. వీపు మధ్యలో మూపుకి చేరువలో ఓ సుడి. బయటికి స్పష్టంగా కనిపించే కళ్ళు. కణ్ణన్ నడకకి ఓ ప్రత్యేకమైన ఓ అందం వుంది. దున్నే చోటా, ఇతరత్రా ఆవు సేప్పు చేట్టన్ మనస్సులో వున్న భావాల్ని అది ఇట్టే పసిగట్టగలదు. గట్టు పెట్టేటప్పుడూ, వరికట్టలు కట్టే చోటా ఎక్కడ అతను ఏం అనుకుంటున్నాడో అర్థం చేసుకునే సామర్థ్యం ఆ ఎద్దుకు కరతలామలకం. దాన్ని ప్రేమగా నిమరడం తప్పితే అతను ఏనాడూ కొట్టడు. ఇతర రైతులంతా తమ ఎద్దుల్ని ఉద్దేశించి తిట్టిపోస్తారు. అతనికి అలాంటి అవసరం ఎప్పుడూ కలగనే లేదు. ఓ మంచి మిత్రునితో మాట్లాడినట్టుగానే అతను దాంతో వ్యవహరిస్తాడు. వేరే ఎద్దులు ఎన్ని వున్నా, వాటన్నింటికీ నేతృత్వం మాత్రం కణ్ణన్‌దే! ఓ మడి దున్నడం పూర్తయ్యాక మరో మడిలోకి వెళ్ళేందుకు కణ్ణన్‌కు ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం ఏమీ లేదు. ఎప్పుడు ఏ పని చేయాలో దానికి బాగా తెలుసు. తర్వాతి మడిలోకి మారగానే ఆవు సేప్పు చేట్టనే కాస్త విరామం కోసం కణ్ణన్‌తో “ఒరేయ్! కాస్త ఆగు. నన్ను ఆకు వేసుకోనియ్యి. తమలం లేక చాలాసేపైంది” అని తన అవసరాన్ని తెలియజేస్తాడు.

ఆ మాటలు వినడం తరువాయి కణ్ణన్ కాళ్ళు కదలక అలా శిలా ప్రతిమలా నించుని పోతుంది. ఆ రైతు తమలపాకు వేసుకొని ఏదో గొణుగుతాడు. కణ్ణన్ మళ్ళీ

పని మొదలెడుతుంది. ఏ మడి విడిచి మరో మడిలోకి మారుతున్నప్పుడల్లా ఎంత జాగ్రత్తగా కణ్ణన్ అడుగుతీసి అడుగువేస్తోందో! గట్ల మీద ఎక్కడా తన కాలి అడుగులు వేయదు. అవి చాలా చిన్న గట్లనీ, వాటి మీద ఏ కాస్త పాదం మోపినా అవి చెడిపోతాయనీ తెలుసు. అందుకే ఆ ఎద్దు తన గిట్టలు మోపదు.

చెప్పేది ఇట్టే అర్థం చేసుకొనే పాటి తెలివితేటలు వున్న ఆ ఎద్దుని కట్టేసి వుంచాల్సిన అవసరమే లేదు. ఆ తర్వాత దాన్ని గట్టు వెంబడి స్వేచ్ఛగా వదిలిపెట్టవచ్చు. అలా వదిలిపెట్టేటప్పుడు మాత్రం కొన్ని అవసరమైన మాటలు ఆవుసేప్పు చేట్టన్ ఇలా చెబుతాడు.

"ఒరేయ్! నోటికొచ్చిందల్లా తినేసి కడుపు పెంచుకోకు. ఆ అరటిచెట్టు మీద కళ్ళు వేయకు. విన్నావా?"

ఎంతో కష్టపడి రైతులు నాటు వేసుకొన్న అరటినో, కొబ్బరి లేత మొక్కనో అది ససేమిరా ముట్టదు. పైగా వాటిని ఎవడైనా దొంగతనంగా తీసుకొనిపోతోంటే తన కొమ్ముల్ని ఆయుధాలుగా మార్చి వాని వెంటపడి అంతు చూసే దాకా వదలదు. దున్నడం పూర్తి కాగానే దాని దేహానికి వున్న బురదని కడిగి శుభ్రం చేయడమంటే ఆవుసేప్పు చేట్టన్‌కు వల్లమాలిన ప్రేమ.

"ఎడమకాలు కాస్త ఎత్తరా! తల ఎందుకు ఊపుతున్నావు? కొమ్ములు మరీ ఆడించకురా! ఏరా! కాస్త అల్లరి చెయ్యక నించో" అనే ఆవుసేప్పు చేట్టన్ మాటల్లోని ప్రతి పదమూ దానికి అర్థం అవుతుంది. అది ఒక్క కణ్ణన్‌కు మాత్రమే తెలిసిన ఇతర భాష. సాధారణంగా దానికి స్నానం చేయడం అంటేనే అయిష్టం. అయినప్పటికీ ఆ రైతు ప్రేమ ముందర అది తల వంచుతుంది. ఇదంతా చూసి ప్రేమించడం తెలీని రైతులు కొంతమంది ఇలా అంటారు.

"ఏ పోకిరి ఎద్దయినా కానివ్వండి. ఆవు సేప్పు చేట్టన్ తన చేత్తో ఏదైనా పెడితే చాలు, దాని ప్రవర్తనే మారిపోతుంది. అతను ఎద్దులతో ఓ రకమైన రహస్యాలు చెబుతాడట.

అస్తమానం ఆ రైతు తన ఎద్దుల గురించే తిరుగుతాడు. పశు పోషణ గురించి మాట్లాడ్డం అంటే అతనికి విసుగూ, విరామం ఉండవు. అతను అప్పుడప్పుడు ఇలా అడుగుతాడు కూడాను.

“పశు సంపదని అంతా రక్షించాలి. రక్షించాలి అని ఉపన్యాసాలు దంచేవాళ్ళే. కాని వాటి కోసం కనీసం కంచెలు వదులుతున్నారా? మరి ఇలాగైతే ఎలా? గడ్డిపోచలకు బదులు గడ్డాలూ, మీసాలు పెట్టి రక్షిస్తారా పశువుల్ని?” అని

కణ్ణన్ కడుపు నిండిందంటేనే ఆవు సేప్పు చేట్టన్ ఆకలి తీరుతుంది. పశువులు ఆకలితో మలమల మాడితే ఆ ఇంటి ఐశ్వర్యం నశిస్తుందని అతని విశ్వాసం. చివరికి అడవిలోంచి తెచ్చిన ఓ రకమైన దుంపలే తీసుకోండి. వాటిని చిన్నగా కోసి మెత్తగా దంచిన తర్వాతే ఎద్దుకు పెడతాడు. లేక రెండు మొగిలి గుత్తులే కానివ్వండి. వాటిల్లోని ముళ్ళు తీసేసి బాగా దంచాకే ఆవుసేప్పు చేట్టన్ తన ఎద్దు దగ్గరికి తీసుకు వెడతాడు.

అతను బయటికి ఎక్కడికైనా వెళ్ళి తిరిగి వాకిట్లోకి వచ్చి “ఏరా కణ్ణా?” అని పిలుస్తాడు. అతని స్వరం విన్పించడం తరువాయి ఆ ప్రేమమూర్తి అయిన ఎద్దు లేచి నించుంటుంది. అతను దగ్గరికి వెళ్ళేదాకా తలెత్తి చూస్తూ నించుంటుంది. అయితే ఓ పిడికెడు పచ్చిగడ్డి లేదా రెండు పండ్ల తొక్కలు... ఏదైనా ఓ తాయిలంతో అతను దాన్ని సమీపిస్తాడు. అతని చేతిలోంచే అది వాటిని తినేస్తుంది. ప్రేమతో శరీరం నిమురుతోంటే... అది అతని శరీరాన్ని నాకుతుంది. దానికి అతని ఒంటి మీద ఎండిపోయివున్న చెమట వుప్పు అంటే ఎంతో ఇష్టం.

ఎంత సందడిలోనైనా అది అవుసేప్పు చేట్టన్ గొంతు ఇట్టే గుర్తు పట్టేస్తుంది. అతని మాట విన్పిస్తే చాలు అది మబ్బుని చూసిన మయూరమై ఆహ్లాదపడుతుంది. దున్నేటప్పుడు తన వెనకాల కచ్చితంగా ఆవు సేప్పు చేట్టనే వుండాలనేది దాని షరతు. ఇతరులెవరైనా దున్నుతోంటే కొన్ని కొంటె పనులు విధిగా చూపిస్తుంది. ఆ పనులు ఆగాలంటే వాడు పనిలోంచి వెళ్ళిపోవాల్సిందే!

“వద్దురా! మన కుట్టప్పన్ కదూ! నీకు తెలియదూ?” అని ఆవుసేప్పు ఏట్టన్ సంధి వచనాలు మొదలు పెడతాడు. దున్నేటప్పుడు ఓ మాటో, వాక్యమో లేకుండా ఆవు సేప్పు చేట్టన్ రాగాలాపన చేస్తాడు. అది చక్కగా ఆకాశసీమలకు పాకిపోతుంది. “హో... ఓ...ఓ...ఓ...ఓ...ఓ...” అంటూ గొంతు ఎత్తుకుంటాడు. అలా ఆ రాగం ఒకటి రెండు నిమిషాల దాకా వుంటుంది. అందులో ప్రణయ గీతాల్లోనో, శ్రామిక గేయాల్లోనో విన్పించే కూనిరాగపు సహజసిద్ధమైన స్వరం వుంటుంది. లేదా పశువుల ప్రణయం, ప్రణవం అనడం బావుంటుందేమో! ఆవు సేప్పు చేట్టన్ కూనిరాగం తీస్తే

చాలు. ఆ ఎద్దు తన బాధని, అలసటనీ, వేసటనీ మరిచిపోయి పాటలో లీనమవుతుంది. దాని మెడలోని మువ్వల సవ్వడీ, ఎడతెరపిలేని గిట్టల చప్పుడూ... అతని రాగాలాపనకు తాళం వేస్తున్నట్లు వుంటాయి. ఓసారి ఓ తమాషా జరిగింది. ఆ రోజు తుండత్తిల్ కేళన్ కొడుకైన పొచ్చన్ నాగలి పట్టుకున్నాడు. మలేరియా కారణంగా ఆవు సేప్పు చేట్టన్ మంచం పట్టి వున్నాడు. ఆవుసేప్పు చేట్టన్ తన దగ్గర వున్న ఎద్దుల జతను ఇవ్వకపోతే కేళన్ దున్నడం పూర్తి కాదు. అందుకని ఏమైనా కానిమ్మని అతను కణ్ణన్‌నీ, మరో ఎద్దునీ ఇచ్చాడు. ఇతర ఎద్దులతోనూ, తన తోటి ఎద్దులతో పాటూ అది మడిలోకి దిగింది. ఓ చాలు దున్నడం పూర్తయింది. మరో చాలు మొదలెడుతున్న పొచ్చన్‌కు కూనిరాగం తీయాలన్పించింది. ఇంకేం? కణ్ణన్ వెనకాల నించుని పొచ్చన్ రాగాలాపన చేస్తున్నాడు. అసలు వాడికి సంగీతం అంటేనే తెలీదు. మరెందుకు పాడటం అంటే అతనికి పాడాలనిపించింది. అంతే! దరిద్రపు సంగీతం విన్పించడంతోటే కణ్ణన్‌కు మంటగా వుంది. వెంటనే అది తల అటూ ఇటూ ఊపుతూ తన అయిష్టాన్ని ప్రకటించింది. పొచ్చన్ లెక్క చేయలేదు. పైగా దానికి ఇష్టమయ్యే అలా తల వూపుతున్నదనుకున్నాడు. పాడే ప్రతి వ్యక్తీ తన పాట ఇతరులకు నచ్చుతుందనే నమ్మకంతోనే వుంటాడు కదా! కాస్సేపు కణ్ణన్ తన అయిష్టాన్ని అలాగే ప్రకటించింది. పొచ్చన్ ససేమిరా ఖాతరు చేయలేదు. గొంతెత్తి సంగీతాన్ని అవమానించిన పొచ్చన్ కుడికాలి మోకాలి చిప్పకేసి గురిచూసి బలంగా అది ఒక తన్ను తన్నింది. అంతే! అలా ఆ సంగీతజ్ఞుడు ఇంట్లో కూచుని మూడు రోజులు కదలక మెదలక వుండాల్సి వచ్చింది.

దాదాపు పన్నెండేళ్ళు ఎడతెరపి లేకుండా కణ్ణన్ ఆవుసేప్పు చేట్టన్‌కు సాయం చేసింది. ఈ పుష్కర కాలంలో ఎన్నోసార్లు పంటలు కోశారు. హేమంత శిశిరాలూ అనేక పర్యాయాలు వృక్ష లతాదుల్ని తాకి వెళ్ళాయి. భూస్వాములు, రాజదండాలూ, మకుటాలూ... అన్నీ కింద పడిపోయాయి. ఆశ్చర్యకరమైన అనేక మార్పులొచ్చాయి. మనిషిని మనిషి దోపిడీ చెయ్యని కొత్త వ్యవస్థ అంటూ బరువైన మాటలు ఆకాశం దాకా పాకాయి. అయితే... ఆవుసేప్పు చేట్టన్ మాత్రం తన ప్రియాతి ప్రియమైన ఎద్దుల్ని అమ్ముకోక తప్పలేదు. బంగారం పండే భాగ్యకేదారమైన పొలాన్నే తాకట్టు పెట్టాల్సి వచ్చింది. మనఃపూర్వకంగా కాదు, మనస్సున్నా, లేకపోయినా అతను అలా చేసి తీరాల్సిందే! అతను ఓ తండ్రి, పెళ్ళీడు దాటి నించున్న ఓ బిడ్డకి అతను ప్రేమపాత్రుడైన కన్నతండ్రి. వరకట్నం అడుగుతోన్న సాంఘిక దురాచారం అతణ్ణి ఘోరమైన పరిస్థితుల్లోకి నెట్టింది.. పదిహేను వందల రూపాయలకి పొలం రాసిచ్చాడు. అది కట్నానికి

సరిపోయింది. పెళ్ళి ఖర్చులకు వేరే కావాలి. ఆ ఖర్చుల కోసం తనకు ఎద్దులు ఎంత ఇష్టమైనవైనా అమ్మక తప్పింది కాదు.

అతను రాత్రి, పగలు అనకుండా పది, ఇరవై ఏళ్ళుగా కష్టపడుతూనే వున్నాడు. పైగా అతనో మంచి రైతు. కాని ఫలితం? అతని తల వెంట్రుకలు నెరిశాయి. కంటిచూపు మందగించింది. చర్మం ముడుతలు తేలింది. వాతరోగం అతనికి చెలికాడైంది. కత్తితో గుచ్చినా దిగని ఆనెలున్నాయి అతని చేతుల్లో. కాని ఏం చేయగలడు? సుమారు పదివేల ఏళ్ళకు ముందున్న పాత పనిముట్లతోనే అతని వ్యవసాయం సాగింది. రానురానూ భూసారం తగ్గిపోయింది. ఎరువులూ లేవు. మహత్తరమైన యజ్ఞం లాంటి వ్యవసాయానికి సాయం కోసం వరుణ దేవుడితోనూ, మేఘాలతోనూ, పర్వతాలతోనూ, వాయుదేవునితోనూ మొరపెట్టుకుంటూ అతను ఋగ్వేద స్తోత్రాలు ఆలపించసాగాడు. ఆ ప్రార్థనా కాలం నాటి అసహాయ పరిస్థితుల్లోంచి అతను ఇంకా బయటపడలేదు. కాని అతన్ని అవమానించే వ్యాపారులూ, దోపిడీ పద్ధతులూ దిన దినం బాగా అభివృద్ధి చెందాయి.

కణ్ణన్‌ను అమ్మి పగ్గం అప్పచెప్పాక ఆవుసేప్పు చేట్టన్ అక్కడ నించోలేదు. పగ్గం అప్పగించాక కొన్న వ్యక్తులు ఓ రూపాయి ఇవ్వడం రివాజు. ఎన్ని రూపాయలైనా వెల కట్టలేని కన్నీళ్ళతో అతను వెళ్ళిపోయాడు. తన యజమాని ఇంటిలోంచి వెళ్ళిపోవడానికి కణ్ణన్‌కు ఎంతమాత్రం మనస్కరించలేదు. అది తన ప్రాణానికే ప్రాణమైన ఆవుసేప్పు చేట్టన్‌ను చూడటానికి తల ఎత్తింది. సరిగ్గా ఆ సమయంలోనే దక్షిణం వేపున్న పనసచెట్టు నీడలో కళ్ళు తుడుచుకుంటూ ఓ మనిషి నించుని వున్నాడు. అతనికిప్పుడు మాటలు కరువయ్యాయి. అతని గుండె బరువు దింపుకోవడానికి ఇప్పుడతనికి ఎవ్వరూ లేరు.

వాస్తవమైన ప్రేమని ప్రకటించడానికి మాటలు చాలవు. నిజానికి కణ్ణన్‌లాంటి ఎద్దులూ, ఆవుసేప్పు చేట్టన్ లాంటి రైతులూ ఈ భూమండలంలో లేరనవచ్చు. అందుకే ఆ రెండు హృదయాలు విడిపోవడానికి బాధపడుతున్నాయి.

ఆ తర్వాత్తర్వాత కొంతమంది రైతులు వయనాడన్ అడవుల్లోకి బయల్దేరారు. ఎంత చిత్రం! సొంత ఊళ్ళోనే అవమానించబడి అసహాయులై వలస వెళ్ళిపోతున్నారు.

“ముక్కూ, మొహం తెలియని ఊరు. తోబుట్టువులకో, కావాల్సిన వాళ్ళకో దగ్గర వున్న ప్రాంతం కాదు. వయనాడన్ అడవులు మలేరియా జ్వరాలకు ప్రసిద్ధి.

ఓ ఆవుసేప్పు చేట్టన్! ఎలా? ఏం చేద్దాం! తెలిసీ తెలిసీ ఎలా వెళదాం?" పొరుగింటి కిట్టుళ్ళార్ అన్నాడు.

"మరేం చేయగలం? నాకు భూమిలో సారం వున్న పచ్చి మన్ను తెచ్చిపెట్టు. మట్టి వాసన లేకపోతే నా మనస్సు మండిపోతుంది." ఆవుసేప్పు చేట్టన్ అలా తెలిపాడు.

వేదన నిండిన ఆ రైతు జీవితం గమ్యం లేని సుడిగాలిలా సాగిపోతోంది. ఇదిగో ఇవాళ, రేపు అంటూ ఆ మలబార్ ప్రయాణం వాయిదా పడుతోంది. అంతేకాదు, వున్న ఏడు సెంట్ల భూమిని తగిన ధరకి అమ్మేయాలి. మరో సమస్య కూడా వుంది. ఆవుసేప్పు చేట్టన్ కూతురు కత్రిక్కుట్టి. ఆమె గర్భవతి. తొలి ప్రసవం. ఆ పసిముఖం చూశాకే బయల్దేరదాం అనుకున్నాడు ఆవుసేప్పు చేట్టన్.

ఆ రోజు వ్రతం విడుపు దినం. క్రైస్తవులకు సంబంధించినంతవరకు ఎంత దరిద్రుడి ఇంటిలోనైనా ఆ రోజు సంతోషకరమైన దినం. వంటింటి నుంచి చవులూరించే మాంసపు వాసనలు వ్యాపించే రోజు. పింగాణీ పాత్రల్లోంచి బెల్లపు అప్పాల ఘుమఘుమాయింపులు. కొబ్బరి నూరు, కరివేపాకు కలిపిన వేడి వేడి మాంసపు కూరా, తెల్లని బెల్లపు అప్పాలు వుంటే... అది బ్రహ్మాండంగా వుంటుంది. ఆ శుభదినం నాడు పై వంటకాలు లేకపోతే ఏదో వెలితి. కాని ఆవుసేప్పుచేట్టన్ దీర్ఘనిశ్వాసం వదిలి కూచున్నాడు. దూరంగా ఎక్కడో దున్నుతున్నట్టున్నారు. అక్కణ్ణించి మట్టి వాసన, ఎద్దుల అలికిడి వినవస్తున్నాయి. అతని మనస్సు మనస్సులో లేదు. పశువుల పాకలో పైన సాలెగూటిలో చిక్కుకుపోయిన తన ప్రియమైన నాగలిని చూసి మనస్సు చివుక్కుమంది. పెద్దగా నిట్టూర్చాడు.

"కణ్ణన్‌లాంటి రెండు ఎద్దులూ, నాలుగైదు ఎకరాల పొలమూ, ఈ నాగలీ... నా దుఃఖభరితమైన బతుకులో మళ్ళీ కొత్త వసంతాన్ని తీసుకురాగలవా?" అనుకున్నాడు. హాఁ... అలాంటి అదృష్టానికి నోచుకున్నావా మళ్ళీ' అని నిస్సహాయుడైన ఆ రైతు ఉస్సురన్నాడు.

ఇలాంటి విషయాల గురించి భర్తతో పాటు మఱియచ్చేడత్తి కూడా బాధపడుతోంది. ప్రసవానంతరం చేసే మర్యాదలతో సహా కూతురును, శిశువుని మరునాడే అత్తవారింటికి పంపాలి. మగబిడ్డే! ఒకందుకు మంచిదైంది. మగవాడు కాబట్టి బంగారంతో అవసరం లేదని సంతోషించారు. కాని ఓ వెండి వడ్డాణమైనా శిశువు నడుముకి చుట్టాలి. ఓ డ్రస్సు సైతం అవసరమే!

డబ్బుల కొరత కారణంగా ఆ దంపతుల కూతురైన కత్రికుట్టికి కనీసం అవసరం మేరకు ఓ చీరో, జాకెట్టో ఏదీ పెట్టలేదు. ఆ విషయాన్నే పదే పదే ఎత్తి చూపుతూ ఆమె అత్తగారూ, ఆడబిడ్డలూ ఆక్షేపిస్తున్నారు. ఎలాగైనా ఆమెకో చీరా, మూడు జాకెట్టులూ కొని తీరాల్సిందే. ఇంకా ఓ పెట్టె, ఫలహారాలు, పాడి ఆవు... ఇలాంటి లాంఛనాలు లేకపోయినా ఫరవాలేదు. అత్యవసరమైనవి ఇవ్వకపోతే ఎలా? ఇదంతా ఎలా వెళ్ళదీయడం అని ఆవుసేప్పు భార్య మథనపడుతోంది. అయితే ఆ మాతృ హృదయానికి చప్పున ఓ విషయం గుర్తుకు వచ్చింది. ఆమెకు ఓ చిట్టీ వుంది. కాస్త పొదుపుగా ఆమె చిట్టీ వేసింది. ఆ నెల డ్రా ఆమెకే తగిలింది. నలభై రూపాయలు. ఆవుసేప్పు చేట్టన్‌కు ఇది తెలీదు. దుఃఖభారంతో కూచున్న భర్తని చూసి మఱియచ్చేడత్తి "మీరు మనిషేనా? మునిలాగా ఇలా కూచుంటే ఎలా? బిడ్డని రేపు పంపించొద్దా? నేను ఓ చిట్టీ వేశాను. దేవుని దయతో ఈ నెలలో నాకు వచ్చింది. నలభై రూపాయలున్నాయి. కొట్టాయం వెళ్ళి అత్యవసరమైనవి కొనండి" అంది.

ఆవుసేప్పు చేట్టన్‌కు కొండంత ఊరట కలిగింది.

"తెలివంటే నీదేనే!" అంటూ హృదయపూర్వకంగా భార్యని అభినందించాడు. నిజానికి అతనే కూతురు ఖర్చుకి సంబంధించిన ఏర్పాట్లు చూసుకోవాలి. తనకు ఆ పని చేతకాకపోయింది. ఆ గడ్డు సమస్యకు భార్య పరిష్కారం కనిపెట్టింది. సంతోషంగా ఆకు వేసుకోవడానికి ప్రయత్నిస్తూ అతను "సరి.... వెళతాను" అన్నాడు.

"నాన్నా! నా జాకెట్టు గుడ్డకు కాస్త జరీ వుండనీ!" కత్రికుట్టి తండ్రికి సూచన ఇచ్చింది.

"అన్నట్లు..." పన్ను కట్టలేదు. అది కూడా చెల్లించిరండి. మఱియచ్చేడత్తి గుర్తు చేసింది.

"అన్నింటికీ ఇదే కదా సొమ్ము" అతను ఫిర్యాదు చేస్తున్నట్లు అన్నాడు.

"ఏమైనా ఫరవాలేదు. నాకూ రెండు జాకెట్లు కావాలి" అంది మఱియచ్చేడత్తి.

"బిడ్డకు చీరా, జాకెట్లు, నీకు రెండు జాకెట్టు గుడ్డలూ, పైగా పన్ను కూడా చెల్లించాలి. మొత్తం నా దగ్గరుంది నలభై రూపాయలు. ఓ పని చెయ్యి. నువ్వే కొట్టాయం వెళ్ళు. నాతో కాదు" అన్నాడు ఆవుసేప్పు చేట్టన్.

"ఆడవాళ్ళు ఇంటి పనులు చూడ్డానికే! బయటివన్నీ మీవి. అందుకని చిన్నప్పుడు నన్ను ఓ మీసాలున్నోడి చేతిలో పెట్టింది. అయితే ఓ పని చెయ్యి. వంటింట్లో దూరి పొయ్యి ఊదుతూ, బోళ్ళు తోముతూ కూచో! అదీ మీసాలు పెట్టుకుని."

తల్లి మాటలు విని కత్రికుట్టి నోరు మూసుకుంటూ వచ్చే నవ్వు ఆపుకుంది. ఆవుసేప్పు చేట్టన్ చంకన గొడుగుతో, భుజాన తుండుగుడ్డతో, నడుముకు డబ్బులు చెక్కుకొని బయలుదేరాడు.

వ్రతం విడుపు దినం కొట్టాయంలోనూ కోలాహలంగా వుంది. క్రైస్తవుల కొట్లు ఏవీ తెరవలేదు. అయినా ఇతర బట్టల కొట్లు బోలెడు వున్నాయి. ఒకటి, రెండు కొట్లలో దూరి కొన్ని రకాల గుడ్డలూ, వాటి ఖరీదులూ కనుక్కున్నాడు.

"అయ్యయ్యో! ధరలు మండిపోతున్నాయి" అనుకున్నాడు. గుడ్డలకు ఇంతేసి ధరలుండాల్సిన అవసరం లేదని ఆ వృద్ధుని అభిప్రాయం. ఏమైనా రద్దీ తగ్గిపోనీ అనుకున్నాడు. ఎక్కడైనా ఓ అణా తగ్గింపు ధరలకు దొరకవా అనుకుంటూ నడక ప్రారంభించాడు. అలా అతను మున్సిపాలిటీ భవనమ్ముందరికొచ్చాడు. అక్కడ గోడకు బయట కొన్ని ఎద్దుల్ని ఒకే వరసన కట్టి వుంచారు. వాటి ప్రతీ పక్కటెముకనీ లెక్కించడానికి వీలున్నట్లు... తోలూ... ఎముకలూ మాత్రమే మిగిలిపోయిన ఆకారాలు అవి. చివరికి ఓ ముసలి ఎద్దు వుంది. దాని తోకకూ, ఇతర అవయవాలకు పుళ్ళు. దాని వీపు మీద ఇరువైపులా గట్టిబారిన ఆనెలున్నాయి. ముదిరి విరిగిపోయిన కొమ్ములతో వుంది. అది మానవజాతిలో లోపించిన జీవ కారుణ్యాన్ని ఎత్తి చూపుతోంది. ఇలా అక్కడ ఎన్నో ఎద్దులున్నాయి. ఆ ఎద్దులన్నీ మనిషి దివాళాకోరుతనాన్ని ప్రదర్శిస్తున్నాయి. అన్నింటి మీదా మున్సిపాలిటీ తాలూకు నల్లని మరణ ముద్రలున్నాయి. వ్రతం విడుపు దిన సందర్భంగా మనుషులకు అవసరమైన మాంసం వాటి శరీరాల్లో మిగిలిపోయి వుంది. మున్సిపాలిటీ అధికారులు ముద్ర వేయని పశువుల్ని కోసినట్లయితే, కసాయి వాళ్ళ మీద కేసులు పెడతారు. అన్నింటికన్న మిక్కిలి సాధారణ ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించే మున్సిపాలిటీకి పై పశువుల్ని మాంసానికి యోగ్యమైనవా, కావా అని పరిశోధించే పనిలో ఏమాత్రం వెసులుబాటు లేదు. అలా కానట్లయితే కసాయివాళ్ళు కనిపించిన ప్రతిదాన్నీ కోసి అమ్ముతారు. ఆ సందర్భంగా మున్సిపాలిటీ వాళ్ళ అత్యున్నత సేవ ఆ మరణ ముద్రల్లో కన్పిస్తోంది. ఆ ఎద్దుల్లో చాలావాటికి ఓ రకంగా ఊరటగానే వుంది. కారణం... అలాగైనా తమ జీవితాలకు విముక్తి లభిస్తోందని అవి ఆనందంగా

వున్నాయి. మంచి ప్రాయంలో అవి శక్తివంచన లేకుండా శ్రమించాయి. అవసరం తీరిపోయాక ఆ మూగజీవులు నిందలకూ, తిట్లకూ, క్రూరత్వానికి గురవుతున్నాయి. నిందలూ, క్రూరత్వమూ నిండిన జీవితం కన్న మరణం ఎంత ఉత్తమం! ఆవుసేప్పు చేట్టన్ ఆ ఎద్దుల్ని చూసి కాసేపు అలాగే నిలచున్నాడు. అతని హృదయంలో ఒదిగి వున్న జీవకారుణ్యం వేదనకి గురైంది. మొత్తం ముప్పై, నలభై పశువులున్నాయి. కొందరు ఆ ముద్రల కోసం పశువుల్ని తీసుకొస్తున్నారు. మరణ దండన విధించబడిన మిత్రుల్ని చూస్తున్నట్లు, ఒక్కో పశువుని చూస్తూ ఆవుసేప్పు చేట్టన్ ఉత్తరం వేపు నడవసాగాడు.

ఆశ్చర్యం! అతను అపాదమస్తకం వణికిపోయాడు. దృష్టి మందగించిన తన కళ్ళు కొంపదీసి మోసం చేయడం లేదు కదా అనుకున్నాడు. చిక్కిపోవడంలో నేనంటే నేనని తోలూ, ఎముకలూ పోటీ పడుతోన్న ఆ పశువు మీద అతని దృష్టి మరోమారు నిలిచింది. అంతే! అతని గుండెల్లో నొప్పి. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. శరీరం స్వాధీనం తప్పుతోంది. అవును – ఆ ఎద్దు అతని ప్రియాతి ప్రియమైన కణ్ణన్.

"కణ్ణా!" ప్రేమతో నిండిన అతని గుండె అట్టడుగు పొరల్లోంచి తన్నుకొచ్చింది ఆ పిలుపు. ఒక్కుదుటున అతను దాన్ని సమీపించాడు. ఏ మాటవుతే దాని చెవులకు ఆహ్లాదాన్ని, ఆవేశాన్ని ఇవ్వగలదో, ఆ మాటే అతని నోట వెల్వడింది. బ్రహ్మాండమైన ఆ మున్సిపాలిటీ భవనమ్ముందర అది వంచిన తల ఎత్తకుండా వుంది. జీవితం మీది ఆశలు మళ్ళీ దాని చెవుల్లో మార్మోగుతున్నాయి. అది తలెత్తి నలువేపులా చూసింది.

"కొడుకా! నువ్వు నన్ను గుర్తుపట్టావురా? నిన్ను ఈ పరిస్థితుల్లోనా నేను చూడాల్సి వచ్చింది" ఆ పశువు తలని ప్రేమ పొంగులు వారుతోన్న తన హృదయానికి హత్తుకున్నాడు. దాని నెత్తినీ, కనుబొమల్నీ తడిమాడు. అతని కరతల స్పర్శ సోకడం తరువాయి, దాని తోక లేచింది. నిశ్శబ్దమైన హృదయంతో అది నిట్టూర్చింది. కణ్ణన్ శరీరం మీద ముద్ర వేశారా అని అతడు పరిశీలించాడు. అదుగో! ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. అది చెరిగిపోతే ఎంత బావుణ్ణు! చెరిగిపోయేందుకు ఆ ప్రేమమూర్తీ, త్యాగశీలీ అయిన రైతు భగీరథ ప్రయత్నం చేశాడు. మున్సిపాలిటీ వాళ్ళు వేసిన నల్లని ముద్ర అంత సులువుగా చెరిగిపోయేది కాదు కదా! కణ్ణన్ కడుపు కింద ఓ వ్రణం వుంది. ఈగలు జుయ్యిన ముసురుతున్నాయి.

"నీ ఎద్దేనా ఇది?" కసాయి వాళ్ళలో ఒకడు ఆవుసేప్పు చేట్టన్‌ని అడిగాడు.

"నువ్వేనా దీన్ని తీసుకొచ్చింది?"

"అవును"

చెమటలు పట్టి వున్న ఆవుసేప్పు చేట్టన్ గుండెల్ని ఆ ఎద్దు నాకసాగింది. అలా అతని చెమట నాకి అతని శరీరం చల్లబరచడంలో అది తన జీవిత కాలమంతా శ్రమించింది. అంతిమ ఘడియల్లోనూ ఆ మూగ జీవి అతని చెమట వాసనని ఆస్వాదిస్తోంది. దాని జీవితంతో ముడిపడివున్న చెమట అది. వృద్ధుడైన ఆ రైతు వేడి వేడి కన్నీటి బొట్లు కణ్ణన్ ముఖమ్మీదికి దారం తెగిన ముత్యాల్లా జారిపడుతున్నాయి.

"దాన్ని వదిలేసెయ్! ఇప్పటికే ఆలస్యమైంది. పగటికల్లా దీన్ని మాంసం కొట్టులో ఇవ్వాలి." కసాయివాడు తాఖీదు ఇచ్చాడు. అవును... మరో రెండు, మూడు గంటల్లోగా కణ్ణన్ వ్రతం విడుపు దినానికి మాంసంగా మారబోతోంది.

పొద్దు పోయింది.

"ఒసేవ్! దీపం పెట్టడానికి ముందు కాస్త అరుగు శుభ్రంగా ఊడ్చిపెట్టు" ఆవుసేప్పు చేట్టన్ కోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తోన్న మఱియచ్చేడత్తి తన కూతురితో అంది.

"ఎందుకమ్మా, నాన్న ఇంత ఆలస్యం చేస్తున్నాడు?" కత్రి అడిగింది.

"ఊరుకి వెళ్ళినవాడు కదా! వస్తారులే!!" మఱియచ్చేడత్తి జవాబు చెప్పింది.

"కొట్టాయం వెళితే ఇప్పటికే రావాలి కదమ్మా!" చీరా, జాకెట్టు గుడ్డలూ చూడాలన్న ఆశతో ఎదురుచూస్తోన్న కత్రి అసహనంగా అంది. ఆమె కళ్ళన్నీ తండ్రి వచ్చే దారిలోనే పరచుకొని వున్నాయి. మఱియచ్చేడత్తి కూడా చూస్తోంది. ఆవుసేప్పు చేట్టన్ పత్తా లేదు. దీపాలు ముట్టించారు.

"అమ్మా! నాన్న వస్తున్నాడు. అదుగో! నాన్నే!!" సంతోషంగా అరిచింది కత్రి. ఆమెలో మొదట నాన్నని చూసింది తనేనన్న గర్వమూ వుంది. ఏకాగ్రతతో తల్లీ, కూతుళ్ళు ఇద్దరూ పరికించారు.

"ఆవుసేప్పు చేట్టన్ కదా?" పొరుగింటి మాత్తు అడిగాడు. అతనికి కుట్టు పని తెలుసు. జాకెట్లు మూడు రాత్రికి రాత్రే కుట్టాలి. కత్రి పొద్దుటే వెళ్ళిపోవాలి. అందుకని మాత్తుని ముందే పిలిచి ఆ పని సమ్మతింపచేశారు తల్లీ కూతుళ్ళు.

గుడ్డల మూటను కళ్ళారా చూడాలని ఆత్రుత పడుతోన్న తల్లీ కూతుళ్ళ ముందు ఆ కుటుంబ యజమాని తీరా కణ్ణన్‌తో ప్రత్యక్షమయ్యాడు.

"అయ్యో! కణ్ణన్" కత్రి ఆశ్చర్యంగా అంది.

"గుడ్డలెక్కడ?" మఱియచ్చేడత్తి ప్రశ్నించింది.

కణ్ణన్ తన పాత ఇంటి వాకిట్లోకి రాగానే ఆనందంతో గంతులేసింది. ఆ తర్వాత నిట్టూర్చింది.

ఇంకేం ? ప్రశ్నల పరంపర!

ఆవుసేప్పు చేట్టన్ మూగవాడై గడ్డానికి చేతులు ఆనించి కూచుని వున్నాడు. మఱియచ్చేడత్తి చిందులు తొక్కుతోంది. బట్టలు తేలేదన్న బాధ భరించలేక కత్రి ఏడుపు లంకించుకుంది. ఆ నేరస్తుడు ఒక్క అక్షరం సైతం మాట్లాడలేదు. చెమటతో అతని శరీరం పూర్తిగా తడిసిపోయింది.

"బిడ్డా!" అతను కంఠం రుద్ధమవుతోంటే పిలిచాడు, కూతుర్ని.

"నాకు నీలాగే ఇది కూడాను. ఆ కసాయివాడు..." తుండుతో ఆ దుఃఖితుడు కళ్ళు తుడుచుకున్నాడు. ఆ మాట పూర్తి చేసే సామర్థ్యం అతనికి కరువైంది.

ఆ రాత్రి మహా క్రూరంగా గడిచింది. క్షణమొక యుగంగా నిద్రపోకుండానే నెట్టుకొచ్చారు.

తూరుపు తెలతెలవారుతోంది. కణ్ణన్ కడుపు క్రింది వ్రణానికి ఓ మందు సిద్ధం చేసుకొని ఆ రైతు పాకలోకి నడిచాడు. అది దివ్యమైన ఔషధం. పశువుల రోగాలకు ఆవుసేపు చేట్టన్‌కు బాగా తెలిసిన వనమూలికలు బోలెడు వున్నాయి. అతను తెల్లవారకముందే మందు తయారు చేసుకొని తీసుకొచ్చాడు. ఆ మందుతో అతను పశువుల పాకలోకి వెళ్ళాడు. నాలుగు కాళ్ళూ బారచాచి, "మెడలు పైకి పెట్టి" కణ్ణన్ పడుకుని వుంది.

"కణ్ణా! ఒరేయ్!!" అతను ముద్దుగా పిలిచాడు. ఆ ఎద్దు ఇంక లేవదు. బహుశా నిర్భాగ్యురాలైన తన గురించి ఆ కుటుంబం గొడవ పెట్టుకోవడం, బాధపడటం చూడకుండా వుండేందుకు కావచ్చు, అది వెళ్ళిపోయింది.

కణ్ణన్ మృతదేహానికి, వేదన అనుభవిస్తోన్న ఆ రైతు హృదయానికీ మీద సాలీడు గూటితో అల్లుకుపోయిన ఆ నాగలిపై వున్న బల్లి ఏదో పలికింది.



## మాధవి కుట్టి (కమలాదాస్)

**జ**ననం : 31-3-1934 వున్నయూర్ కుళంలో) మలయాళ కథలూ, ఆంగ్ల కవితలూ రాస్తుంది. ఈమె ప్రతి పదంలోనూ విరహిణి రాధ హృదయం వుట్టిపడుతుంది. స్త్రీ పురుష సంబంధాల పారిశుధ్యాన్ని ప్రదర్శించిన ప్రథమ కథా రచయిత్రి. వీరి తల్లి సైతం ప్రసిద్ధ కవయిత్రి (నాలప్పాడ్ బాలామణి అమ్మ). మాధవిక్కుట్టి గట్టి రచయిత్రే కాక వివాదాత్మక రచయిత్రి కూడా. ఆసియా దేశాల ఇంగ్లీషు కృతులకు ఇచ్చే కెంట్ అవార్డు ఈమె రాసిన 'సమ్మర్ ఇన్ కలకత్తా'కి వచ్చింది. ఆశాన్ వరల్డ్ ప్రైజ్ 'కలెక్టెడ్ పోయమ్స్'కి లభించింది.

# పక్షి వాసన

**- మాధవి కుట్టి**

**ఆ**మె కలకత్తాకు వచ్చిన వారం రోజులకి మార్నింగ్ ఎడిషన్ పేపర్లో ఓ ప్రకటన చూసింది. "చక్కని తెలివితేటలూ, అందచందాలూ వున్న యువతి మా టోకు వ్యాపారానికి ఇన్‌ఛార్జిగా అవసరముంది. గుడ్డల రంగుల గురించీ, కొత్త కొత్త డిజైన్ల గురించీ కొంతైనా తెలిసి వుండాలి. స్వంత దస్తూరితో రాసిన దరఖాస్తులతో నేరుగా మా ఆఫీసుకు రావాలి."

ఆ ఆఫీసు భవనం ఎప్పుడూ జనంతో కిటకిటలాడే ఓ వీధిలో వుంది. ఆమె లేత పసుపు పచ్చని రంగులో వున్న పట్టుచీర కట్టుకుంది. భుజానికి తెల్లని బ్యాగ్ వుంది. ఆ భవనం దగ్గరికి వచ్చేసరికి సమయం పదకొండు గంటలైంది. అది ఏడు అంతస్తులతో, రెండొందలకి మించిన గదులతో, ఎన్నో వరండాలతో వున్న భారీ కట్టడం. అందులో నాలుగు లిఫ్టులున్నాయి. ప్రతి లిఫ్టు ముందూ బోలెడు మంది గుమికూడి వున్నారు. వాళ్ళలో బొజ్జలు పెరిగిన వ్యాపారులూ, భుజాన సంచులతో ఉద్యోగులూ వున్నారు.  కాని ఒక్క స్త్రీ సైతం కన్పించడం లేదు. ఆమె ధైర్యం బాగా సన్నగిల్లింది. తన భర్త అభిప్రాయాన్ని ఖాతరు చేయకుండా ఈ ఉద్యోగానికి వచ్చి వుండాల్సింది కాదు అనిపించింది. ఆమె తన సమీపంలో వున్న ఓ వాచ్‌మెన్‌తో...

"టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ ఎన్నో అంతస్తులో?" అంది.

అతను "ఒకటో అంతస్తులో అనుకుంటాను" అన్నాడు. అందరి చూపులూ తన మీదే వాలుతున్నాయని ఆమె గమనించింది. ఛీ! ఇక్కడికి వచ్చి ఉండాల్సింది కాదు. ఈ పురుష ప్రపంచంలోకి తనెందుకు వచ్చినట్లు? వెయ్యి రూపాయల జీతమిచ్చినా

రోజూ తనిక్కడికి రావడం కష్టసాధ్యం అనుకుంది. అలాగని వెంటనే తిరిగి ఇంటికి వెళ్ళలేకపోతుంది.

ఆమె వంతు వచ్చింది. లిఫ్టులో ప్రవేశించింది. తన దగ్గర నిల్చున్న వారి శరీరాలకు తాకకుండా అతి కష్టమ్మీద ఓ మూలకు ఒద్దికగా వుంది.

ఒకటో అంతస్తులో దిగి చుట్టూ కలయచూసింది. నలువేపులా విశాలమైన వరండాలున్నాయి. ఒక్కో గదికీ పెద్ద పెద్ద తలుపులు. ప్రతి గుమ్మానికీ ఒక్కో బోర్డు.

"ఎగుమతులూ, దిగుమతులూ"

"వైన్ వ్యాపారం..." అలా అనేక బోర్డులున్నాయి.

అయితే ఎంత నడిచినా, ఎన్ని గదుల్ని దాటి వెళ్ళినా తను అన్వేషిస్తోన్న బోర్డు జాడ లేదు. అప్పటికే ఆమె అరచేతులు చెమటపట్టాయి. అప్పుడే ఓ గదిలోంచి బయటికి వస్తోన్న మనిషిని "టెక్స్‌టైల్ కంపెనీ ఎక్కడ?" అని అడిగింది.

అతను ఆమెను ఆపాదమస్తకం పరికించాడు. అతని కళ్ళు చిన్నగా, ఎర్రగా వున్నాయి. తర్వాత "నాకు తెలియదు. కాని వెంట వస్తే వాచ్‌మన్‌ను అడిగి చూపిస్తాను" అన్నాడు. అతను పొడగరి కాదు. మధ్య వయస్కుడు. అతని గోళ్ళ నిండా మురికి వుంది. వాటిని చూసో, ఏమిటో గాని ఆమెకు అతని వెంట వెళ్ళేందుకు మనస్కరించలేదు.

ఆమె 'థాంక్స్! నేను కనుక్కుంటాను లెండి!" అంది.

వేగంగా నడిచి ఓ మూల తిరిగి మరో వరండాలోకి మళ్ళింది. అక్కడ కూడా మూసివున్న పెద్ద పెద్ద తలుపులున్నాయి. Dying అని రాసిన బోర్డును అక్కడ వేలాడదీశారు. స్పెల్లింగ్ తప్పు చూసి ఆమె నవ్వు ఆపుకోలేకపోయింది.

"గుడ్డలకు రంగులు వెయ్యడానికి బదులు ఇక్కడ చావులు సంభవిస్తున్నాయా?" అనుకుంది. ఎందుకైనా కనుక్కోవడం మంచిదనుకుని తలుపులు తట్టింది. లోన శూన్యంగా మిగిలిపోయిన ఓ వసారా వుంది. రెండు, మూడు కుర్చీలూ, ఓ చిల్లులు పడ్డ బల్లా... అంతే వున్నాయి. అక్కడ ఎవ్వరూ లేరు.

"ఇక్కడ ఎవరూ లేరా?" అంది.

లోపలి గదికి వున్న కర్టెన్లు మెల్లగా ఒకింత కదిలాయి. అంతే! ఆమెకు ధైర్యం వచ్చేసింది. గది మధ్యలో వున్న కుర్చీలో కూచుంది. కాస్త విశ్రమించకుండా అడుగు కూడా ముందుకు వెయ్యలేను అనుకొంది. పైన ఫ్యాను తిరుగుతోంది. "ఇది ఏ ఆఫీసో?"

అని ఆశ్చర్యపోయింది. తలుపులు తెరిచి పెట్టడమే కాకుండా ఫ్యాను కూడా వేసి పెట్టారు. ఇక్కడ వున్నవాళ్ళు ఎక్కడికి వెళ్ళినట్లు?

గుడ్డలకు రంగులు అద్దేవాళ్ళు కావడం వల్ల వీళ్ళకి తను అన్వేషిస్తున్న ఆఫీస్ ఎక్కడ వుంటుందో తెలియకుండా పోదు. ఆమె బ్యాగ్ తెరిచి అద్దంలో ఓమారు తన ముఖం చూసుకుంది. తనకు అందచందాలున్నాయని నిశ్చయించుకుంది. ఎనిమిది వందల రూపాయలు జీతంగా అడిగి చూస్తే ఎలా వుంటుంది? అనుకుంది. తనలాంటి ఉద్యోగిని దొరకడం వాళ్ళ అదృష్టమే మరి! చదువుకుంది. హోదా వుంది. విదేశీ పర్యటనల్లో గడించిన ప్రపంచ పరిజ్ఞానం వుంది.

సీసాల బిరడాల్ని లాగుతూ తెరుస్తోన్న ఏదో శబ్దం విన్పించడంతో ఆమె తన ఆలోచనల్లోంచి తేరుకొని ఈ లోకంలోకి వచ్చింది. ఛీ! తనెంత మూర్ఖురాలు! అసలే పరిచయం లేని స్థలంలో కూచుని మగతలోకి జారిపోవడమా? ఆమె కళ్ళు తిప్పుతూ చుట్టూ గమనించింది. ఎదుట వున్న కుర్చీలో ఓ యువకుడు సోడాలో విస్కీ కలుపుతున్నాడు. అతని బుష్ షర్టు తెల్లని టెర్లిన్‌తో వుంది. అతని చేతివేళ్ళ పై భాగంలో బిరుసైన రోమాలున్నాయి. బలమైన ఆ చేతివేళ్ళు చూసి ఆమె నివ్వెరపోయింది. ఈ సైతాన్ ఇంట్లోకి తనెందుకు వచ్చినట్లు?

అతను తలెత్తి ఆమెను ఎగాదిగా చూశాడు. అతని ముఖం గుర్రంలా పొడుగ్గా వుంది. “హాయిగా నిద్రపోయారా?” అన్నాడతను. ఆమె జవాబు కోసం ఎదురు చూడకుండా గ్లాసు ఎత్తి అందులోని ద్రవమంతా గడగడా త్రాగాడు.

“ఆకలేస్తోందా?” అతనడిగాడు. ఆమె లేదని తలూపింది.

“టెక్స్‌టైల్ కంపెనీ ఎక్కడో చెబుతారా? మీకు తెలుసనుకుంటాను. మీరు గుడ్డలకు రంగులు అద్దేవాళ్ళు కదా!” అంది. పైగా మర్యాద కోసం నవ్వింది. అతను నవ్వలేదు. మళ్ళీ విస్కీని గ్లాసులో పోశాడు. సోడా కలిపాడు. ఎంతోసేపు మౌనంగా వున్నాడు.

ఆమె “మీకు తెలీదా?” అంది. ఆమెకు అసహనంగా వుంది. ఎలాగైనా అక్కణ్ణించి బయటపడి ఇంటికి వెళ్ళిపోతే చాలు అనుకుంది.

అతను వున్నట్లుండి నవ్వాడు. చాలా పల్చని పెదాలు అతనివి. అవి ఆ నవ్వులో విరూపతని విలీనం చేశాయి.

"ఎందుకంత తొందర?" అతను ప్రశ్నిస్తూ "టైమ్ పదకొండు ముప్పావే కదా" అన్నాడు.

ఆమె గుమ్మం వేపు కదిలింది.

''నాకు కావలసిన అడ్రస్ మీకు తెలుసనుకొని వచ్చాను'' అంటూ "మీకూ గుడ్డల వ్యాపారంతో సంబంధం వుంది కదా!" అంది.

''ఎలాంటి సంబంధం? మేం గుడ్డలకు రంగులు అద్దేవాళ్ళం కాదు. బోర్డు బాగా చదవలేదూ? Dying అని వుంది."

"అంటే...?"

"అదే అర్థం." చావడం అని తెలీదూ? మేము ఇక్కడ "హాయిగా చచ్చిపోయే ఏర్పాట్లు చేస్తాం."

అతను కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు చిన్నవి చేస్తూ నవ్వాడు. ఉన్నపళంగా అతని తెల్లని చిర్నవ్వు తన కళ్ళలోకి పాకుతున్నట్లు ఆమెకు అన్పించింది. ఆమె కాళ్ళు కంపిస్తున్నాయి.

ఆమె గుమ్మం వేపు దౌడు తీసింది. అయితే... చెమట పట్టిన చేతులు కావడంతో తలుపులు తెరవడం చేతకావడం లేదు. అప్పటికే ఆమె రెండు కళ్ళు నిండు కుండలయ్యాయి.

"దయచేసి కాస్త తీసిపెట్టరూ?" అంది.

"నేను ఇంటికి వెళ్ళాలి. నాకోసం పిల్లలు ఎదురు చూస్తూ వుంటారు" అంది మళ్ళీ.

అతను తన మాటలు విని క్రూరమైన ఆలోచనలు మానుకొని తనకు సాయం చేయడానికి వస్తాడని ఆశించింది. అతను మళ్ళీ మళ్ళీ విస్కీ తాగాడు. మళ్ళీ మళ్ళీ ఆమెను చూస్తూ నవ్వాడు.

ఆమె తలుపుల్ని అదే పనిగా తట్టసాగింది.

"అయ్యో! నన్ను మోసం చేస్తున్నారా?" ఆమె గట్టిగా పిలుస్తూ "ఇంతకీ నేను ఏం తప్పు చేశాను?" అంది.

ఆమె వెక్కి వెక్కి ఏడ్వడం కొన్ని నిమిషాల తర్వాత తగ్గిపోయింది. అలసి సొలసి పోయి గుమ్మం దగ్గర ఉత్త నేలమీద పడిపోయింది.

అతను ఎలాంటి కాఠిన్యమూ లేని మృదువైన కంఠస్వరంతో ఏవేవో మాట్లాడుతున్నాడు. వాటిల్లో ఆమెకు కొన్ని మాటలు మాత్రమే విన్పించాయి.

"చాన్నాళ్ళ క్రిందట నా బెడ్‌రూములోకి ఓ పక్షి ప్రవేశించింది. అది చలికాలం. పసుపు పచ్చని రంగు కలిసిపోయిన తవుడు వర్ణంలో వుంది. అచ్చం నీ చీర రంగే! అది కిటికీ రెక్కల్ని బద్దలు కొట్టుకొని బయటపడాలని ముక్కుతో పొడిచింది. రెక్కలతో తట్టింది. ఎంత కష్టపడిందో! అయినా ఏమైంది. అది అలసిపోయింది. నేల మీద వాలిపోయింది. దాన్ని నేను నా బూటు కాళ్ళతో నొక్కేశాను."

ఆ తర్వాత కొన్ని నిమిషాల పాటు మౌనం. అతను "నీకు చావు వాసన ఎలా వుంటుందో తెలుసా?" అని ప్రశ్నించాడు.

ఆమె కళ్ళెత్తి అతణ్ణి చూసింది. కాని, మాట్లాడ్డానికి గొంతు పెగలడం లేదు. చెప్పేందుకు ఆమె దగ్గర జవాబులు లేవని కాదు. చావు వాసనే కాదు. చావుకు వున్న రకరకాల వాసనలు తనకు తెలిసినట్లు మరెవ్వరికి తెలుసు? బాగా చీము పట్టిన పుళ్ళ వాసన, పళ్ళ తోటల తియ్యని వాసన, చందన ప్రమిదల వాస... అన్నీ తెలుసు తనకి. చీకట్లు నిండిన చిన్న గదిలో కటిక నేలమీద పడుకొన్న తన తల్లి మాట్లాడుతోంది.

"నాకొద్దు బిడ్డా! అయినా నొప్పి ఏమీ లేదు... అయినా వద్దు."

అమ్మ కాలి మీద పుళ్ళలో తెల్లని పెద్ద పెద్ద పురుగులు బిలబిలా కదులుతున్నాయి. అయినా అమ్మ 'బాధ ఏమీ లేదు' అనేది!

ఆ తర్వాత నాన్న పరిస్థితి. అతనికి మధుమేహం. ఉన్నట్టుండి కింద పడిపోయాడు. అప్పుడు ఆ గదిలోకి పళ్ళ తోటల్లోంచి వచ్చే ఓ గాలి ప్రవేశించినట్లు అన్పించింది. అలా తియ్యగా వుండేది ఆ గదిలో వ్యాపించిన వాసన. అదీ మరణమే కదా!

అవన్నీ అతనితో చెప్పాలని అనిపించింది. కాని నోరు రావడం లేదు.

గది మధ్య కూచున్న ఆ యువకుడు అప్పటికీ ఏదో మాట్లాడుతూనే వున్నాడు.

"నీకు తెలీదు. అయితే చెబుతా విను. మరణానికి పక్షి ఈకల వాసన వుంటుంది. నీకు అది తెలుసుకోవాలనుంది. ఇప్పుడేనా? ఏ టైమ్ నీకు బాగా ఇష్టం? తిన్నగా పై నుండి చూస్తోన్న సూర్యుని ముందు లజ్జ లేకుండా ఈ లోకం నగ్నంగా వున్న సమయమా? లేక సందెవేళా? నువ్వు ఎలాంటి స్త్రీవి? ధైర్యమున్న దానివా? పిరికిదానివా? అతను కుర్చీలోంచి లేచి ఆమె దగ్గరికి వెళ్ళాడు. మాంఛి పొడగరిలా వున్నాడు.

ఆమె "నన్ను వెళ్ళనివ్వండి. నేనిక్కడికి రావాలని ఎప్పుడూ అనుకోలేదు" అంది.

"అబద్ధం చెబుతున్నావు. నువ్వు ఎన్నిసార్లు ఇక్కడికి రావాలని అనుకోలేదు? ఎంతో సుఖప్రదమైన మరణం కోసం నువ్వు ఎన్నిసార్లు ఆరాటపళ్ళేదు? మృదువైన అలలతో దీర్ఘంగా నిట్టూర్చుతోన్న సాగరంతో సంగమించేందుకు సంభ్రమపడుతోన్న నదివి కదూ నువ్వు! చెప్పు ప్రేయసీ చెప్పు. ఆ అంతులేని లాలస అనుభవించడం కోసం నువ్వు ప్రేమించడం లేదూ?"

"ఇంతకీ ఎవరు మీరు?"

ఆమె లేచింది. అతని చేతి వేళ్ళకు బ్రహ్మాండమైన ఆకర్షణ శక్తి ఏదో వుందని తోచింది.

"నన్నెప్పుడూ చూడలేదా?"

"లేదు"

"నేను నీ దగ్గరికి ఎన్నిసార్లు రాలేదు? అప్పుడు నువ్వు కేవలం పదకొండేళ్ళ అమ్మాయివి. అదీ పచ్చకామెర్లు వచ్చి నువ్వు పక్కమీంచి తల ఎత్తలేక పడుకొన్న సమయం. ఆ రోజు మీ అమ్మతో నువ్వు "అమ్మా! నాకంతా పసుపుపచ్చగా కన్పిస్తోంది. పూలన్నీ పచ్చగానే కనిపిస్తున్నాయి... అన్నావు. ఆ విషయం నీకు గుర్తుకొస్తోందా?"

ఆమె లేదని తల ఊపింది.

నీ కళ్ళకి మాత్రమే కనిపించే పచ్చని పూల మధ్య నేనున్నాను. నీ చెయ్యి పట్టుకొని నిన్ను చేరాల్సిన చోటుకి చేర్చడానికి... వచ్చాను. అయితే ఆ రోజు నువ్వు నాతో రాలేదు. నీకు నా ప్రేమ గురించి తెలీదు. నేనే నీకూ, అందరికీ మార్గదర్శిని అని కూడా తెలీదు."

"ప్రేమా? ఇది ప్రేమేనా?" ఆమె ప్రశ్న వేసింది.

"అవును. ప్రేమలో పరిపూర్ణతని చూపించడం నా ఒక్కనికే తెలుసు. నాకు నువ్వు రకరకాలుగా కన్పిస్తావు. ఎర్రని పెదాలు, చక్రాల్లా తుళ్ళి తుళ్ళి పడే కళ్ళు, చక్కని శరీరపుష్టి.... అన్నీ నా అణువణువునా నువ్వే! తర్వాత నాకు కాకుండా పోతావు. కాని అన్నీ నువ్వే అవుతావు. కడలి హోరులోనూ నువ్వే! వర్షాకాలంలో తేగల్ని బద్దలు చేసుకొని మొలుస్తోన్న పాత చెట్లలోనూ నీ చలనమే! విత్తనాలు మట్టి అడుగున ప్రసవ వేదన పడుతో విలపిస్తున్నప్పుడు నీ దుఃఖం ఆవేదనతో పాటు మరింత ఎక్కువవుతోంది. నువ్వు గాలివి. నువ్వే వాన చినుకులుగా మారుతావు. నువ్వు మట్టి రేణువువి. నువ్వే ఈ సమస్త ప్రపంచ సౌందర్యంగా భాసిల్లుతావు."

ఆమె లేచి నించుంది. తన అలసటంతా తీరిపోయినట్లు అనిపించింది. కొత్తగా లభించిన ధైర్యంతో ఆమె ఇలా అంది.


"అదంతా నిజమే కావచ్చు. కాని మీరు నన్ను చూసి ఎవరో అనుకొని పొరబడుతున్నారు. నేను చనిపోయే సమయం రాలేదు. ఇప్పుడు నాకు ఇరవై ఏడేళ్ళే. వివాహితను. తల్లిని కూడాను. నేను చనిపోయే సమయం కాదు. నాకింకా ముందు ముందు బోలెడంత జీవితం వుంది. ఓ ఉద్యోగాన్వేషణలో బయల్దేరాను. టైమ్ పన్నెండున్నర అయి వుంటుంది. నన్ను ఇంటికి వెళ్ళనివ్వండి."

అతను ఇంక ఏమీ చెప్పలేదు. ఆమె బయటికి వెళ్ళేందుకు వీలుగా తలుపులు తెరిచాడు. ఆమె లిఫ్టు కోసం వడివడిగా అడుగులేసింది. ఆమెకు తన కాలి అడుగుల చప్పుడే మహా భయంకరంగా విన్పిస్తోంది.

లిఫ్టు దగ్గరికి రాగానే కాసేపు నిలుచుంది. అక్కడ దాన్ని ఆపరేట్ చేసే మనిషి లేడు. అయినా లోపలికి వెళ్ళి తలుపులు మూస్తూ స్విచ్ నొక్కింది. ఏదో బద్దలవుతోన్న చప్పుడుతో అది వున్నట్టుండి పైకి లేచింది. తను ఆకాశంలో వున్నట్లూ, పిడుగుల మోత వినవస్తున్నట్లూ ఆమెకు గోచరించింది. సరిగ్గా అప్పుడే ఆమె దృష్టి లిఫ్టులో వేలాడుతోన్న బోర్డు మీద నిలిచింది.

"లిఫ్టు చెడిపోయింది. అపాయం!"

ఆ తర్వాత అంతా అంధకారం! చప్పుడు చేస్తోన్న, గద్దిస్తోన్న అంధకారం. ఆమెకు ఆ లిఫ్టులోంచి ఎన్నటికి బయటికొచ్చే అవకాశమే లేదు.



## ఎన్.ఎస్. మాధవన్

1948లో ఎర్నాకుళంలో పుట్టారు. ప్రభుత్వోద్యోగి. 1970లో మాతృభూమి పత్రిక కళాశాల విద్యార్థుల కోసం నిర్వహించిన కథల పోటీలో వీరి 'శిశు'కి ప్రథమ బహుమతి లభించింది. 'చూళై మేడిలె శవంగళ్' అనే కథల సంకలనం ప్రచురించారు. చాలా తక్కువగా రాస్తారు.

చక్కని రచనతో, స్వప్న సదృశ్యమైన ఓ నూతన సంవేదనా శీలాన్ని మలయాళ పాఠకులకి అందించారు. తత్వశాస్త్రాల నేటి తాత్కాలికతలోంచి వీరి కథలు మనల్ని మానవీయ వాస్తవిక లోకంలోకి తీసుకొనిపోతాయి. ఇతనిది సరికొత్త శిల్పం.

ప్రస్తుతం ఢిల్లీలో మినిస్ట్రీ ఫర్ సివిల్ సప్లైస్, కన్జ్యూమర్ అఫైర్స్, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖలో ప్రైవేట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

వీరి భార్య తెలుగావిడే!

# హిగ్విట్ట

- ఎన్.ఎస్. మాధవన్

"పెనాల్టీ కిక్ ఎదురుచూస్తూ నిలుచున్న గోల్ కీపర్ ఏకాగ్రత" అనే జర్మన్ నవల గురించి ఇటలీ నుంచి వచ్చిన సాహిత్య పిపాసువు ఫాదర్ కాప్రయిట్టి ఓసారి గీవర్గిస్ అచ్చన్‌తో చెప్పి వుండాలి. లేదా అంతకన్నా ఎక్కువసార్లు చెప్పవచ్చు. నవల పేరు వినగానే గీవర్గీస్ అచ్చన్‌కు తాను దాన్ని ఒకటి కన్నా ఎక్కువసార్లు చదివినట్టే అనిపించింది.

రెండు చేతులు బారచాపి పెనాల్టీ కిక్ కోసం గోల్‌కీపర్ ఎదురుచూస్తున్నాడు. గాలరీల్లో ఏభైవేల మంది ఆత్రుతతో, ఉత్కంఠతతో వున్నారు. వాళ్ళ గొంతులు ఎండిపోయి వున్నాయి. ఒక ప్రేక్షకుడు మాత్రం మధ్యలో మూడుసార్లు అరిచాడు.

ఇలా అనేక రకాల కథల ద్వారా గోల్‌కీపర్ అవతారాల గురించి, మహత్యాల గురించి గీవర్గీస్ అచ్చన్ మనస్సులో అనుకున్నాడు. ఆ జర్మన్ నవల చదవాలనిపించలేదు. అయితే నవల్లో రాసినట్టు అతని కథ సంక్షిప్తంగా ఇది.

మొదటి కొన్ని రోజులు ఆ గోల్‌కీపర్ అచ్చం ఏసుక్రీస్తు అయివున్నాడు. ఒకటో నెంబర్ జర్సీ ధరించి ఆ ప్రభువు ఎన్నో బంతుల్ని ఆపాడు.

కొన్నాళ్ళయ్యాక వున్నట్టుండి గీవర్గీస్ అచ్చన్ వాళ్ళ నాన్న గోల్‌కీపర్ అయ్యాడు. ఇతను సైతం ఇందాకటి గోల్‌కీపర్ యొక్క అపరావతారం కావచ్చు. గీవర్గీస్ అచ్చన్ వాళ్ళ నాన్నకు రెండు చెవుల్లేవు. అయినా వింటి నించి విముక్తమయ్యే బాణం లాంటి వేగంతో దూసుకొచ్చే పెనాల్టీ కిక్ కోసం ఎదురు చూసేవాడు.

గీవర్గీస్ అచ్చన్ నివాసం దక్షిణ ఢిల్లీ. అక్కడ కొంతమంది మలయాళీలు కూడా వున్నారు. ఇక్కడి ఇళ్ళలో చాకిరీ చేయడానికి వచ్చిన స్త్రీలంతా బీహారు నుండి

వచ్చిన ఆదివాసీలు. వాళ్ళంతా నమ్మకస్తులు. వారానికి ఓసారి గీవర్గీస్ అచ్చన్ బిషప్పును చూడ్డానికి వెళతాడు. అప్పుడప్పుడు సాహిత్య చర్చల కోసం ఫాదర్ కాప్రయిట్టి వస్తాడు. ఇటీవల కొన్ని వారాలుగా కుర్బాన్ గడిచి బయటికి వెళుతుంటే, ఓ ఆదివాసీ స్త్రీ అచ్చన్ కోసం ఎదురుచూస్తూ నిలుచుంటోంది. ఆమె పేరు లూసి మరండి.

"ఫాదర్! అతను మళ్ళీ వచ్చాడు." లూసి క్రితం సారి అంది.

"ఎవరు?"

"గత ఆదివారం చెప్పలేదూ? అతనే!"

"ఊహూం! పేరు ఏమన్నావ్?"

"జబ్బార్"

"అవును. జబ్బార్ అని గుర్తుకొస్తోంది. ఎందుకొచ్చాడు?"

గతవారం చెప్పిన అదే పని కోసం.

గీవర్గీస్ అచ్చన్ బలహీనంగా మూలిగాడు.

"ఇంకా అతను నన్ను తన వెంట రమ్మన్నాడు."

గత జ్ఞాపకాలు వున్నట్టుండి అచ్చన్ మనస్సులో ఉల్కలై కురిశాయి. ఆదివాసి స్త్రీల నుండి కోళ్ళూ, మహువా, గుడ్డలూ కొని బయట అమ్ముకునే ఓ చిల్లర వ్యాపారి జబ్బార్. లూసీ వాళ్ళ ఊళ్ళో సైతం అతను ఇలా కోళ్ళు, వగైరా కొనేవాడు. అక్కడ... బీహార్లో ఓసారి దుర్భిక్షమైన పరిస్థితులు నెలకొన్నాయి. అది అదనుగా అతను ఆ ఆదివాసి స్త్రీలకు ఢిల్లీలో పనులు చూపించగలనని తీసుకొచ్చాడు. అలా లూసీ కూడా రాంచీ నించి రైలు ఎక్కి ఢిల్లీ చేరింది.

మాట తప్పకుండా జబ్బార్ ఆమెకు పని చూయించాడు. నెల నెలా ఆమెను చూడ్డానికి అతను వస్తాడు. అతను తన దగ్గర డబ్బులు అడుగుతాడేమో అని లూసీ ముందు భయపడింది. కానీ అతనే ప్రతిసారి లూసీకి ఏదైనా బహుమానంగా తీసుకెళ్ళేవాడు. బొట్టు బిళ్ళలు, సాండిల్ పౌడర్, లూసీకి మొట్టమొదటి బ్రహ్మాండమైన బ్రాసియర్... అందులోనూ నల్లని బ్రాలు... ఇవన్నీ తీసుకెళతాడు.

ఓ రోజు లూసీతో "పని చెయ్యడం మానేసి నా వెంటరా" అన్నాడు జబ్బార్. లూసీ నిస్సందేహంగా అదే చేసింది. ఆ రోజు సాయంకాలం జబ్బార్ ఆమెకు పసుపు మీదెర్రని చుక్కలున్న రెడీమేడ్ చీరా, కమీజూ తీసుకొచ్చి ఇచ్చాడు. ఎర్రని నైలెక్స్ చీరతో తలమీద చుట్టుకోవాలనీ, నల్లని బర్రె జెనిగల్లాంటి పెదాల మీద లిప్‌స్టిక్ పూసుకోవాలనీ... అతను నిర్బంధించసాగాడు.

అందగత్తె అయిన లూసీతో జబ్బార్ ఓ హోటల్ గదిలోకి ప్రవేశించాడు. అయితే గదిలోకి వెళ్ళడానికన్న ముందు అతనిలా అన్నాడు.

"నేను రాను."

"గది లోపలి సేఠ్ మంచి మనిషి. అతని తొందర చూస్తుంటే అతనికి ఇదే తొలి అనుభవం అన్పిస్తోంది. నీ అదృష్టం. లోపలికి వెళ్ళగానే ఏడొందల యాభై రూపాయలు ఇస్తాడు. వాటిని ముందు బయటికి పంపించు. తర్వాత... పని అయ్యాక నీ సామర్థ్యాన్ని బట్టి బహుమానమూ వుంటుంది. అది నీకు మాత్రమే సుమా!"

లూసీ హోటల్ లాబీలోంచి పరుగులు తీసింది. జబ్బార్ లేడి వెంట పులిలా వెంబడించాడు. చివరికి ఆమె జబ్బార్ గదిలోనే వుంది. తలుపులు మూసి వున్నాయి.

"నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను."

ఆమె తల వెంట్రుకల పాపిట్లో అతను మండే సిగరెట్టుతో సింధూరం పెట్టాడు. లూసీకి ఇంకా పెళ్ళీడు రాలేదనీ, చిన్న పిల్ల అనీ, ఏమేమో చెప్పేసి ఆ సిగరెట్టుతోనే ఆమె అరికాళ్ళ మీద కితకితలు పెట్టాడు. అతనప్పుడు హిందీ సినిమాలోని విలన్‌లా మాట్లాడాడు. ఆ తర్వాత అక్కణ్ణించి ఆమె ఎలా తప్పించుకుందో?

గీవర్గీస్ అచ్చున్ మనస్సులో మళ్ళీ గాలరీలు నిండిపోయాయి. అశ్రద్ధగా వున్న గోల్ కీపర్ చేతుల్లోంచి బంతులన్నీ జారిపోతున్నాయి. విత్తనాలు మట్టిలో పోసి పాడు చేసిన యూదా కుమారుడు ఓనాన్‌గా వున్నాడు నాటి గోల్‌కీపర్.

లూసీకి మళ్ళీ దక్షిణ ఢిల్లీలో పని దొరికింది. ఈ సంగతి జబ్బార్‌కి తెలీదు.

అయితే అతను ఎలాగోలా ఆమెను పదిరోజుల్లోనే పసికట్టగలిగాడు.

"అయినా నువ్వు జబ్బార్‌తో ఏం చెప్పావ్?"

"రాలేను అని"

"అదే మంచిది"

"కాని జబ్బార్..."

"నువ్వు పోలీసులకు ఫిర్యాదు చెయ్యి" అచ్చున్ ఉపదేశించాడు. "పోలీసులంటే నాకు జబ్బార్ కన్న ఎక్కువ భయం."

"అలా అంటే మరి గత్యంతరం?"

"ఫాదర్! మీరే ఏదో ఒకటి..."

"నువ్వు భయపడకు, నేను వెళతాను."

అచ్చున్ తన గదిలోకి వెళ్ళాడు. అతనికి మళ్ళీ ఫుట్‌బాల్ మైదానం గుర్తుకొచ్చింది. గాలరీలు ఖాళీగా వున్నాయి. పాప్‌కార్న్ పాకెట్లూ, ఐస్‌క్రీం కప్పులూ... జ్ఞాపకాల గుర్తుల్లా అక్కడా ఇక్కడా చెల్లాచెదురై వున్నాయి. బహుశా... గోల్‌కీపర్ విశ్రమిస్తూ వుండొచ్చు.

ఫోంచేసి పడుకోవడానికి వెళ్ళాడు. అచ్చున్‌కు నిద్ర రావడమే లేదు. ఇటలీలో జరుగుతోన్న ప్రపంచ ఫుట్‌బాల్ కప్పు గురించి హఠాత్తుగా గుర్తుకొచ్చింది. చిన్న బ్లాక్ అండ్ వైట్ టి.వి. ఆన్ చేసి, అచ్చున్ దాని ముందు కూచున్నాడు. అతనికి చిన్ననాటి విషయాలు గుర్తుకొచ్చాయి.

అచ్చున్ పి.టి. మాస్టారి కొడుకు కావడంతోటే ఫుట్‌బాల్ టీమ్‌లోకి తీసుకోవడం జరిగిందని స్కూల్ మూత్రశాల గోడల నిండా బొగ్గుల రాతలే! అలా గీవర్గీస్ అచ్చున్ అందరికీ పరిచయమయ్యాడు. అతను ఉత్త కాళ్ళతోనే ఫుట్‌బాల్ ఆడేవాడు.

జిల్లా ఛాంపియన్‌షిప్‌లోని మొదటి ఆటలోనే ఒలూర్ హెచ్.ఎస్.ను ఓడించాడు. తర్వాత కుప్పం కుళం బయలుదేరాడు. బస్సులో ఇతర పిల్లలు నిశ్శబ్దంగా వున్నారు. స్టేట్ టీమ్‌కు ఎంపికైన రబ్బాయి అనే వ్యక్తి కుప్పంకుళం స్కూలు కెప్టెన్. అచ్చున్ వాళ్ళ నాన్న మాట్లాడుతూనే వున్నాడు.

"మన జట్టులో ఏ ఒక్కరూ మార్కు చేయకుండా నించున్నారా అని చూడ్డానికి, బంతి కాలికి దొరగ్గానే ఒళ్ళన్నీ కళ్ళు చేసుకోవాలి."

అచ్చున్ వాళ్ళ నాన్న స్కూల్ ఫండ్‌లోంచి కొని ఇచ్చిన పళ్ళు, పప్పు వడలూ తిని, కున్నంకుళం వాసుల కేకలు వింటూ ఆటలో గెలుపొందాడు. చివరికి తిరుగు ప్రయాణం బస్సులో...

"అయ్యో! పొయ్యారా

కున్నంకుళం పొయ్యాం

అయ్యయ్యో పొయ్యారా

రబ్బాయి ఓడి పొయ్యాడు" అంటూ చప్పట్లు చరుస్తూ పాడుకోవడం జరిగింది.

"నువ్వూ పాడుకోరా" నిశ్శబ్దంగా వున్న గీవర్గాస్ అచ్చున్ చూస్తూ వాళ్ళ నాన్న వాత్సల్యంతో అన్నాడు.

"భయపడకు, నేనిప్పుడు నీకు నాన్నను కాదు, పి.టి. మాస్టార్‌ని"

ఆ తర్వాత గీవర్గీస్ అచ్చున్ ఆటంతా స్వంత గ్రౌండులోనే! క్యాపిటన్ గోపీనాథ్ తన్నిన బంతిని కూడా గోల్ చేయడంలో గీవర్గీస్ అచ్చున్ కీర్తి కేరళ నలుచెరగులా వ్యాపించింది. మలబార్ నుండి బోలెడు మంది రావడం ప్రారంభించారు. ఒక్కో ఆటకు

పది, పదిహేను వేల కరారు. అతనికి సెవెన్సు టోర్నమెంట్ ఆడటానికి కూడా పిలుపొచ్చింది.

కోతలైపోయిన పొలాల్లో పందెం వేసిన వాళ్ళు వేసే కేకల మధ్య గీవర్గీస్ సెవన్సు ఆడటం వాళ్ళ నాన్నకు ఏమాత్రం ఇష్టం లేకుండేది. ఓసారి దాని గురించే వాళ్ళ నాన్న "బిడ్డా! ఫుట్‌బాల్ నాకు చాలా నమ్మకమైన ఆట. సెవన్సు దానికి తిలోదకాలు అన్నమాట" అన్నారు.

కాని గీవర్గీస్ అచ్చున్ సెవన్సు ఆడకుండా వుండలేని స్థితికొచ్చాడు. క్రమంగా వాళ్ళ నాన్న అతనితో ఫుట్‌బాల్ గురించి మాట్లాడ్డం ఆపేశాడు.

ఆ తర్వాత వాళ్ళ నాన్న కన్నుమూశాడు. ఆ సంవత్సరమే గీవర్గీస్ అచ్చున్ బి.ఎ.లో తప్పాడు. అదంతా గతం.

గీవర్గీస్ అచ్చున్ టి.వి.లో వరల్డ్ కప్ చూస్తున్నాడు. పెనాల్టీ కిక్ కోసం ఎదురు చూస్తోన్న అనేక రకాల గోల్ కీపర్లు అతని మనస్సు మీద చెరగని ముద్రలు వేశారు. అచ్చున్ ఆటను గమనించడం లేదు. గోల్ కీపర్స్‌ను మాత్రం శ్రద్ధగా గమనిస్తున్నాడు.

మరో రోజు కుర్బాన్ అయిపోయి అతను బయటికి రాగానే లూసీ మళ్ళీ అచ్చున్ దగ్గరి కొచ్చి "ఫాదర్" అంది.

"ఉం?"

"జబ్బార్...."

"జబ్బార్?"

"జబ్బార్ నన్ను వెంటనే రమ్మంటున్నాడు."

"నువ్వు అసలు వెళ్ళవద్దు."

"నేను పని చేస్తున్న ఇంటికి రోజూ ఫోన్ చేస్తున్నాడు. ఇంట్లో వున్న వాళ్ళంతా పనుల మీద బయటికి వెళ్ళినప్పుడు గానీ, నిద్రపోయినప్పుడు గానీ ఠంచన్‌గా ఫోన్ చేస్తున్నాడు. నాకు ఎందుకో భయంగా వుంది."

"అన్నీ సర్దుకుంటాయి లూసీ" అచ్చున్ వెనుకంజ వేశాడు.

"గోల్‌కీపర్స్ గురించి బాగా నేర్చుకోవాలంటే వున్న ఒకే ఒక్క మాధ్యమం పెనాల్టీ కిక్" – గీవర్గీస్ అచ్చున్ తన గదిలోకి వెళుతూ ఇలా మనసులో అనుకున్నాడు. అతను మరో విషయం కూడా కనుక్కున్నాడు. అది పెనాల్టీ కిక్ కోసం ఎదురు చూస్తోన్న గోల్‌కీపర్ ఏకాకి కాదు. పైగా అతని ఏకాగ్రతను, ఏకాంతతను నష్టపరుస్తోన్న ప్రేక్షక సమూహం గురించి గోల్‌కీపర్‌కు మహా ఇబ్బందిగా వుంది.

ఆ తర్వాత ఓ మారు గీవర్గీస్ అచ్చన్ స్కూటర్ మీద వెళుతుండగా లూసీ కన్పించింది. ఎం.ఎల్.ఎ. మార్కెట్ గుండా ఆటోలో వెళ్తోన్న లూసీ సైతం అచ్చన్‌ను గమనించింది. ఆటోడ్రైవర్ వీపు తట్టి ఆమె ఆపమని చెప్పేసరికే, అచ్చన్ స్కూటర్ గేర్లు మార్చి వేగంగా వెళ్ళిపోయాడు.

గోల్‌కీపర్స్‌కు సంబంధించిన వ్యాసాల్లో ఓ చోట చిన్న అధో జ్ఞాపికగా టి.వి.లో కొలంబియా గోల్‌కీపర్ అయిన హిగ్విట్ట ప్రత్యక్షమయ్యాడు. ప్రళయ తాండవానికి ముందు జడలు విరబోసుకున్న శివునిలా పొడవాటి వుంగరాల జుట్టు, నల్లని రాళ్ళలాంటి ముఖమూ, సన్నని మీసాలూ వున్న హిగ్విట్టను గోల్‌కీపర్లలో ఓ ఎక్సెప్షనల్ కేసుగా ఎంచవచ్చు.

గోల్‌కీపర్స్ దృక్‌సాక్షిత్వం చక్కగా వుండాలి. సాధారణంగా అది పెనాల్టీకిక్‌ను ఎదుర్కొనేటప్పుడు నష్టపోతుంది. పైగా సభాకంపం. కాని హిగ్విట్ట ఎలాంటి జంకూ, గొంకూ లేకుండా ఎలాంటి సంఘటనలయినా ఎదుర్కొంటాడు. కొత్త అక్షాంశ రేఖల్ని కనుక్కొన్న క్యాపిటన్‌లా గోల్‌కీపర్స్ అందాకా కనుగొనని మైదాన మధ్యంలోకి బంతిని చక్కగా పరుగులు తీయిస్తాడు.

గీవర్గీస్ అచ్చన్ శ్రద్ధగా హిగ్విట్టను చూస్తున్నాడు. ఆ హిగ్విట్ట తన రెండు చేతుల్ని గాలిలో ఆర్కెస్ట్రా కండక్టర్‌లా ఊపుతున్నాడు. అర్ధ చంద్రాకారపు మలుపు తిరిగి వున్న స్టేడియంలోని ప్రేక్షకుల కోసం అతను ఫుట్‌బాల్ సంగీతాన్ని వినిపిస్తున్నాడు.

చివరికి హిగ్విట్ట నుండి బంతిని అవతలి జట్టు ఆటగాడు పట్టుకెళ్ళాడు. కొలంబియాను వరల్డ్ కప్ నుండి దూరం చేశాడు. కాని... హిగ్విట్ట ఏమాత్రం నిరాశ పడలేదు. ఏమీ జరగనట్టే ఎంతో ఉదాశీనంగా తన వంతు పాత్రని స్మరించుకొని మృదువుగా నవ్వడం... గీవర్గీస్ అచ్చన్ గమనించాడు.

అచ్చన్ కుర్బాన్ అయిపోయి బయటికి వెళ్ళాడు. ఆ రోజు కూడా అచ్చన్ కోసం లూసీ ఎదురుచూస్తోంది. అతను తనను ఆపదలోంచి రక్షిస్తాడనే ఆమె ఆశ. ఆమెను చూసి తన గదిలోకి మౌనంగా వెళ్ళిపోయాడు.

మైదానం మధ్యలో వుండి తన జట్టు ఆటగాడికి బంతి పాస్ చేశాక విలక్షణంగా వున్న హిగ్విట్టను చూస్తుంటే అచ్చన్‌కు మహా ఇష్టంగా వుంది. విలక్షణంగా వున్న హిగ్విట్ట గోల్ పోస్టులోకి శాంతచిత్తుడై ఎలాంటి ఆత్రుతా లేక తిరిగి వస్తున్నాడు.

“ఫాదర్” అది లూసీ పిలుపు.

అచ్చన్ ఠక్కున నిలుచున్నాడు.

"నేను జబ్బార్ దగ్గరికి వెళుతున్నాను."

ఆమె ఇంక జబ్బార్‌ను ప్రతిఘటించలేకపోతోంది.

"వెళ్ళడం నీకు ఇష్టమనా?"

"ఇష్టమనా అంటే..."

"మరి?"

"ఇవాళ సాయంకాలం లోపు అతని ఇంటికి వెళ్ళనట్లయితే, నా ముఖమ్మీదికి ఆసిడ్ బల్బు విసురుతానని బెదిరించాడు."

"నువ్వు' వెళ్ళేందుకు ఇష్టపడుతున్నావా?"

"ఒకవేళ... వెళితే అతను నన్ను కట్టుకుంటాడేమో!" లూసీ అపనమ్మకంతోనే పలికింది.

"వెళ్ళడం నీకు పూర్తిగా ఇష్టమేనా?"

"అతను నా మీదికి ఆసిడ్ బల్బు విసురుతాడు."

"నువ్వు రా" అంటూ అచ్ఛన్ ఆమెని తన వెంట రమ్మని పిలిచాడు. లూసీని బయట వుండమని చెప్పి, తన గదిలోకి వెళ్ళి లోహాను, జపమాలను తీసేశాడు. తర్వాత లూసీని వెంట బెట్టుకొని స్కూటర్ దగ్గరికి వెళ్ళాడు.

"ఎక్కు" స్కూటర్ స్టార్టు చేస్తూ అన్నాడు.

"జబ్బార్ ఇల్లు ఎక్కడ?"

"షకూర్‌పూర్ బస్తీ దగ్గర"

అచ్ఛన్ తన స్కూటర్‌నీ కారు వరుసల్లోంచీ, స్కూటర్ల నించీ తప్పిస్తూ పరుగులు తీయించాడు.

తట్టడం తరువాయి జబ్బార్ తలుపులు తీశాడు. ఉంగరాల జట్టూ, కలిసిపోయిన కనుబొమలూ, అయిదారు అడుగుల ఎత్తూ వున్న జబ్బార్ ముఖంలో మీసాలు నల్లబడిలేవు. అయినా అతని తల వెంట్రుకలు కాస్త నెరిసి వున్నాయి. మొత్తమ్మీద సరిగ్గా నిర్ణయించలేని ప్రాయం.

"వచ్చావా లూసీ" జబ్బార్ అడిగాడు. అతని మృదుమధుర స్వరం అచ్ఛన్‌ను ఆశ్చర్యపరిచింది.

"లోనికి రా" ! జబ్బార్ మెల్లగా అన్నాడు.

‘‘రాదు’’ గీవర్గీస్ అచ్చున్ స్థిరచిత్తంతో బదులిచ్చాడు. అప్పటిదాకా జబ్బార్ లూసీని తప్ప అచ్చున్‌ని గమనించనే లేదు.

“నువ్వు లోనికి వస్తున్నావా?”

“లేదు” అచ్చున్ మళ్ళీ అన్నాడు.

ఎలాంటి భావ వికారమూ లేని స్వరంతో జబ్బార్ ఏకాంతంగా ఏదో మాట్లాడుతున్నట్టుగానే

“లూసీ” ! ఇతను ఇక్కణ్ణించి వెళ్ళడమే కదా మనకు కావాల్సిందీ, మంచిదీ” అన్నాడు.

“కాదు” అంది లూసీ.

వెంటనే జబ్బార్ చెయ్యి పైకి లేవడమూ, లూసీ ఓ అడుగు వెనక్కి వేయడమూ, తలశ్శేరి ప్రాంతానికి సమీపంలో సెవన్సు చూడ్డానికి వచ్చిన వాళ్ళు “గీవర్గీసూ ! గీవర్గీసూ!!” అని కేకలు వేసినట్లు అచ్చున్‌కు వినిపించడమూ ఒకసారి జరిగిపోయాయి. పి.టి. మాస్టారు దూరంగా ఓ పక్క చెట్టుకి చేరగిలబడి నిలుచుని వున్న దృశ్యం అచ్చున్ మదిలో మెదిలింది. అంతే! అతను కాళ్ళు రివ్వున గాల్లోకి లేపి ఒక్క తన్ను బలంగా తన్నాడు. జబ్బార్ తలతో అచ్చున్ బంతాట ఆడాడు. తర్వాత కాళ్ళు లేపి ఓ దెబ్బ తగిలించాడు. అలా మళ్ళీ మళ్ళీ తగిలించాడు. ఆ తర్వాత స్లోమోషన్‌లో తన్నడం... జబ్బార్ మొదలు నరికిన చెట్టులా నేలపై కూలిపోయాడు. అతని ముక్కులోంచి రక్తం కారుతోంది. పెద్ద పెద్ద అక్షరాల్లో దాక్లహోమ అని రాసి వున్న అతని బనియన్‌ని దొరకబుచ్చుకొని లేపుతూ “రేపు సూర్యోదయంలోపు నువ్వు మళ్ళీ ఢిల్లీలో కన్పించొద్దు జాగ్రత్త!” అన్నాడు గీవర్గీస్ అచ్చున్. జబ్బార్‌ని వదిలేశాడు. అతను నేల మీద పడిపోయాడు.

లూసీని ఆమె పనిచేసే ఇంటి ముందు దిగబెట్టి అచ్చున్ తన గదిలోకి శాంతచిత్తుడై ఎలాంటి ఆత్రుత లేకుండా హిగ్విట్టలా వెళ్ళిపోయాడు.

మలయాళ కథ ఆవిర్భవించి 1991 నాటికే నూరేళ్ళు అయిన సందర్భంగా "మలయాళ మనోరమ" అనే పత్రిక కవులూ, రచయితలూ, పాత్రికేయులూ, విమర్శకులూ, ప్రచురణకర్తల్నీ సంప్రదించి 146 కథల్ని ఎంపిక చేసింది. వాటిల్లోంచి జనప్రియత్వం ఆధారంగా ట్యాబ్‌లేట్ చేసి ఓ పది కథల్ని ఎన్నుకొని తమ పత్రికలోనే ప్రచురించింది. వాటిని అనువదించి 1993లో "నూరేళ్ళ పది ఉత్తమ మలయాళ కథలు" అనే పేరున తెలుగు పాఠకులకు అందించారు. అచ్చు వేసిన వెయ్యి ప్రతులూ ఒక సంవత్సరంలోనే అమ్ముడైపోయాయి. కారణంగా ఆ పుస్తకాలు అందుబాటులో లేకుండా పోయాయి. ఇప్పుడు ఇరవై మూడు ఏళ్ళ తరువాత ఈ కథా సంకలనం నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ పునర్ ముద్రించింది.

నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్